# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 298 | బుధవారం,మే 20 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


### భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి

## తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది

**- లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరిక**



**న్యూఢిల్లీ (భారత శక్తి)** భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలు విఫలమవుతున్నాయని, ఆ తర్వాత వాటిల్లే భారీ నష్టాన్ని సామాన్యుడే ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో ఓ సభలో పాల్గొన్న రాహుల్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుబట్టారు.

2లో..

## మా ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు

**- మంత్రి జూపల్లి కృష్ణారావు**



**హైద్రాబాద్(భారత శక్తి)**

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తి చేశామని బీఆర్ఎస్ నేతలు మాట్లాడారని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. రెండేళ్లలో పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేస్తానని ఆనాడు కేసీఆర్ చెప్పి రూ.లక్ష కోట్ల ప్రాజెక్టుపై రూ.25 కోట్లే ఖర్చు పెట్టారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి

2లో..

### యుద్ధ ప్రాతిపదికన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల

# భూ సేకరణ ప్రక్రియ



**- సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ (భారత శక్తి)** పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీనితో పాటు జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. మంగళవారం నాడు ముఖ్యమంత్రి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులతో ఎంసీఆర్ హెచ్ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ఈ సందర్భంగా కీలకమైన సూచనలు చేశారు.జిల్లాలోని ప్రాజెక్టుల భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. పెండింగ్ బిల్లులను చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా

2లో..

# అక్రమార్కుడి ఇంట

# నోట్ల కట్టలు, బంగారు కుప్పలు

- ఏసీబీ సోదాల్లో బయటపడ్డ హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు జీఎం అవినీతి సామ్రాజ్యం
- మల్లాపూర్ నివాసంలో రూ. 1.05 కోట్ల నగదు, కేజీ బంగారం స్వాధీనం..
- సుమారు రూ. 100 కోట్ల పైగా అక్రమాస్తులున్నట్లు గుర్తింపు





**హైదరాబాద్ మే 19 భారత శక్తి:** సమాజంలో అవినీతి వేళ్లు ఎంత బలంగా నాటుకుపోయాయో నిరూపిస్తూ మరో భారీ అక్రమాస్తుల తిమింగలం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కింది. హైదరాబాద్ మురుగునీటి పారుదల, మంచినీటి సరఫరా సంస్థ (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) రెడ్ హిల్స్ విభాగం సాధారణ మేనేజర్ (జనరల్ మేనేజర్) కుమార్ నివాసాలపై ఏసీబీ అధికారులు మంగళవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో కళ్లు బైర్లు గమ్మేలా నగదు, బంగారం, భారీగా ఆస్తుల పత్రాలు లభ్యమయ్యాయి.

### మల్లాపూర్ నివాసంలో గుట్టలుగా నోట్ల కట్టలు,

సికింద్రాబాద్ పరిధిలోని మల్లాపూర్, వెంకటరమణ కాలనీలో ఉన్న కుమార్ స్వగృహంలో ఏసీబీ అధికారులు ఉదయం నుంచే ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో నిందితుడి ఇంట్లోని రహస్య ప్రదేశాల్లో దాచిన రూ. 1.05 కోట్ల నగదు,తో పాటు, ఒక కిలోగ్రాము బరువున్న బంగారు ఆభరణాలను, అధికారులు స్వాధీనం

2లో..

### ఇండో-మధ్యధరా ప్రాంతం కోసం

# వ్యూహాత్మక భాగస్వామ్యం

**-భారత్-ఇటలీ ప్రధానమంత్రులు నరేంద్ర మోదీ, జార్జియా మెలోనీ**

**ఇటలీ, మే 19 (భారత శక్తి):** భారత్-ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు నేడొక కీలక మలుపులో నిలిచాయి. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, భవిష్యత్తుపై సంయుక్త ఆశావహ దృక్పథం ప్రాతిపదికన ఇటీవలి కాలంలో అసాధారణ వేగంతో విస్తరిస్తూ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా రూపాంతరం చెందాయి. ముఖ్యంగా అంతర్జాతీయ

2లో..





## పొదుపు ఉద్యమానికి ఇ-సైకిళ్ల ఊతం

- స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలకు ఇ-సైకిళ్లు
- ఈవీ కంపెనీలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్
- ఈవీలు, ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు సమీక్షం



**అమరావతి,(భారత శక్తి)** ఇంధన పొదుపు కోసం చేపట్టే కార్యాచరణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఉద్యమంగా మార్చేలా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈవీ సైకిళ్లు, ఈవీ వాహనాల ను పెద్ద ఎత్తున ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఈవీ కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలో స్వర్ణ గ్రామ,స్వర్ణ వార్డు కార్యాలయాలకు ఎలక్ట్రిక్ సైకిళ్లు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మొత్తం 16 వేల ఎలక్ట్రిక్ సైకిళ్లను ఆ కార్యాలయాల సిబ్బందికి అందించాలని సీఎం నిర్దేశించారు.ఈవీ వాహనాలను సులభంగా కొనుగోలు చేసేలా రుణాలను అందించే ప్రయత్నం చేయాలని.. దీని కోసం ఓ ప్రత్యేక ఎస్పీవీని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈఎంఐ విధానంలో ఈవీ సైకిళ్లను ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలతో పాటు ఛార్జింగ్ స్టేషన్ల లాంటి మౌలిక

2లో..

### స్వచ్ఛ భారత్ మిషన్అర్బన్ 2.0 అమలు పురోగతిపై

# జాతీయ స్థాయి సమీక్ష



**న్యూఢిల్లీ (భారత శక్తి)** మంగళవారం నాడు న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్లో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన 2 రోజుల పాటు నిర్వహిస్తున్న "స్వచ్ఛ భారత్ మిషన్?అర్బన్ 2.0" జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరపున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు.ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా పట్టణాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ?ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. . రాష్ట్రాలు, నగరాల అనుభవాలు, ఉత్తమ

2లో..

# పంచాయతీరాజ్ శాఖను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దుదాం

- స్వచ్ఛ రథం తరహాలోనే గ్రీన్ షాప్ విధానం ప్రజల్లోకి తీసుకువెళ్లండి
- రోడ్ల పురోగతి తెలిసేలా ప్రత్యేక డ్యాష్ బోర్డు - స్వమిత్వ కార్యక్రమంలో రెవెన్యూ, సర్వే శాఖలతో సమన్వయం అవసరం

**అమరావతి,(భారత శక్తి)** పంచాయతీరాజ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. స్థానిక సంస్థలు చేసే అభివృద్ధి పనులు మరింత పారదర్శకంగా ప్రజలకు తెలియాలి. ఇందు కోసం ప్రత్యేకంగా ఒక పబ్లిక్ డాష్ బోర్డును తయారు చేయండి. దీనిలో రాష్ట్రంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణం, సంబంధిత అభివృద్ధి పనులు, అలాగే రోడ్ల పరిస్థితి ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసులుబాటు ప్రతి ఒక్కరికి కల్పించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ

2లో..






# అక్రమార్కుడి ఇంట నోట్ల కట్టలు, బంగారు కుప్పలు

చేసుకున్నారు. ఆదాయ వనరులకు మించి ఈ ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

### రూ. 100 కోట్ల అక్రమ సామ్రాజ్యం!

కేవలం నగదు, బంగారమే కాకుండా నిందితుడు కుమార్ పేరిట, అతని కుటుంబ సభ్యుల పేరిట ఉన్న భారీ స్థిరాస్తులను అధికారులు గుర్తించారు. ప్రాథమిక విచారణలో తేలిన ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి:

**భూములు:** నిజామాబాద్ జిల్లా పరిధిలో విలువైన 3 ఎకరాల భూమి.

**ఫ్లాట్లు:** హైదరాబాద్ నగరంలోని పలు ప్రధాన ప్రాంతాలలో 9 విలాసవంతమైన ఫ్లాట్లు.

**మొత్తం విలువ:** బహిరంగ మార్కెట్ ధరల ప్రకారం ఈ ఆస్తుల విలువ సుమారు రూ. 100 కోట్ల వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

### అవినీతి వెనుక 'సైకాలజీ': శాస్త్రీయ విశ్లేషణ

సమాజంలో ఉన్నత హోదా, నెలకు లక్షల్లో జీతం వస్తున్నప్పటికీ అధికారులు ఇలాంటి అక్రమ మార్గాల వైపు మళ్లడం వెనుక సామాజిక, మానసిక అంశాలు ఉన్నాయని నిపుణులు చెప్తున్నారు.

### క్రిమినాలజీ పరిశోధనల ప్రకారం:

ఒక వ్యక్తి అవినీతికి పాల్పడటానికి ప్రధానంగా మూడు కోణాలు దోహదం చేస్తాయి.

ఒకటి- ఆర్థిక అత్యాశ లేదా విలాసవంతమైన జీవన శైలిపై మోజు (ప్రేరణ), రెండు- వ్యవస్థలో ఉన్న లోపాలను వాడుకునే వీలుండటం (అవకాశం), మూడు- తాను చేసే తప్పును సమర్థించుకోవడం (సమర్థన). కుమార్ కేసులోనూ సుదీర్ఘ కాలంగా వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకుని ఈ అక్రమ సామ్రాజ్యాన్ని నిర్మించినట్లు స్పష్టమవుతోంది.

### ఇంకా కొనసాగుతున్న తనిఖీలు

కుమార్ నివాసంతో పాటు అతని బంధువులు, సన్నిహితుల ఇళ్లలోనూ ఏసీబీ బృందాలు ఇంకా సోదాలు కొనసాగిస్తున్నాయి. బ్యాంకు ఖాతాలు, లాకర్ల వివరాలు పూర్తిగా పరిశీలిస్తే ఈ అవినీతి తిమింగలం ఆస్తుల విలువ మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ దాడికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని ఏసీబీ ఉన్నతాధికారులు తెలిపారు.



# ఈ బాధ భరించలేకపోతున్నా అమ్మ..

**- చర్లపల్లి జైల్లో బండి భగీరథ్ ని కలిసిన తల్లి అపర్ణ..**




బండి సంజయ్ ఫామిలీ ఫైల్ ఫోటో..

చర్లపల్లి, భారతశక్తి: నేను ఈ టార్చర్ భరించలేకపోతున్నా అమ్మ అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు తన తల్లితో ఆవేదన వ్యక్తం చేశారని సమాచారం. చర్లపల్లి సెంట్రల్ జైల్లో పోక్సో కేసులో అరెస్ట్ అయిన భగీరథ్ ను తల్లి అపర్ణ మంగళవారం కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా తాను ఎటువంటి తప్పు చేయలేదని, కావాలనే కొందరు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇక్కడ ఉండలేక పోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారని సమాచారం..

# ఇండో-మధ్యధరా ప్రాంతం కోసం వ్యూహాత్మక భాగస్వామ్యం

వ్యవస్థ ప్రగాఢ మార్పులకు లోనవుతున్న తరుణంలో అత్యున్నత రాజకీయ, సంస్థాగత స్థాయిలలో క్రమబద్ధ ఆదానప్రదానాలు రెండు దేశాల భాగస్వామ్యాన్ని నిర్దేశిస్తున్నాయి. అనాదిగా సంక్రమిస్తున్న నాగరికతా జ్ఞానం మేళవింపుతో మా ఆర్థిక చైతన్యం, సామాజిక సృజనాత్మకత ఈ పరిణామానికి కొత్త కోణాన్ని ఆపాదిస్తున్నాయి. ప్రస్తుత 21వ శతాబ్దంలో ఆయా దేశాల ఆవిష్కరణ సామర్థ్యం, ఇంధన మార్పిడి నిర్వహణ, వ్యూహాత్మక సార్వభౌమత్వ బలోపేతం తదితరాలు ప్రజా శ్రేయస్సు, జాతీయ భద్రత వంటి అంశాలపై ఆధారపడి ఉన్నాయి. ఈ విషయంలో మా ఉమ్మడి అవగాహనను రెండు దేశాల మధ్య సహకారం ప్రస్ఫుటం చేస్తోంది. ఈ దిశగా కొత్త సంకల్పాల సాకారానికి, పరస్పర పూరక బలాల ఏకీకరణ సహా ద్వైపాక్షిక బంధాన్ని మరింత పటిష్ఠంగా, వైవిధ్యభరితంగా తీర్చిదిద్దడంపై మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం. ఇటలీ డిజైన్, తయారీ నైపుణ్యం, అంతర్జాతీయ స్థాయి సూపర్ కంప్యూటర్లతో పారిశ్రామిక కూడలిగా ప్రపంచంలో ఇటలీకి ప్రముఖ స్థానం ఉంది. అదేవిధంగా 100కు పైగా యూనికార్న్ సంస్థలు సహా 2,00,000 అంకుర సంస్థలతో భారత్ శరవేగంగా ఆర్థిక వృద్ధిని సాధిస్తోంది. దీంతోపాటు ఇంజనీరింగ్ ప్రతిభ-విస్తృతి, ఆవిష్కరణ-వ్యవస్థాపనావరణ వ్యవస్థలను కలిగి ఉంది. రెండు దేశాలకుగల ఈ సామర్థ్యాల మధ్య శక్తిమంతమైన సమన్వయ సాధన లక్ష్యాన్ని మేం నిర్దేశించుకున్నాం. ఇది ఓ సాధారణ ఏకీకరణకు పరిమితం కాదు... మా పారిశ్రామిక బలాలను పరస్పరం బలోపేతం చేసుకునే విలువ వ్యవస్థను సంయుక్తంగా సృష్టిస్తుంది. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు ఇనుమడించేందుకు ఐరోపా సమాఖ్య-భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) బాటలు వేస్తుంది. రక్షణ-ఏరోస్పేస్, కాలుష్య రహిత సాంకేతికతలు, యంత్రాలు, ఆటోమోటివ్ విడిభాగాలు, రసాయన-ఔషధ, జౌళి, వ్యవసాయ-ఆహార, పర్యాటకం సహా మరిన్ని రంగాలపై 'ఎఫ్‌టీఏ' దృష్టి సారిస్తుంది. తద్వారా 2029 నాటికి ఇటలీ-భారత్ మధ్య నిర్దేశిత 20 బిలియన్ యూరోల వాణిజ్య లక్ష్యాన్ని చేరడంతో సరిపెట్టకుండా దాన్ని అధిగమించాలన్నది మా ఆకాంక్ష. "మేడ్ ఇన్ ఇటలీ" అనేది అంతర్జాతీయంగా అత్యుత్తమ నాణ్యతకు పర్యాయ పదబంధం. ఇప్పుడిది "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమ నిర్దేశిత ఉన్నత నాణ్యత లక్ష్యంతో సహజ సమన్వయం ఏర్పరుచుకుంటుంది. ఈ నేపథ్యంలో భారత్ కోసం ఉత్పాదన దిశగా ఇటలీ వ్యాపార సంస్థలలో ఆసక్తి పెరుగుతోంది. మరోవైపు ఇటలీలో భారత పరిశ్రమల సంఖ్య కూడా పెరగడం (ప్రస్తుతం రెండువైపులా వీటి సంఖ్య 1000కి పైగానే) మా సరఫరా వ్యవస్థల ఏకీకరణను బలోపేతం చేసే సానుకూల సంకేతం. మా భాగస్వామ్యానికి సాంకేతిక ఆవిష్కరణలే పునాది. కృత్రిమ మేధ, (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, అత్యాధునిక తయారీ, కీలక ఖనిజాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో నేటి పురోగమన వేగం రాబోయే దశాబ్దాల్లో అసాధారణ పరిధిగల సాంకేతిక విప్లవంగా రూపుదిద్దుకోగలదు. ఈ క్రమంలో చైతన్యవంతమైన భారత ఆవిష్కరణావరణ వ్యవస్థ, అత్యంత నైపుణ్యంగల వృత్తి నిపుణుల వనరులు, ఇటలీకిగల అత్యధునాతన పారిశ్రామిక సామర్థ్యం మేళవింపుతో పైన పేర్కొన్న రంగాలన్నిటా మా సహకారం సహజసిద్ధమైనదిగా, వ్యూహాత్మకంగా రూపొందుతుంది. రెండు దేశాల్లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం ఈ పరిణామశీలతకు ఇతోధికంగా తోడ్పడుతుంది. ఇక భారత సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఇప్పటికే అనేక దేశాల్లో ముఖ్యంగా వర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో సానుకూల స్పందన లభిస్తోంది. కృత్రిమ మేధ రంగం మా రెండు దేశాలతోపాటు ముఖ్యంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ఇప్పటికే తనదైన ముద్ర వేసింది. ఈ ఆధునిక సాంకేతికత పురోగమనం బాధ్యతాయుతంగా, మానవాళి కేంద్రకంగా కొనసాగేలా చూడటంలో భారత్, ఇటలీ చాలాకాలం నుంచీ పరస్పర సహకారంతో కృషి చేస్తున్నాయి. ఈ దృక్కోణంతో 'ఏఐ'ని సార్వజనీన ప్రగతికి ప్రత్యేకించి వర్ధమాన దేశాలకు ఒక శక్తిమంతమైన సాధనంగా మేం పరిగణిస్తున్నాం. ప్రస్తుతం అందుబాటులోగల బహుభాషా సాంకేతికతల మధ్య వ్యత్యాసాలు మరింత పెరగకుండా చూడటమేగాక వాటిని వీలైనంత తగ్గించడానికి ఈ సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాలు దోహదం చేయగలవు. సాంకేతికత పరిజ్ఞానాలను మానవాళి కేంద్రకంగా ఉంచేందుకు 'మానవ్' పేరిట భారత్ ఒక దార్శనిక విధానం అనుసరిస్తోంది. అదేవిధంగా మానవతావాద సంప్రదాయంలో పాదుకున్న మానవ-కేంద్రక 'అల్గార్-ఎథిక్స్'ను ప్రోత్సహించడంలో ఇటలీ ముందంజ వేసింది. ఈ రెండు దృక్కోణాలు ప్రాతిపదికగా కృత్రిమ మేధ పరిజ్ఞానం సామాజిక సాధికారతను ఉత్తేజితం చేయాలన్నది మా భాగస్వామ్యం నిర్దేశించుకున్న లక్ష్యం. ఈ దిశగా భారత డిజిటల్ స్థాయిని, ఇటలీ నైతిక-పారిశ్రామిక నైపుణ్యాన్ని మేళవిస్తూ సాంకేతిక పరిజ్ఞానం మానవాళి ఔన్నత్యానికి సేవలందించేలా భరోసా ఇవ్వడమే మా విధానం. డిజిటల్ సహకారం, సామర్థ్య వికాసం, పటిష్ఠ సైబర్ మౌలిక సదుపాయాల కల్పనలో ఉత్తమ విధానాల ఆదానప్రదానం ద్వారా ప్రతి దేశం 'ఏఐ'ని తీర్చిదిద్దుకోవాలన్నది మా నిశ్చితాభిప్రాయం. తదనుగుణంగా ప్రయోజనం పొందగలిగే సార్వత్రిక, విశ్వసనీయ, సమాన అవకాశాలుగల డిజిటల్ ప్రపంచ సృష్టి మా ధ్యేయం. ఇటలీ జి7 అధ్యక్షతకు, న్యూఢిల్లీలో నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సత్ఫలితాలకు మూలం ఈ సంయుక్త దృక్పథమే. కృత్రిమ మేధను మానవాళి కోసం. మానవ మేధ సృష్టించిన ఉపకరణంగా మాత్రమే భావించాలి. అంటే- ఆధునిక సాంకేతికత వ్యక్తులకు స్థానభ్రంశం కలిగించదని లేదా వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించదని, ప్రజల వాక్స్వాతంత్ర్యాన్ని లేదా ప్రజాస్వామ్య ప్రక్రియలను తారుమారు చేయదని ప్రస్ఫుటం చేయడమే. ప్రపంచం నానాటికీ పరస్పర సంధానితం అవుతున్న పరిస్థితులలో సరిగ్గా ఈ సమస్యను పరిష్కరించడంపైనే మానవ స్వేచ్ఛను, గౌరవాన్ని పరిరక్షించాలనే మా విధానం ఆధారపడి ఉంటుంది. అంతరిక్ష రంగంలోనూ మా సహకారం కొనసాగుతుంది. అంతరిక్ష పరిశోధన, ఉపగ్రహ సాంకేతికతలలో భారత్ ఇప్పటికే అద్భుత ప్రగతి సాధించింది. ఇప్పుడిక ఇటలీ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ నైపుణ్యం తోడ్పాటుతో సంయుక్త కార్యక్రమాలు చేపట్టడం సహా భవిష్యత్తరం సాంకేతిక పరిజ్ఞానాల రూపకల్పనకు గణనీయ అవకాశాలు అందివస్తాయి. ప్రపంచ దేశాల శ్రేయస్సుకు భరోసా లభించాలంటే జాతీయ భద్రత-స్థిరత్వం అత్యావశ్యకం. కాబట్టే రక్షణ-భద్రత, వ్యూహాత్మక సాంకేతికతలు వంటి రంగాల్లో సహకార బలోపేతానికి ఇటలీ, భారత్ సంకల్పించాయి. కీలక సముద్ర మార్గాల భద్రతకు భరోసాతోపాటు ఉగ్రవాదం, అంతర్జాతీయ నేర నెట్‌వర్క్‌లు, మాదకద్రవ్యాల దొంగ రవాణా, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా వంటి ముప్పులను ఎదుర్కొనగల సామర్థ్యాన్ని పటిష్ఠం చేయడంలో ఈ సహకారం దోహదం చేస్తుంది. మా భాగస్వామ్యానికి ఇంధన రంగం మరో మూలస్తంభం. వైవిధ్యభరిత ఇంధన వనరుల దిశగా ప్రపంచ ప్రస్థానంలో ఆవిష్కరణ, పెట్టుబడులు, సహకారం అత్యావశ్యకాలు. ఈ నేపథ్యంలో పునరుత్పాదక ఇంధనాల నుంచి హైడ్రోజన్ సాంకేతికతల దాకా.. స్మార్ట్ గ్రిడ్‌ల నుంచి పునరుత్థాన మౌలిక సదుపాయాల వరకూ భారత్-ఇటలీ ఇప్పటికే సహకారం కొనసాగిస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతుల కూడలిగా మారడం కోసం భారత్ కృషి ఫలితంగా మా భాగస్వామ్యానికి అసాధారణ సామర్థ్యం సమకూరుతోంది. పునరుత్పాదక మౌలిక సదుపాయాల కల్పనలో ఇటలీకిగల అత్యాధునిక సాంకేతికతతోపాటు ఐరోపాకు ఇంధన ముఖద్వారంగా దాని వ్యూహాత్మక పాత్రకు ఇది సంపూర్ణంగా తోడ్పడుతుంది. ఈ నేపథ్యంలో భారత్ నేతృత్వాన ఏర్పడిన అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ), విపత్తు పునరుత్థాన మౌలిక సదుపాయాల కూటమి (సీడీఆర్ఐ), అంతర్జాతీయ జీవఇంధన కూటమి (జీబీఏ) వంటి సంకీర్ణ సంస్థల కృషిలో ఇతర దేశాలతోపాటు మా సహకారం కూడా కీలకం. భౌతిక, డిజిటల్, మానవ అనుసంధానమే మా భాగస్వామ్యాన్ని మరింతగా పెనవేసిన సూత్రం. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు కీలక కేంద్రాలైన ఇండో-పసిఫిక్, మధ్యధరా ప్రాంతాల నడిబొడ్డున భారత్, ఇటలీ ఉన్నాయి. కాబట్టి, ఈ ప్రాంతాలను వేర్వేరు పరిధులుగా కాకుండా అంతకంతకూ పరస్పర సంధానితం అవుతున్న ప్రదేశాలుగా పరిగణించాలి. వాస్తవానికి.. హిందూ మహాసముద్రాన్ని ఐరోపాతో ముడిపెట్టే వాణిజ్య, సాంకేతిక, ఇంధన, డేటా సహా సమాలోచనలకు కీలక మార్గమైన భారత-మధ్యధరా ప్రాంతం ఆవిర్భావానికి మా రెండు దేశాలే ప్రత్యక్ష సాక్షులు. సరిగ్గా ఈ పరస్పర సంధాన క్రమంలోనే మన స్నేహబంధం సహజ రీతిలో ఒక ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా పరిఢవిల్లుతూ- రెండు ఖండాలను కలిపి, కొత్త ప్రపంచ గమనానికి రూపుదిద్దుతుంది. ఈ పరిస్థితుల నడుమ ఆధునిక రవాణా, మౌలిక సదుపాయాలు, డిజిటల్ నెట్‌వర్క్‌లు, ఇంధన వ్యవస్థలు, పటిష్ఠ సరఫరా వ్యవస్థలతో మన ప్రాంతాలను అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకున్న దార్శనికతకు భారత్-మధ్యప్రాచ్య-ఐరోపా ఆర్థిక కారిడార్ (ఐఎంఈసీ) ఒక ప్రతీక. ఈ దృక్కోణానికి వాస్తవికతను ఆపాదించడంలో ఇతర భాగస్వాములతో సమష్టిగా కృషి చేసేందుకు భారత్, ఇటలీల నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాయి. మాకెదురయ్యే ఉమ్మడి సవాళ్ల పరిష్కారంలో రెండు దేశాల మధ్యగల ప్రగాఢ భాగస్వామ్యం, శాశ్వత సాంస్కృతిక సంబంధాలను సద్వినియోగం చేసుకుంటాం. భారతీయ సంస్కృతి ప్రబోధించే 'ధర్మం' అనే ఉదాత్త భావన మా చర్యలకు మార్గనిర్దేశం చేసే బాధ్యతా స్ఫూర్తిని ఉత్తేజితం చేస్తుంది. ఆ క్రమంలో నేటి పరస్పర సంధాన డిజిటల్ యుగంలోనూ 'వసుధైవ కుటుంబకం' (యావత్ ప్రపంచం ఒకే కుటుంబం) సూత్రం మానవాళి మొత్తాన్నీ ముడివేయడంలో శక్తిమంతంగా పనిచేస్తుంది. పునరుజ్జీవన పథంలో పయనించే ఇటలీ మానవతావాద సంప్రదాయం కూడా ఈ విలువలను సహజంగా ప్రతిబింబిస్తుంది. ప్రపంచంలోని ప్రతి వ్యక్తి గౌరవాన్ని, ప్రజలను-సమాజాలను ఏకం చేసే సంస్కృతికిగల అపార శక్తిని ఇది తేటతెల్లం చేస్తుంది. అందుకే, రెండు దేశాల ప్రజలకు కేంద్ర స్థానమిస్తూ బలమైన, భవిష్యత్ దృక్కోణ సహిత భారత్-ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి పునాది వేయాలని మా సంయుక్త దార్శనికత లక్ష్యనిర్దేశం చేసుకుంది.

## మా ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు

ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ కాంగ్రెస్ హయాంలో వచ్చినవేనని గుర్తు చేశారు. కాళేశ్వరం పూర్తి చేసినట్లు పాలమూరు ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదని అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డికి కావాల్సిన 90 టీఎంసీలు బీఆర్ఎస్ తేలేకపోయిందని, తాము తెచ్చి తీరుతామని అన్నారు. పాలమూరుపై బీఆర్ఎస్‌ది సవతి తల్లి ప్రేమ అని అన్నారు. సమీక్ష అనంతరం ఈ మేరకు మాట్లాడారు.

## యుద్ధ ప్రాతిపదికన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలభూ సేకరణ ప్రక్రియ

అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాజేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

## పొదుపు ఉద్యమానికి ఇ-సైకిళ్ల ఊతం

సదుపాయాలను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఛార్జింగ్ స్టేషన్లతో పాటు మౌలికసదుపాయాల కల్పించటంపై ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం పేర్కొన్నారు.

## స్వచ్ఛ భారత్ మిషన్అర్బన్ 2.0 అమలు పురోగతిపై జాతీయ స్థాయి సమీక్ష

విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, ఇంటింటి చెత్త సేకరణ, 4-వే సోర్స్ సెగ్రిగేషన్, ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లు, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్యార్డుల బయోమైనింగ్, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల తొలగింపు, ఆర్ఆర్ఆర్ కేంద్రాలు, ఈ-వేస్ట్ సేకరణ, కిటాక్యుష మోడల్లో ఎకో టౌన్ ఏర్పాటు వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉప ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణ విజన్?2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని స్వచ్ఛమైన, పర్యావరణహితమైన, సుస్థిర పట్టణాభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను కూడా ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో మనోహర్ లాల్ ఖట్టర్ తో పాటు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయమంత్రి తోఖన్ సాహు , కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ కటికితల , రూపా మిశ్రా,పలు రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు,అధికారులు పాల్గొన్నారు

## పంచాయతీరాజ్ శాఖను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దుదాం

2025-26 ఆర్థిక సంవత్సరానికి స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆన్ లైన్ విధానంతో పారదర్శకంగా పన్నులు వసూళ్లు చేసిందని చెప్పారు. పంచాయతీలు ఆదాయ వనరులు మరింత పెంచుకొని ముందుకు సాగాలని, ఇదే రీతిలో సమష్టి కృషిని కొనసాగించి వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఆ స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల ఉన్నతాధికారులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఇటీవల పంచాయతీరాజ్ శాఖ ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "శాలిడ్ వేస్ట్ మేనేజ్మెంటులో భాగంగా తీసుకొచ్చిన స్వచ్ఛరథాల విధానం మంచి ఫలితాలను ఇస్తోంది. స్వచ్ఛందంగా ప్రజలు రథాల వద్దకు వచ్చి పొడి వ్యర్థాలను ఇచ్చి, నిత్యావసరాలను తీసుకెళ్లడం బాగుంది. దీన్ని ప్రతి నియోజకవర్గంలోనూ అమలు చేస్తున్నాం. ఈ విధానాన్ని మరింత విస్తరించేలా ఆలోచన చేయండి. దీంతోపాటు గ్రీన్ షాప్ పేరుతో తిరుపతి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చిన విధానాన్ని మరింత విస్తరించి, రాష్ట్రమంతటా అమలు చేయాలి. స్వచ్ఛరథాల ద్వారా ఏప్రిల్ నెలలో 18.86 లక్షల కేజీల చెత్తను సేకరించాం. ఆ వ్యర్థాల విలువ రూ. 3 కోట్ల వరకు ఉంటుంది. గ్రీన్ షాపులను ఇదే స్ఫూర్తితో ప్రజలకు దగ్గర చేయాలి. పొడి వ్యర్థాలను గ్రీన్ షాపుల్లో ఇస్తే, ప్రజలు నిత్యావసరాలను తీసుకెళ్లొచ్చని విస్తృత ప్రచారం కల్పించండి. తద్వారా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన పెంచండి రోడ్లు పూర్తి చేయడానికి నిర్దుష్ట సమయంపంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులు నిర్దుష్ట సమయంలో నాణ్యతతో పూర్తయ్యేలా చూడండి.

# భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది

శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని దుయ్యబట్టారు. పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళుతున్నారని విమర్శించారు. సమస్య పెట్రోల్, విద్యుత్ వాహనాలతో కాదని, అది ద్రవ్యోల్బణంతో అని ప్రధాని అర్థం చేసుకోవాలని సూచించారు. వెంటనే చర్యలు తీసుకుని దేశాన్ని రక్షించాలని కోరారు."భారీ ఆర్థిక తుపాన్ రాబోతోంది. దీన్ని ఎవరూ అడ్డుకోలేరు. అంత తీవ్రమైన ఆర్థిక తుపాన్ రాబోతోంది. అది ఎంతపెద్దది అంటే మీరు, నేను మన జీవితంలో ఎప్పుడూ చూడలేనంత పెద్దది. దెబ్బ ఎవరికి తగులుతుంది? అంబానీ, అదానీలకు తగలదు. వాళ్లు తమ ప్యాలెస్‌లో కూర్చుని ఉంటారు. వాళ్ల ప్యాలెస్‌ల చుట్టూ భద్రత ఉంటుంది. భారత రైతుకు, కార్మికుడికి, యువతకు, చిన్న వ్యాపారస్థులకు, చిన్న పరిశ్రమలకు దెబ్బతగులుతుంది. ఏవైతే ఉపాధిని కల్పిస్తాయో, వాటికి నష్టం కలగనుంది. ఇప్పుడు మేం చెప్తున్నాం నెలల ముందు నుంచే నేను చెప్తున్నాను. ఆర్థిక తుపాన్ వస్తోంది, సిద్ధం కావాలి అని. ప్రజలకు భారీ దెబ్బ తగలబోతోంది, పెట్రోల్ ధరలు పెరగబోతున్నాయని, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకబోతోందని చెబుతున్నాను. వాళ్లేమో (బీజేపీ) రాహుల్ గాంధీకి ఏం అవగాహన లేదని అంటున్నారు. ఇరాన్- అమెరికా మధ్య యుద్ధం చెలరేగడంతో మన ఇంధన సరఫరాలను ఇరాన్ నిలిపివేసింది. ఫలితంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. పెట్రోల్, డీజిల్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని మోదీ ప్రజలకు సలహా ఇస్తున్నారు. కానీ, మరుసటి రోజే మోదీ స్వయంగా విదేశాలకు వెళ్తున్నారు."ప్రభుత్వాన్ని మార్చాలని ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపుప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని మార్చకపోతే దేశం మనుగడ సాగించలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజకీయ వాస్తవాలపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన లోపించడం వల్లే ఎంజీఎన్ఆర్ఈజీఏ వంటి గ్రామీణ సామాజిక భద్రతా కార్యక్రమాలు పూర్తిగా రద్దు అవుతున్నాయని, చిన్న రైతులు ఆర్థికంగా నాశనమవుతారని హెచ్చరించారు. మరోవైపు దేశ అగ్ర నాయకులు మాత్రం కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడానికే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని నియామకం




నిజామాబాద్,ఏప్రిల్ 19(భారత శక్తి ): కమ్మర్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా ఉప్లూర్ గ్రామానికి చెందిన బోనగిరి భాస్కర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్షుడు బోనగిరి భాస్కర్ మాట్లాడుతూ పార్టీ ఎంతో నమ్మకంతో తనకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మండలంలో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు. తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానని భాస్కర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పాలేపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, ఉప్లూర్ గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్, పడిగేలా ప్రవీణ్, ఉప సర్పంచ్ ముత్యం, శ్రీనివాస్, నరేష్, రాజశేఖర్ చౌట్పల్లి సర్పంచ్ అభ్యర్థి రాజేష్, శేఖర్,నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన



సిద్దిపేట, మే 19( భారత శక్తి ):కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసి నిల్వ ఉంచిన ధాన్యపు బస్తాలను వెంటనే కొనుగోలు చేయాలని పెద్దగుండవెల్లి రైతులు డిమాండ్ చేస్తూ సిద్దిపేట-మెదక్ హైవే (ఎన్‌హెచ్ 765డి)పై ఆందోళన చేపట్టారు. లారీలు రాకపోవడంతో ధాన్యం నిల్వ ఉండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక బస్తాకు 41 కిలోలు వేయాల్సి ఉండగా 42 కిలోల వరకు తూకం వేస్తున్నారని రైతులు సంజీవ్ రెడ్డి, మల్లారెడ్డి ఆరోపించారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వాపోయారు. ఆందోళనతో హైవేపై రాకపోకలకు అంతరాయం కలగగా, దుబ్బాక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. ఈ ధర్నాలో రైతులు మల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రవి, భాస్కర్, మహిపాల్, ముత్యం, గణేష్, తదితర రైతులు ఉన్నారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## కేసీఆర్-జగన్-విజయ్ రీజనల్ ఫ్రంట్...

ఒక తాజా ముఖ్యమంత్రితో చేతులు కలిపి ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు తమ రాజకీయ పునరుత్తేజం పొందాలని చూస్తున్నారా. ఏకంగా సౌత్‌లో రీజనల్ రెలీజియన్ ఫ్రంట్ కి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారా అంటే జరుగుతున్న ప్రచారం బట్టి చూస్తే అవును అనే మాట వస్తోంది. ఆ పార్టీలు బీఆర్ఎస్, వైసీపీ టీవీకే అయితే అధినాయకులు కేసీఆర్ జగన్ విజయ్ అని అంటున్నారు. ఇందులో కేసీఆర్ రెండు సార్లు తెలంగాణాకు సీఎం గా చేసి ఓటమి పాలు అయ్యారు. ఏపీలో ఒకసారి అధికారంలోకి వచ్చిన జగన్ కూడా రెండేళ్ళుగా మాజీ సీఎం గా ఉన్నారు. ఇక రెండేళ్ళ క్రితం పార్టీ పెట్టి తాజాగా తమిళనాడు ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన విజయ్ ఇపుడు కేసీఆర్ జగన్ భవిష్యత్తు రాజకీయాకు ఒక ఆశాకిరణంగా కనిపిస్తున్నారు అని అంటున్నారుతెలుగు రాజకీయాల్లో కొత్త సమీకరణలకు ప్రధాని నరేంద్ర మోడీ తాజా పర్యటన దారి తీసింది. ఇక్కడ ఒక విషయం ఫుల్ క్లారిటీ వచ్చింది. ఎన్డీయే బంధం మరింత పటిష్టం అయింది అని. పైగా టీడీపీ బీజేపీ జనసేన 2029 లో కూడా కలసికట్టుగా సాగుతాయని అర్ధం అవుతోంది. అంతే కాదు ఈ మోడీ బాబు పవన్ ల మధ్య మిత్ర బంధం మరింత బలీయం అయింది. దాంతో వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణాలో బీఆర్ఎస్ తో బీజేపీ కలుస్తుందన్న ప్రచారం పూర్తిగా పక్కకు పోయింది. అలాగే ఏపీలో వైసీపీతో ఏదో నాటికి బీజేపీ స్నేహ హస్తం గట్టిగా అందిస్తుందన్న అశలూ అడుగంటాయని అంటున్నారు.ఈ నేపథ్యంలో ఎన్డీయేకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి వైసీపీకి అనివార్యంగా కనిపిస్తోంది. ఇంత జరిగిన తరువాత కూడా ఎన్డీయేకు మద్దతు పరోక్షంగా అయినా ఇస్తూ పోతే అది పార్టీ జనంలో బయట జనంలో తప్పుడు సంకేతాలు ఇచ్చే చాన్స్ ఉంటుంది. వాటికి మించి వైసీపీకి బలంగా ఒక్క మైనారిటీ ఎస్సీ ఎస్టీ ఓటు బ్యాంక్ కూడా రివర్స్ అవుతుందన్న చర్చ కూడా ఉందని అంటున్నారు. ఇక ఏపీలో 2029 ఎన్నికల్లో బాబు పవన్ మోడీల త్రిమూర్తులను వైసీపీ అధినేత జగన్ మరోసారి ఎదుర్కోవాల్సిన పరిస్థితి అయితే ఉంది. దాంతో వైసీపీ ఇక మూడేళ్ళు ముందుగానే తన రాజకీయ యాక్షన్ ప్లాన్ ని రెడీ చేసుకోవాల్సిన సమయం వచ్చేసింది అని అంటున్నారు.తెలంగాణాలో కేసీఆర్ విషయం తీసుకుంటే కాంగ్రెస్ అక్కడ స్థానికంగా అధికారంలో ఉంది. దాంతో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ తో నేరుగా చేతులు కలపలేని పరిస్థితి ఉంది. అలాగని బీజేపీతో కలసి ముందుకు సాగే సీన్ కూడా లేదు, బీజేపీతో బాహాటంగా కలిస్తే మైనారిటీ ఓట్లు ఇతర అణగారిన వర్గాల ఓట్లు పోతాయన్న భయం ఉంది. అయితే బీజేపీ పట్ల ఎంతో కొంత సాఫ్ట్ కార్నర్ తో అయితే బీఆర్ఎస్ ఉందన్న ప్రచారాన్ని కాంగ్రెస్ వర్గాలు ఇంతకాలం చేస్తూ వచ్చాయి. అందులో నిజమెంత ఉందో తెలియదు కానీ ఇపుడు మాత్రం మోడీ బాబు పవన్ తెలంగాణాలో కూడా ఎన్డీయే గా ముందుకు వస్తే మాత్రం బీఆర్ఎస్ కొత్త ఆలోచనలు చేయాల్సిందే అన్నది కూడా గులాబీ పార్టీలో ఉంది: ఇదిలా ఉంటే జాతీయ స్థాయిలో ఇండియా కూటమి వైపు కేసీఆర్ జగన్ చూపు పడుతోందా అన్న చర్చ కూడా ఉంది. ఎంత లేదనుకున్నా కాదనుకున్నా జాతీయ రాజకీయాన్ని కూడా గమనిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. అంతే కాదు తెలంగాణాలో ఏకంగా మోడీయే రంగంలోకి దిగితే ప్రాంతీయ పార్టీలతో అయినా చెలిమి చేయడం ద్వారా బలం పెంచుకోవాలన్నది బీఆర్ఎస్ ఆలోచనగా ఉంది అని అంటున్నారు. దాంతోనే తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి టీవీకే అధినేత విజయ్ తో స్నేహం నెరిపే విషయంలో బీఆర్ఎస్ ఉత్సహాం చూపిస్తోంది అని అంటున్నారు. అదే సమయంలో వైసీపీ అధినేత జగన్ కూడా విజయ్ తో చెలిమి చేస్తున్నారు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాలలో రెండు కీలక పార్టీలు ఇపుడు జాతీయ రాజకీయాల్లో కొత్త రూట్ లోకి వెళ్తున్నాయా అన్న చర్చ సాగుతోంది. నిజానికి ఈ రోజున దేశ రాజకీయాలలో ప్రాంతీయ పార్టీలు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఎన్డీయేలో జనసేన టీడీపీ ఉంటే మరి కొన్ని పార్టీలు కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమిలో ఉన్నాయి. అయితే ఈ రెండు కూటములలో లేని ఉండలేని ప్రాంతీయ పార్టీలుగా తెలుగు నాట బీఆర్ఎస్ వైసీపీలను చెప్పుకోవాలి. ఈ రెండు పార్టీలకు కాంగ్రెస్ రాజకీయ ప్రత్యర్ధి. దాంతో ఇండియా కూటమిలోకి కలవలేరు, అలాగే ఎన్డీయే నాయకత్వంలోని కూటమిలో కూడా చేరలేరు. దాంతో తమకు తాముగా దక్షిణాదిన ఒక ప్రాంతీయ కూటమిని ఏర్పాటు చేసుకుంటే రేపటి రోజున అంటే 2029 ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని కేంద్రంలో ఏర్పాటు చేయడానికి అవసరమైన సీట్లు రాకపోతే తమ బలం అవసరం అవుతుందని అలా తమకు డిమాండ్ ఉంటుందని ఒక కొత్త ప్రయత్నానికి సిద్ధపడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇక తమిళనాడులో విజయ్ పార్టీ గెలవడం ఏంటి అటు బీఆర్ఎస్ ఇటు వైసీపీ కూడా పెద్ద ఎత్తున రియాక్ట్ అయిపోయాయి. అంతే కాదు విజయ్ కి కంగ్రాట్స్ చేస్తూ చెలిమికి తెర తీశాయి. ఇక్కడ వైసీపీకి టీవీకేకి సిద్ధాంతపరంగా సారూప్యం కంటే రెండు పార్టీలకూ క్రిస్టియన్ మైనారిటీ ఓటు బేస్ మాత్రం ఒక కామన్ పాయింట్ గా చెబుతున్నారు.ఇక సంక్షేమ పధకాలు ఇతర అంశాలలో జగన్ స్ట్రాటజీని విజయ్ ఫాలో అవుతున్నారని కూడా అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఏపీలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ లతో కూడిన బీజేపీ కూటమిని ఢీ కొట్టాలంటే ఈ సఖ్యత కొత్త కూటమి అవసరం అని వైసీపీ భావిస్తూంటే తెలంగాణాలో కూడా దూసుకుని వస్తున్న బీజేపీని ఎన్డీయే కూటమి ఏర్పాటుని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కూడా విజయ్ వంటి మిత్రుడి వైపు చూస్తోంది అని అంటున్నారు.

ఇది కేసీఆర్ కి జగన్ కి రాజకీయ అనివార్యంగా కనిపిస్తుంది అని అంటున్నారు. ఏపీలో చూస్తే పార్టీగా వైసీపీని పెట్టక ముందు నుంచే జగన్ మీద అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆయన మీద సీబీఐ కేసులు పదహారు నెలల జైలు జీవితం ఇవన్నీ ఒక ఎత్తు అయితే 2019 నుంచి 2024 దాకా సాగిన అయిదేళ్ల వైసీపీ ఏలుబడిలో అవినీతి మరో ఎత్తు అని అంటున్నారు. దాని వల్లనే వైసీపీ 2024 లో ఓటమి పాలు అయిందని చెబుతారు. ఒక బీఆర్ఎస్ విషయం తీసుకుంటే ఆ పార్టీ తెలంగాణాలో చేసిన పదేళ్ల పాలనలో కాళేశ్వరం నుండి ఫార్ములా వన్ కార్ రేసింగ్ వరకు భారీ త్తున ఆరోపణలు ఈ రోజుకీ సంచలనంగానే ఉన్నాయని చెబుతున్నారు. మరో వైపు తమిళనాడులో అనూహ్యంగా అధికారంలోకి వచ్చిన టీవీకే పార్టీ మీద కూడా అవినీతి మరకలు ఆరంభంలోనే ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అదెలా అంటే టీవీకేలో ఆ పార్టీ కీలక నేత, మంత్రి అధర్వ అర్జున్ తండ్రి లాటరీ కింగ్ అని చెబుతున్నారు.

కూటమి సాధ్యమా : అయితే ఈ ముగ్గురు నాయకులూ తమ ప్రభావాన్ని రాజకీయంగా దక్షిణాదిన చూపించాలని ప్రయత్నం చేస్తున్నారు. దాని కోసం ప్రాంతీయ కూటమిని కట్టాలని కూడా వ్యూహ రచన చేస్తున్నట్లుగా ప్రచారం అయితే ఉంది. కానీ అవినీతి ఆరోపణలు ఒక వైపు మరో వైపు మత రాజకీయాలను ముందుకు తీసుకుని రావడం వంటివే అడ్డంకిగా మారుతాయా అన్న చర్చ సాగుతోంది. అయితే దక్షిణాదిన ఎన్డీయే కూటమిని మరీ ముఖ్యంగా చంద్రబాబుకు ముకు తాడు వేయాలని ఈ కూటమి పెద్దల ప్రధాన లక్ష్యమని అంటున్నారు. మరి వీరి ఆశలు ఏ మేరకు సఫలీకృతం అవుతాయన్నది తెలియాలన్నా అనేక ప్రశ్నలకు జవాబు దొరకాలన్నా కొంత కాలం పాటు వేచి చూడాల్సి ఉందని అంటున్నారు.మరో వైపు చూస్తే ఇండియా కూటమిలో కాంగ్రెస్ సారధ్యం కాకుండా ఏ మమతా బెనర్జీ లాంటి వారో పగ్గాలు అందుకుంటే తెలుగు నాట కూడా కొత్త పార్టీలు అందులో చేరేందుకు వీలు ఉంటుందని అంటున్నారు. మొత్తానికి ఎన్డీయే తెలుగు రాష్ట్రాలలో బలంగా ఉండాలని మోడీ నిర్ణయించిన నేపథ్యంలో అటు బీఆర్ఎస్ ఇటు వైసీపీ రెండూ అలెర్ట్ అయినట్లుగా కనిపిస్తోంది అని అంటున్నారు.

# సుందరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం ఉధృతం చేస్తాం: సీపీఎం

- ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు, తోపుడు బండ్ల తొలగింపు దుర్మార్గం
- పాలకులది అవినీతి, కార్పొరేట్ రాజకీయం.. సుందరయ్యే మనకు ఆదర్శం
- వనస్థలిపురంలో పుచ్చలపల్లి 41వ వర్ధంతి వేడుకలు



వనస్థలిపురం, మే 19: భారత శక్తి ప్రజలపై మోయలేని భారం వేస్తూ, ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లను, వీధి వ్యాపారుల తోపుడు బండ్లను అక్రమంగా తొలగిస్తే ఊరుకునేది లేదని, సుందరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని సీపీఎం స్పష్టం చేసింది. మంగళవారం వనస్థలిపురం రైతు బజార్ చౌరస్తాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, అణగారిన వర్గాల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభ నిర్వహించారు. సీపీఎం ఎల్బీనగర్ పరిధి అధ్యక్షురాలు ఎ. రాధమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. చంద్రమోహన్, ఎల్బీనగర్ పరిధి కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్తిపై వ్యామోహం వద్దనే.. పిల్లలు కనలేదు!

ఈ సందర్భంగా ఎం. చంద్రమోహన్ మాట్లాడుతూ.. పేదల కూడు, గూడు, గుడ్డ వంటి కనీస అవసరాలు, మౌలిక వసతుల కల్పన కోసం పార్లమెంటు లోపలా, బయటా నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. "భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ, తన వాటాకు వచ్చిన భూమినంతా పేద ప్రజలకు పంచిపెట్టిన ఆదర్శ నాయకుడు ఆయన. పిల్లలు పుడితే ఆస్తిపై, కుటుంబంపై వ్యామోహం పెరుగుతుందనే ఉద్దేశంతో సుందరయ్య దంపతులు స్వచ్ఛందంగా సంతాన నిరోధక శస్త్రచికిత్స చేయించుకున్నారు."

**- ఎం. చంద్రమోహన్, సీపీఎం జిల్లా నేత**

**- నేటి రాజకీయాలు కార్పొరేట్ మయం..**

సీపీఎం ఎల్బీనగర్ పరిధి కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ.. 'దున్నేవాడికే భూమి కావాలి', 'ప్రతి పేదవాడికీ ఇల్లుండాలి' అనే లక్ష్యాలతో శాసనసభలో, పార్లమెంటులో సుందరయ్య గళమెత్తారని గుర్తుచేశారు. గన్నవరం శాసనసభ్యుడిగా నిస్వార్థంగా సేవలందిస్తూ కమ్యూనిస్టు విలువలను కాపాడారని, నాడు పేదల కష్టాల్లో ఉచిత గంజి కేంద్రాలు, కిలో రూపాయి బియ్యాన్ని అందించిన ఘనత ఆయనదేనన్నారు. కానీ, నేటి రాజకీయాల్లో విలువలు నశించాయని, వార్డు సభ్యుడు, కార్పొరేటర్, శాసనసభ్యుడు కాగానే ప్రజాప్రతినిధులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాజకీయాలను కార్పొరేట్ మయం చేస్తూ పాలకులే ప్రజలను దోచుకుంటున్నారని, నేటి తరం నాయకులు సుందరయ్య జీవిత చరిత్రను చూసైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు.

**- సీపీఎం ప్రధాన డిమాండ్లు:**

**- ధరలు తగ్గించాలి:**

విపరీతంగా పెరిగిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలతో పాటు మున్సిపల్ ఇండ్ల పన్నులను వెంటనే తగ్గించాలి.

**- డబుల్ బెడ్రూం ఇళ్లు పంచాలి:** రెండు పడక గదుల ఇళ్ల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఖాళీగా ఉన్న ఇళ్లను అర్హులైన పేదలకు తక్షణమే పంపిణీ చేయాలి, లేదంటే ఇళ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం.

**వైన్స్ దుకాణాలు తొలగించాలి:** జాతీయ రహదారుల పక్కన ఉన్న మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలి.

**యుద్ధం వద్దు - శాంతి కావాలి:** అమెరికా సామ్రాజ్యవాద ధోరణితో ఇరాన్‌పై జరుగుతున్న అనాలోచిత యుద్ధాన్ని తక్షణమే ఆపాలి. దీనివల్ల అంతర్జాతీయంగా చమురు, గ్యాస్ కొరత ఏర్పడుతోంది. ప్రపంచానికి యుద్ధం వద్దు.. శాంతి కావాలి.

ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు భారతమ్మ, కాశమ్మ, అర్జున్, మల్లేష్, ఝాన్సీ, శాంతి భాయ్, అంజి నాయక్, మల్లయ్య, నిర్మలమ్మ, కుమారి, కుద్బుద్దీన్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం: కప్పర ప్రసాదరావు

- బీఆర్ఎస్ కనుమరుగవడం ఖాయం
- కేటీఆర్ సోషల్ మీడియాలో హీరో... ప్రజల్లో జీరో
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తీవ్ర విమర్శలు



హైదరాబాద్, మే 19 : భారత శక్తి. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమైన హీరో అని, ప్రజల్లో ఆయనో జీరో అని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా కనుమరుగయ్యే స్థితికి చేరిందని, ఉనికిని కాపాడుకోవడానికే కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు కేటీఆర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.

**ఉపఎన్నికల్లోనే ప్రజలు బుద్ధి చెప్పారు:**

గతంలో జరిగిన దుబ్బాక, హుజూరాబాద్ ఉపఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయాలను ప్రసాదరావు గుర్తుచేశారు. ఆ ఎన్నికల్లోనే కేసీఆర్ కుటుంబానికి ప్రజలు ఓటమి రుచి చూపించారన్నారు. హుజూరాబాద్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ భారీగా డబ్బులు ఖర్చు పెట్టి, దళిత బంధు ప్రకటించినప్పటికీ ప్రజలు బీజేపీ వైపే నిలిచారని స్పష్టం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలోనూ బీఆర్ఎస్ నాయకత్వానికి ప్రజలు గట్టి హెచ్చరికలు పంపారని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 8 స్థానాలు గెలుచుకుని కాంగ్రెస్‌తో సమానంగా నిలిచిందని, బీఆర్ఎస్‌కు మాత్రం ప్రజలు గుండు సున్నా చుట్టారని ఎద్దేవా చేశారు.

**ఉద్యమకారులను మోసం చేసిన బీఆర్ఎస్:**

జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనే బీజేపీ బలం ఏంటో రుజువైందని ప్రసాదరావు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీతో చేతులు కలిపి హిందువులను అవమానించిందని ఆరోపించారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను బీఆర్ఎస్ నాయకత్వం పూర్తిగా వంచించిందని విమర్శించారు. మరోవైపు బీజేపీలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావు వంటి నాయకులు స్వయంకృషితో ఎదిగారని.. కుటుంబ రాజకీయాల నేపథ్యం నుంచి వచ్చిన వారికి వీరి గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు.

**దేశ భద్రతే బీజేపీ ప్రాధాన్యత:**

ఓటర్ల జాబితాలో ఉన్న డబుల్ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు, అక్రమంగా దేశంలోకి చొరబడిన వారి పేర్లను తొలగించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని ప్రసాదరావు పేర్కొన్నారు. దేశ భద్రత, దేశ భవిష్యత్తు మాత్రమే బీజేపీకి ముఖ్యమని స్పష్టం చేశారు. బీజేపీ ఏ మతానికీ వ్యతిరేకం కాదని.. గోవా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ముస్లింలు, క్రైస్తవులు కూడా బీజేపీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. ప్రస్తుతం బీహార్, బెంగాల్, కేరళ రాష్ట్రాల్లోనూ పార్టీ శరవేగంగా బలోపేతమవుతోందని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ పాలన ముగిసిందని, కాంగ్రెస్ ప్రభుత్వ అంతం కూడా దగ్గరలోనే ఉందన్న ఆయన.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీజేపీకి అధికారం అప్పగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు

- విద్యార్థులు, యువత వివిధ శిక్షణ సంస్థల కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి - ఉద్యోగాలతోపాటు స్వయం ఉపాధిపై కూడా దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ - యువజన క్రీడా వారోత్సవాల కింద నైపుణ్యాభివృద్ధిపై ఐడీఓసీలో అవగాహన సదస్సు



**రాజన్న సిరిసిల్ల** నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు వస్తాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నైపుణ్యాభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జయ జయహే తెలంగాణ పాటను వినిపించారు. ఈ సందర్భంగా వివిధ శిక్షణ సంస్థలు ఐటీఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్, ఇతర సంస్థల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి.. ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు? అర్హత ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో నేటి యువత, విద్యార్థులు చాలా కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటీవల విద్యా శాఖ వారోత్సవాల కింద సమ్మర్ క్యాంపులు నిర్వహించామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఎన్నో అంశాల్లో ప్రతిభ చూపారని గుర్తు చేశారు. విద్యతోపాటు ఆటలు ఆడాలని, దీంతో శారీరక, మానసిక సమతుల్యత ఉంటుందని, క్రమ శిక్షణ అలవడుతుందని వివరించారు. ఉన్నత చదువుతోపాటు టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. ఇప్పటి పరిశ్రమలకు ఎలాంటి స్కిల్స్ అవసరమో తెలుసుకొని ఆ దిశలో ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. ఐటీఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్ తదితర సంస్థల్లో అందిస్తున్న ఉచిత శిక్షణ కోర్సులను సద్విని యోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. పూర్తి వివరాలకు ఆయా సంస్థల్లో సంప్రదించాలని సూచించారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో శిక్షణ పొందిన వారికి పలు సంస్థలు ఉపాధి కల్పిస్తాయని తెలిపారు. పరిశ్రమల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల ఆద్వర్యంలో అందిస్తున్న స్వయం ఉపాధి స్కీములు, సబ్సిడీ సద్వినియోగం చేసుకొని.. స్వయం యువత ఉపాధి పొందాలని ఆకాంక్షించారు.జిల్లాలోని వివిధ శిక్షణ సంస్థలు ఏడాది అంతా యువతకు శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్లాలని సూచించారు. నర్సింగ్ పూర్తి చేసి.. విదేశాల భాష, నైపుణ్యాల్లో పట్టు ఉన్న వారికి టామ్ కామ్ ఆద్వర్యంలో వివిధ దేశాల్లో ఉపాధి కల్పన అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు

. జిల్లా నుంచి ఇప్పటిదాకా 45 మందికి విదేశాల్లో కొలువులు వచ్చాయని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. యువత ఉపాధిని పొంది తమ తల్లితండ్రుల సంరక్షణ బాధ్యతను చూసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు, డీవైఎస్ఓ రాందాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఎల్డీఎం మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు

## మే 24 న బీసీ ప్రభంజనం
# విజయవంతం చేయాలి
**- ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ పిలుపు**



**ఎల్బీనగర్, మే 19 (భారత శక్తి):** మే 24 న ఎల్బీనగర్ లో జరిగే బీసీ ప్రభంజనం సభను విజయవంతం చేయాలని బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మన్సురాబాద్ డివిజన్ ఎస్ కే గార్డెన్ లో మంగళవారం బీసీ ప్రభంజనం సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ, బీసీ ప్రభంజనం సభ రాజకీయాలకు అతీతంగా జరుగుతుందనీ,ఏ వర్గానికి వ్యతిరేకంగా ప్రభంజనం సభ జరగడం లేదని బీసీ వాదాన్ని బలోపేతం చేయడానికి మాత్రమే బీసీ ప్రభంజనం సభ జరుగుతుందన్నారు. చాప కింద నీరులా బీసీ వాదం బలపడుతుందని, భావజాల వ్యాప్తి కోసం ప్రభంజనం సభ ప్రభావం చూపుతుందని అభిప్రాయపడ్డారు. ఎన్నో సామాజిక ఉద్యమాలకు కేంద్రంగా ఉన్న ఎల్బీనగర్ ప్రాంతంలో బీసీ ప్రభంజనం సభ జరగడం సామాజిక ఉద్యమాలకు ఊపిరి పోస్తుందని ఆయన పేర్కొన్నారు. మే 24 న ఎల్బీనగర్ ఎస్ కే గార్డెన్ లో జరిగే బీసీ ప్రభంజనం సభ చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు అన్నారు. గత కొన్ని నెలలు కిందట నిర్వహించిన బీసీ జన భోజనాలకు వేలాది మంది బీసీలు స్వచ్ఛందంగా కదిలి వచ్చారని వివరించారు.ఎల్బీనగర్ లో జరగబోయే బీసీ ప్రభంజనం సభ ఖచ్చితంగా బీసీ ఉద్యమానికి దశ దిశను నిర్దేశిస్తుందని సోషల్ జస్టిస్ పార్టీ తెలంగాణ ఇంచార్జి కె.వి. గౌడ్ అన్నారు.

జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీసీలకు పది డివిజన్లు కేటాయించాలని బీసీ సంఘం నాయకులు కందికంటి శ్రీధర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు ఏకం కావాల్సిన అవసరం ఉందని ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ కన్వీనర్ తెలంగాణ వెంకన్న అన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కేటాయించే వరకు బీసీలు రాజీ లేని ఉద్యమం కొనసాగించాలని తెలంగాణ రక్షణ సేనా నాయకులు రాంకోఠి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు కందింకంటి శ్రీధర్ గౌడ్, చింతల విజయ్, ఉపేందర్ యాదవ్, బాలస్వామి, ప్రశాంత్, రమేష్, దూడల అమర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్ ముదిరాజ్, శ్రీధర్ దర్జీ, హరి శంకర్ గౌడ్, తానాజీ, అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి అవకాశాలను యువత పొందాలి
**- జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి ఐఏఎస్**




**ఎల్బీనగర్, మే 19 (భారత శక్తి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" -- 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, రాష్ట్ర వ్యాప్తంగా 06.03.2026 నుండి 12.06.2026 వరకు పది (10) ముఖ్య అంశాలపై కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. అందులో భాగంగా "యూత్ అండ్ స్పోర్ట్స్" థీమ్‌ను 18.05.2026 నుండి 23.05.2026 వరకు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా మంగళవారం "కెరీర్ ఒ స్కిల్ డెవలప్‌మెంట్ డే -- ఎంపవర్ స్కిల్స్, ఎంపవర్ ఫ్యూచర్" కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్, శ్రీమతి కిరణ్మయి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలాగే జిల్లా అధికారులతో పాటు జిల్లా యువజన (డివైఎస్ఓ), శ్రీమతి స్వర్ణలత, కోచ్‌లు, సిబ్బంది, యువత పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ కోర్సులపై జిల్లా స్థాయిలో వర్చువల్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కల్పిస్తూ పలు అంశాలపై వివరాలు అందించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పొందాలని యువతకు సూచించారు.

# రామాలయం అభివృద్ధికి నిధులు కోరుతూ మంత్రికి వినతి



**సిద్దిపేట,మే 19(భారత శక్తి ):** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేట గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ప్రహరీ గోడ, సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కొట్టె స్వామి ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామిని హైదరాబాద్ లో కలిసి వినతిపత్రం అందజేశారు.ఆలయ అభివృద్ధి పనులకు త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు గడీల జనార్దన్ రెడ్డితో కలిసి కొట్టె స్వామి మంత్రిని శాలువాతో సన్మానించారు.కార్యక్రమంలో అయన వెంట పార్టీ నాయకులు స్వామి రెడ్డి తదితరులు ఉన్నారు.

# పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి

**- వైద్య సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక**






**మైలార్‌దేవ్‌పల్లి, మే 19: భారత శక్తి** మైలార్‌దేవ్‌పల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యు.పి.హెచ్.సి) రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డి.ఎం.హెచ్.ఓ) డాక్టర్ డి.స్వర్ణకుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలను, వారి హాజరు పట్టికను నిశితంగా పరిశీలించారు. అనంతరం వార్డుల్లోని పడకల (బెడ్స్) నిర్వహణను, మందుల గడువు తేదీలను (ఎక్స్‌పైరీ డేట్) తనిఖీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణమంతా కలియతిరిగి పారిశుధ్య పరిస్థితులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

### గర్భిణీలకు మెరుగైన సేవలు అందించాలి

ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు అందుతున్న వైద్య సేవల గురించి అక్కడి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కాన్పుల (డెలివరీలు) సంఖ్యను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రతి మంగళవారం 'ఆరోగ్య మహిళ' ప్రత్యేక క్లినిక్

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్వర్ణకుమారి పేర్కొన్నారు.

ఇందులో భాగంగా ప్రతి మంగళవారం తప్పనిసరిగా 'ఆరోగ్య మహిళా క్లినిక్' నిర్వహించాలి.

- మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ (వ్యాధి నిర్ధారణ) పరీక్షలు చేయాలి.
- రక్తహీనత (ఎనీమియా)తో బాధపడుతున్న మహిళలను గుర్తించి, వారికి ప్రత్యేక వైద్యం అందించాలి.

### రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలి:

ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వారు వేచి ఉండే ప్రదేశంలో కూర్చునేందుకు కుర్చీలు, సురక్షిత తాగునీటి వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు.

### సేవాభావంతో పనిచేయాలి

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని డి.ఎం.హెచ్.ఓ పిలుపునిచ్చారు.

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ, రోగుల పట్ల సేవాభావంతో వ్యవహరించి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఎన్‌డీపీ నాలా పనుల జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సబితా ఇంద్రారెడ్డి






**ఎల్బీనగర్, మే 19 (భారత శక్తి):** మహేశ్వరం నియోజకవర్గంలోని ఆర్కేపురం డివిజన్లో విజయపురి కాలనీలో పర్యటించిన మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణ పనులు తీవ్రంగా ఆలస్యమవుతున్నాయని ఆగ్రహం, ఆందోళన వ్యక్తం చేశారు. కాలువల పనులు పూర్తికాకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు, ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఇప్పటికే వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పనులను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. మధ్యలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి, వర్షాల సమయంలో నగరం మునిగిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నగరాభివృద్ధి దృష్ట్యా మంచి ఆలోచనతో ఎస్ఎన్‌డీపీ నాలాల ప్రాజెక్టును ప్రారంభించారని, అయితే ప్రస్తుతం పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. దాదాపు రెండు సంవత్సరాలుగా పనులు కొనసాగుతున్నప్పటికీ ఇంకా పూర్తి కాలేదని పేర్కొన్నారు.అలాగే నగరంలో చెత్త సమస్య, తాగునీటి ఇబ్బందులు కూడా తీవ్రమవుతున్నాయని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపల్ శాఖ అధికారులు బాధ్యతగా పనిచేసి చెత్త తొలగింపు, కాలువల శుభ్రత, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.వర్షాకాలానికి ముందే అన్ని డ్రైనేజీ, నాలాల పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అలాగే నగరంలోని మూడు కార్పొరేషన్లకు స్పష్టమైన బాధ్యతలు కేటాయించి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి సరూర్ నగర్ డిప్యూటీ కమీషనర్ బోనగిరి శ్రీనివాస్, ఈఈ కార్తీక్, డిఈ విజయ్ కుమార్,చందన,ఏఈ ప్రశాంతి ఆర్కే పురం డివిజన్, సరూర్నగర్ డివిజన్, ఎన్టీఆర్ నగర్ డివిజన్ చెందిన భారాస పార్టీ నాయకులు, విజయపురి కాలనీ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# బీర్ సీసాలో కండోమ్ ప్యాకెట్ వైన్స్ షాప్ వద్ద ఉద్రిక్తత





సిద్దిపేట, మే 19(భారత శక్తి ):సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలోని ఓ వైన్స్ షాప్ వద్ద మద్యం ప్రియులు ఆందోళనకు దిగారు. వైన్స్ నుంచి కొనుగోలు చేసిన బీర్ సీసాలో కండోమ్ ప్యాకెట్ కనిపించడంతో అవక్కాయ్యారు.బీర్ సీసాలో కండోమ్ ప్యాకెట్ రావడంపై వినియోగదారులు వైన్స్ నిర్వాహకులను ప్రశ్నించగా, వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు. దీంతో వినియోగదారులు, వైన్స్ నిర్వాహకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.కల్తీ మద్యం వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందని మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడుతూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే సంబంధిత వైన్స్ షాప్ లైసెన్స్‌ను రద్దు చేయాలని కోరారు.సమాచారం అందుకున్న మిరుదొడ్డి ఎక్సైజ్ శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని బాధితుల ఫిర్యాదును స్వీకరించారు. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల జోక్యంతో ఆందోళన విరమించుకుంది.

## రాజవరం ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామ(భారత శక్తి)మే 19: చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ఏవిధంగా జరుగుతున్నాయి, ధాన్యం రవాణాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను, కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దింతో కొనుగోలు కేంద్రానికి అలాట్ అయిన మిల్లు యాజమాన్యం మాత్రం మిల్లులో కాలి లేదని ధాన్యం తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ఇంకా 50శాతం ధాన్యం ఉందని దింతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే కు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు ఫోన్ చేసి రాజవరం కొనుగోలు కేంద్రంలోని పరిస్థితిని వివరించారు. రాజవరం కొనుగోలు కేంద్రంతో పాటు చాలా కొనుగోలు కేంద్రాలలో మిల్లర్లతో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. కావున వెంటనే మిల్లుల రి-ట్యాగింగ్ చేయాలని సూచించారు. దింతో వీలైనంత తొందరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. రైతులు ఆర్థికంగా నష్టపోకూడదనే ప్రభుత్వం మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. కానీ గత వర్షాకాలం పంట గోదాములలో నిల్వ ఉండడం వల్ల స్థలం లేక కొంత ఇబ్బంది ఏర్పడుతుందని దీనిని రైతులు అర్థం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే మక్కల కొనుగోలులో సమస్యలు తొలిగిపోయాయని 2,3 రోజుల్లో ధాన్యం కొనుగోళ్ళ సమస్యలు కూడా పరిష్కారం అవుతాయాని హామీ ఇచ్చారు. రైతులు తొందరగా ప్రయివేట్ దళారుల వద్ద ధాన్యం అమ్ముకొని నష్టపోకూడదని సూచించారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ఎస్డిఎఫ్ నిధుల నుండి 1కోటి 18లక్షల 70వేల రూపాయలు మంజూరు

### - ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామ(భారత శక్తి)మే19: హన్మకొండ కనకదుర్గ కాలనీ లోని ఎమ్మెల్యే నివాసంలో ధర్మసాగర్, వేలేరు మండలాల పరిధిలోని పలు గ్రామాలలో వివిధ కుల సంఘాలకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ఎస్డిఎఫ్ నిధుల నుండి 1కోటి 18లక్షల 70వేల రూపాయల విలువగల మంజూరు పత్రాలను ఆయా కుల సంఘాలకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. వేలేరు మండలం శాలపల్లి గ్రామం లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయడానికి 5లక్షలు మంజూరుచేశారు.మల్లికుదుర్ల గ్రామం లో అసంపూర్తిగా ఉన్న యాదవ కమ్యూనిటీ పూర్తి చేయడానికి 5లక్షలు, ముస్లిం స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి క 5లక్షలు మంజూరు చేశారు.వేలేరు మండల కేంద్రంలో మజీద్ ప్రహరీ గోడ నిర్మాణానికి 5లక్షలు,ధర్మసాగర్ మండలం,ముప్పారం గ్రామం లో వాగు పై తాత్కాలిక కట్ట నిర్మాణానికి 7లక్షల 50వేలు, కస్తూరిభా గాంధీ పాఠశాల దగ్గర సిసి రోడ్డు నిర్మాణానికి 16లక్షల 30వేల రూపాయలు,మల్లక్ పల్లి గ్రామం లో అసంపూర్తిగా ఉన్న ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి5లక్షలు, అరే కమ్యూనిటీ హాల్ కు 5లక్షలు, నూతన ఎస్సి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 5లక్షలు, స్మశాన వాటిక నందు ఆఫీస్ రూమ్, వేయిటింగ్ రూమ్, టాయిలెట్స్ నిర్మాణానికి 5లక్షలు మంజూరు చేశారు.ఎల్కుర్తి గ్రామం లో అసంపూర్తిగా ఉన్న మహిళా కమ్యూనిటీ హాల్ పూర్తి చేయడానికి 10లక్షలు,ఐనవోలు మండలం గర్నేపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న మహిళా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 5లక్షలు, వెంకటాపూర్ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అరే కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 5లక్షలుపంపిని చేశారు.

## "ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్" ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ(భారత శక్తి)మే 19:రాష్ట్ర ప్రభుత్వం సౌజన్యం తో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్" ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించారు. ప్రస్తుతం రెడ్ క్రాస్ సొసైటీ జనగామ జిల్లా చైర్మన్ గా డా. డి. లవకుమార్ రెడ్డి, కోలుకొండ గ్రామ నివాసి అయిన కన్న పరుశరాములు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. బెన్ షాలోం ఇతర అధికారులు, ముఖ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## భారతీయ భాషలపై ఆసక్తి పెంపొందించే "భారతీయ భాషా సమ్మర్ క్యాంప్"కు విద్యార్థుల నుంచి విశేష స్పందన: ప్రిన్సిపాల్ మునీష్ మీనా




కడప, మే 19(భారత శక్తి ) : భారతీయ భాషలు, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న "భారతీయ భాషా సమ్మర్ క్యాంప్--2026" కార్యక్రమం కడపలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఘనంగా ప్రారంభమైనట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ మునీష్ మీనా తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఒక భాష మరింత నేర్చుకుంటే ఒక హృదయం మరింత దగ్గరవుతుంది" అనే భావనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరంలో 3వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొంటున్నారని చెప్పారు. ఈ నెల 18 నుంచి 24 వరకు జరిగే ఈ క్యాంప్‌లో మలయాళ భాషను విద్యార్థులకు సరదాగా, సృజనాత్మకంగా బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ అభివాదాలు, సంభాషణలు, సంగీతం, నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక వంటకాల పరిచయం, చరిత్ర--భూగోళ శాస్త్ర అంశాలు వంటి విభిన్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.మొదటి రోజు కార్యక్రమంలో మొత్తం 30 మంది విద్యార్థులు పాల్గొని విశేష ఆసక్తి కనబరిచారు. విద్యార్థులకు మలయాళ భాషలో ప్రాథమిక అభివాదాలు, అక్షరాలు, సంఖ్యలు, సాధారణ పదాలను పరిచయం చేశారు. "నమస్కారం", "ధన్యవాదాలు" వంటి పదాలను మలయాళంలో పలకడం ఉపాధ్యాయులు నేర్పించారు. ఆటలు, సరదా కార్యకలాపాల ద్వారా నిర్వహించిన బోధనలో విద్యార్థులు చురుకుగా పాల్గొని కొత్త భాష నేర్చుకోవడంలో ఆనందాన్ని వ్యక్తం చేశారు. భాషల అధ్యయనం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సంభాషణ నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందడంతో పాటు "ఏక్ భారత్--శ్రేష్ఠ భారత్" భావన మరింత బలపడుతుందని ప్రిన్సిపాల్ అన్నారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఈ శిబిరంలో చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## పి జి ఆర్ ఎస్ సమస్యలను సత్వరమే పరిష్కరించండి

### - జిల్లా రెవెన్యూ అధికారి మల్లిఖార్జునుడు



వై ఎస్ ఆర్ కడప,మే 19(భారత శక్తి ): అర్జీదారులకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించి ప్రజా సమస్యలను 0 శాతం కి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా రెవెన్యూ అధికారి మల్లిఖార్జునుడు పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి తో పాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా అర్జీదారులకు సంతృప్తి కరమైన, నాణ్యమైన వేగవంతమైన పరిష్కారాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. వేసవిలో అర్జీదారుల ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలో సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికంగానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ క్లినిక్ ల ద్వారా భూ సంబంధిత సమస్యలను.పరిష్కరించుకోవాలన్నారు.

**"ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు"**

1) వేంపల్లి మండలంకు చెందిన టి.లక్ష్మీదేవి తన ఆధార్ కార్డు లోని తప్పులను సరిచేసి ఇల్లు మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించారు.

2) పెండ్లిమర్రి మండలం కు చెందిన తన ఇంటి స్థలం కు సంబంధించిన భూ సమస్యను పరిష్కరించ వలసిందిగా అర్జీ సమర్పించారు.

3) చెన్నూరు మండలం కు చెందిన టి.ప్రభాకర్ రెడ్డి అనే వ్యక్తి మండలం లోని సిరి మెగా టౌన్ షిప్ నందు నీటి వసతి కల్పించాలని అర్జీ సమర్పించారు.

4) చిట్వేల్ మండలం కు చెందిన కే లక్ష్మీ నారాయణ అనే వ్యక్తి నాటు కోళ్ల వ్యాపారం మొదలు పెట్టుటకు ఎస్సీ కార్పొరేషన్ కింద స్థలంను కేటాయించ వలసిందిగా అర్జీ సమర్పించారు.

5) ప్రొద్దుటూరు కు చెందిన ఆర్.అశోక్ కుమార్ అనే వ్యక్తి కొత్తపల్లి నుండి వెళ్లాలకు రోడ్డు కొత్త రోడ్డు వేయాలని అర్జీ సమర్పించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు జెడ్పి సీఈవో సుబ్రహ్మణ్యం, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్ పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష



జమ్మలమడుగు, భారత శక్తి ప్రతినిధి, మే 19: రాష్ట్ర విద్య, ఐ.టి శాఖ మంత్రివర్యులు లోకేష్ పర్యటన నేపథ్యంలో రాజూజూ సోలార్ పవర్ ప్లాంట్ ను సందర్శించి భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ,జిల్లా జాయింట్ కలెక్టర్ నిధిమీనా ఐ.ఎ.ఎస్ పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.కడప జిల్లా లోని జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం సర్కిల్ లోని తాళ్ల ప్రొద్దుటూరు పరిధిలోని టి. కోడూరు గ్రామం వద్ద రాజూజూ సోలార్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఈ నెల 22వ తేదీన రాష్ట్రవిద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నిధిమీనా ఐ.ఎ.ఎస్ , టి.డి.పి కడప జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు భూపేష్ రెడ్డి , జమ్మలమడుగు డి. ఎస్పీ కె. వెంకటేశ్వర రావు, ఆర్ డి ఓ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎండల తీవ్రతలో చల్లని సేవ

### -పోరుమామిళ్ల బస్టాండ్ లో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



పోరుమామిళ్ల, భారతశక్తి ప్రతినిధి, మే 19: పోరుమామిళ్ల పట్టణంలోని బస్టాండ్‌లో మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు, ప్రయాణికులకు, ఆటో డ్రైవర్లకు, బస్సుల కోసం వేచి ఉన్న వారికి, వృద్ధులకు మరియు ఇతరులకు ఉచితంగా చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సేవా కార్యక్రమాన్ని పసుపులేటి వెంకటమ్మ (సంటెమ్మ ) సేవా సంస్థ ఆధ్వర్యంలో కల్లూరి రామకృష్ణారెడ్డి (టీచర్) నిర్వహించగా, వేసవి వేడిలో అలసిపోయిన ప్రజలు మజ్జిగ సేవించి ఉపశమనం పొందారు. సామాజిక సేవా భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.ప్రజలకు ఎండల సమయంలో తాగునీరు, మజ్జిగ వంటి సేవలు అందించడం ఎంతో గొప్ప విషయమని స్థానికులు పేర్కొన్నారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రయాణికులు, కూలీలు, వ్యాపారులు కూడా ఈ కార్యక్రమంలో భాగమై మజ్జిగ సేవించారు.

ఈ కార్యక్రమంలో కె.ప్రవీణ్ (ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఆఫీస్ సెక్రటరీ), ఫణి రావు (ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సెక్రెటరీ) స్వామి, బీరం రామకృష్ణారెడ్డి, విజయ్ చంద్ర, రాజశేఖర్, శ్రీనివాసులు (టీచర్) తదితరులు పాల్గొన్నారు.

## వెల్మల్ లో ఘనంగా బీరప్ప ఉత్సవాలు..



ఆర్మూర్, భారత శక్తి న్యూస్,మే 19: నందిపేట మండలం వెలుమల గ్రామంలో బీరప్ప ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిపే ఈ ఉత్సవంలో కురుమలు కన్నుల పండగ గా జరుపుకున్నారు. బీరప్ప కళ్యాణోత్సవం జరుగగా జిల్లా నలుమూల వచ్చిన బీరప్ప భక్తులు కళ్యాణ ఉత్సవంలో పాల్గొని భగవంతుని ఆశీస్సులు పొందినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజారామ్ యాదవ్, ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి, జిల్లా కురుమ సంఘ నాయకులు దేవన్న, తిరుమన్ పల్లి మోహన్, అశోక్, కేజీ సురేష్ ,న్యాల్కల్ భూమన్నా , పోతన్న, మంథని ముత్యం, బాపురావు యాదవ్, రాజమల్లు , కొండూరు బోగన్న, జవహర్, మహిపాల్, మహేష్, శ్రీకాంత్, చిక్లీ భూమన్న,సురేష్ ,సతీష్ తదితరులు పాల్గొన్నారు

## గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

### - మంచిర్యాల సిఐ ప్రమోద్ రావు

### - బస్ స్టాండ్,రైల్వే స్టేషన్లలో నార్కోటిక్ స్నిఫర్ డాగ్‌తో తనిఖీలు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 19 ( భారత శక్తి ): గంజాయి అక్రమ రవాణా చేసినా, వినియోగించినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు హెచ్చరించారు. గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఆదేశాల మేరకు,ఏసీపీ ఆర్. ప్రకాష్ పర్యవేక్షణలో మంచిర్యాల సీఐ ప్రమోద్ రావు ఆధ్వర్యంలో మంచిర్యాల రైల్వే స్టేషన్,బస్ స్టాండ్, పాన్ షాపులు,సినిమా థియేటర్లు తదితర ప్రాంతాల్లో నార్కోటిక్ ట్రైనింగ్ స్నిఫర్ డాగ్ సహాయంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా బస్సులు, రైళ్లు,స్టేషన్ పరిసరాలు మరియు అనుమానాస్పద వస్తువులను తనిఖీ చేశారు.ఆగి ఉన్న బస్సులు,రైళ్లలోకి ఎక్కి ప్రయాణికులను తనిఖీ చేశారు.పలువురు ప్రయాణికుల బ్యాగులను పరిశీలించి వివరాలు సేకరించారు.మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రయాణికులు, రైలు బోగీలు, అనుమానాస్పదంగా కనిపించే ప్రతి పార్సిల్‌ను పరిశీలించారు.అలాగే పార్సిల్ ఆఫీస్,ఎంట్రీ, ఎగ్జిట్ గేట్ల వద్ద కూడా తనిఖీలు చేపట్టారు. స్టేషన్ పరిధిలోని పాన్ షాపులు,హోటళ్లు, సినిమా థియేటర్లలో కూడా తనిఖీలు నిర్వహించారు.గంజాయి నిర్మూలనలో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టామని తెలిపారు.గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇతర ప్రాంతాల నుంచి ప్రైవేట్ వాహనాలు, బస్సులు,రైళ్ల ద్వారా గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తూ యువత జీవితాలను నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ తనిఖీల్లో ఎస్ఐ ఆది మధుసూదన్,డాగ్ స్క్వాడ్ సిబ్బంది, నార్కోటిక్ టీమ్, పోలీస్ స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేటి యువతకు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శం.

**-సిపిఎం పార్టీ నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు**

**- 41వ వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి.**



మెదక్ జిల్లా నర్సాపూర్, మే 19 (భారత శక్తి న్యూస్): భారత కమ్యూనిస్టు ఉద్యమ మహానేత, ప్రజా నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా నర్సాపూర్ పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు మాట్లాడుతూ సుందరయ్య జీవితాంతం పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సామాజిక సమానత్వం, శ్రమజీవుల సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు నేటి తరాలకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. నేటి పరిస్థితుల్లో ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం మరింత ఉందని అన్నారు. సుందరయ్య జీవితాంతం పేద ప్రజల హక్కుల కోసం, సమాన సమాజ నిర్మాణం కోసం ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు.కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. యువత సుందరయ్య త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాఘభూషణం, కుమార్, చందర్, రాములు, ఎల్లయ్య, కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు .

## జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు పూర్తిగా నిర్మూలించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 19(భారత శక్తి) జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు పూర్తి స్థాయిలో నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇసుక రీచ్ లను గుర్తించాలన్నారు. అక్రమ ఇసుక త్రవ్వకాలని పూర్తిస్థాయిలో నివారిస్తామని చెప్పారు. కేవలం మన ఇసుక వాహనం యాప్ ద్వారానే ఇసుక అమ్మకాలు పారదర్శకంగా జరగాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చూడాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టినా, రవాణా చేసిన చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, భూగర్భ జల అధికారి శ్రీనివాస బాబు, డిపిఓ శ్రీనివాస్, రాయల్టీ ఇన్స్పెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ మిశ్రా.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 19(భారత శక్తి) జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల వారి జిల్లాలో ఇప్పటి వరకు పూర్తిచేసిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని అన్నారు. అందుబాటులో లేని రైతులకు సంబంధించి వివరాలను వివిధ మార్గాల్లో అన్వేషించాలని సూచించారు. రిజిస్ట్రీ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సంబంధమైన ఇబ్బందులు ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ మొత్తం ఎటువంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇతర అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తీగల యాదలక్ష్మిని పరామర్శించి,ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న పల్లా సుందర్ రాంరెడ్డి.



జనగామ (భారత శక్తి) మే 19: దేవరుప్పులమండలం, గొల్లపల్లి గ్రామ శాఖ బిఆర్ఎస్ అధ్యక్షుడు తీగల సత్యనారాయణ సతీమణి తీగల యాదలక్ష్మి ఇటీవల వెన్నునొప్పితో బాధపడుతూ హైద్రాబాద్ లో ప్రయివేటు ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకొని వారి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఈ రోజు బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి వారి ఇంటికి వెళ్ళి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట గొల్లపల్లి గ్రామ సర్పంచ్ తీగల పరుశురాములు, బిఆర్ఎస్ నాయకులు జక్కి యాదయ్య,తీగల యాదగిరి, తీగల నాగార్జున,బట్ట వేణు, రిపోర్టర్ దూదిమెట్ల సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో నీటి ఎద్దడిని తీర్చిన అపర భగీరథుడు మహమ్మద్ అలీ షబ్బీర్


**– ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మున్సిపల్ చైర్ పర్సన్**



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే19: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాల క్రితం కామారెడ్డి నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్ళినా, వర్షాకాలం మినహా మిగిలిన అన్ని కాలాల్లోనూ,ముఖ్యంగా ఎండాకాలంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడేది. ఆ రోజుల్లో ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపేవారు. అప్పట్లో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ,ఈ నీటి సమస్యను శాశ్వతంగా తీర్చడమే ధ్యేయంగా ఒక తపస్సులా పనిచేశారు.
అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డిని ఒప్పించి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి కామారెడ్డికి గోదావరి జలాలను తెప్పించడానికి ఆయన ఒక పెద్ద యజ్ఞమే చేశారు.దాదాపు 110 కిలోమీటర్ల దూరం నుండి పైపులైన్లు వేయించి,మల్లన్న గుట్ట వద్ద ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి గ్రామాలకు తాగునీరు అందించారు. తద్వారా దాదాపు పదేళ్ల పాటు కామారెడ్డి ప్రాంతానికి తాగునీటి సమస్య లేకుండా చేశారు. కానీ ప్రజల అవసరాల దృష్ట నీటి కొరత ఏర్పడుతూ వస్తున్నది. అభివృద్ధిలో భాగంగా నూతన పైప్‌లైన్ల ఏర్పాటులో ఎదురైన అటవీ (ఫారెస్ట్), (ఆర్‌డబీ) శాఖల అనుమతుల ఆటంకాలను స్వయంగా చొరవ తీసుకుని తొలగించారు. ప్రస్తుతం ఈ పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే, గత ప్రభుత్వ హయాంలో కామారెడ్డి పట్టణానికి వచ్చిన కేవలం 4 ఎమ్ఎల్ డి నీటి సరఫరాను, ఏకంగా 19 ఎమ్ఎల్ డి కి పెంచే మహా యజ్ఞం విజయవంతం కానుంది.ఈ వేసవికాలం ప్రారంభం కాగానే షబ్బీర్ అలీ ప్రతిరోజూ అధికారులతో సమీక్షలు జరుపుతూ, కామారెడ్డి పట్టణానికి రోజుకు 8 నుండి 10 ఎమ్ఎల్ డి నీటిని అందించడానికి ముందస్తు కసరత్తు చేశారు. గత 10 సంవత్సరాలుగా వేసవి వస్తే కామారెడ్డిలోని ప్రతి వార్డులోనూ వాటర్ ట్యాంకర్లు దర్శనమిచ్చేవి. కానీ, షబ్బీర్ అలీ పట్టుదల, నిరంతర కృషి వల్ల నేడు పట్టణంలో ఎక్కడా వాటర్ ట్యాంకర్ల అవసరం లేకుండా, నల్లా ద్వారానే పుష్కలంగా తాగునీరు అందుతోంది. ప్రజల దాహార్తిని తీరుస్తూ, వారి కష్టాలను దూరం చేసిన మహమ్మద్ అలీ షబ్బీర్ కి కామారెడ్డి ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు. మనకు ప్రస్తుతానికి 10 వాటర్ ట్యాంక్ లు వున్నాయి, అమృత్ 2.0 పథకంలో బాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో గౌరవ ప్రభుత్వ సలహాధారు షబ్బీర్ అలీ సహకారంతో 9 వాటర్ ట్యాంక్ లు మంజూరు అయ్యాయి. 11.89 కోట్ల వ్యయంతో నిర్మాణం అవుతున్న ట్యాంక్ లు పూర్తయితే పట్టణానికి 19 ఎమ్ఎల్ డి నీటి సరఫరాతో సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుంది.కామారెడ్డి పట్టణానికి 19 ఎమ్ఎల్ డి నీటి సౌకర్యమే లక్ష్యంగా కృషి చేసిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కి కామారెడ్డి పట్టణ ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంతరావు, ఏఈ వినోద్, కౌన్సిలర్ల వాజీద్, జావేద్, అంజాద్, బబ్లు, కాళ్ళ గణేష్, కళ్లెం సత్యం, అన్వర్,లడ్డు, సిద్దిక్, యూనస్, చిట్టిబాబు, భూపతి పట్టణ అధ్యక్షులు సందీప్, గాజీ, గంప ప్రసాద్, సురేష్, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, మిషన్ భగీరత సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం నిల్వ కొరకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలి

**– జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 19(భారత శక్తి) జిల్లాలో ధాన్యం నిల్వ చేయుటకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే గోదాములకు తరలించాలని చెప్పారు. ముందస్తు జాగ్రత్త చర్యగా అదనంగా, ధాన్యం నిల్వ చేయడానికి అవకాశం ఉన్న ప్రదేశాలు సమకూర్చుకోవాలన్నారు. ఇతర జిల్లాల్లో గోదాములు అందుబాటులో ఉంటే, ఆ ప్రదేశాలు గుర్తించి ధాన్యం అక్కడికి తరలించాలని వివరించారు. ధాన్యం నిరంతరాయంగా తరలింపునకు అనుగుణంగా తగినన్ని లారీలు, తగినంత మంది హమాలీలు అందుబాటులో ఉండాలని తెలిపారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, డిఆర్డిఓ విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో నిబంధనలు పాటించని విజయలక్ష్మి లాడ్జ్ సీజ్




జగిత్యాల, మే 19( భారత శక్తి ప్రతినిధి ): ధర్మపురి పట్టణంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జగిత్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, డీఎస్పీ కె. పురుషోత్తం రెడ్డి సూచనలతో ధర్మపురి పోలీసులు విజయలక్ష్మి లాడ్జ్‌ను తనిఖీ చేశారు.తనిఖీల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా లాడ్జ్ నిర్వహించడం, వచ్చిన వారి ఆధార్ కార్డులు మరియు పూర్తి వివరాలు నమోదు చేయకపోవడం, సరైన సీసీటీవీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం వంటి పలు నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు.ఈ నేపథ్యంలో విజయలక్ష్మి లాడ్జ్‌పై చర్యలు తీసుకోవాలని ధర్మపురి సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు రిక్విజేషన్ ఇవ్వగా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు మరియు సిబ్బంది లాడ్జ్‌ను సీజ్ చేశారు.అదేవిధంగా కమర్షియల్ భవనంలో డొమెస్టిక్ విద్యుత్ మీటర్లు వినియోగిస్తున్న విషయంపై చర్యలు తీసుకోవాలని ధర్మపురి ఎలక్ట్రికల్ ఏఈ కి సీఐ రిక్విజేషన్ అందజేశారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు కూడా త్వరలో చర్యలు తీసుకోనున్నారు .కొన్ని లాడ్జీలు సరైన రికార్డులు నిర్వహించకుండా, గుర్తింపు కార్డులు తీసుకోకుండా, సంబంధిత వ్యక్తుల పూర్తి వివరాలు మరియు ఫోన్ నంబర్లు నమోదు చేయకుండా నిర్వహించడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఏర్పడుతుందని పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి నిర్లక్ష్య ధోరణులు శాంతిభద్రతలకు భంగం కలిగించడమే కాకుండా నేరగాళ్లు, అనుమానాస్పద వ్యక్తులకు ఆశ్రయం కల్పించే ప్రమాదం ఉందన్నారు.ధర్మపురి పరిధిలోని అన్ని లాడ్జీలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని, వచ్చిన వారి పూర్తి వివరాలు నమోదు చేయాలని, ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డులు తీసుకోవాలని, సీసీటీవీ కెమెరాలను సక్రమంగా నిర్వహించాల సూచించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ధర్మపురి పోలీసులు స్పష్టం చేశారు.

## మీడియా మిత్రులతో కలెక్టర్ సందడి.. మావల హరితవనంలో సఫారీ, సెల్ఫీల సందడి.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 19: (భారత శక్తి) ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాల సందర్భంగా మంగళవారం మావల హరితవనంలో ప్రత్యేక కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ప్రకృతి అందాలు, అటవీ వాతావరణం మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ రాజేశ్వర్, టూరిజం అధికారి రవికుమార్, డీపీఆర్వో విష్ణువర్ధన్ తదితర అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మీడియా మిత్రులతో కలిసి ప్రత్యేక వాహనంలో అడవి ప్రాంతంలో సఫారీ నిర్వహించారు. పచ్చని వాతావరణంలో పర్యటిస్తూ వన్యప్రాణులను పరిశీలించారు. పర్యాటక అభివృద్ధి, ప్రకృతి సంరక్షణపై అధికారులు మీడియా ప్రతినిధులతో చర్చించారు. హరితవనంలోని సహజ సౌందర్యం అందరినీ ఆకట్టుకుంది.సఫారీ అనంతరం కలెక్టర్ రాజర్షి షా మీడియా ప్రతినిధులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ క్రమంలో అందరితో కలిసి సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. కలెక్టర్ సరదాగా మీడియా మిత్రులతో కలిసిపోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమం మొత్తం ఆనందోత్సాహాల నడుమ సాగింది.

## న్యూ శాయంపేట లో హనుమాన్ భక్తుల అరెస్టు.



హనుమకొండ (భారత శక్తి)మే19 : హనుమకొండ లోని న్యూ శాయంపేటలో హనుమాన్ స్వామి విగ్రహం ధ్వంసం జరిగింది. న్యూ శాయంపేట సర్కిల్లో గల దేవాలయ ప్రాంగణంలో గల ప్రభుత్వ భూమిలో కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపణలతో హనుమాన్ భక్తులు పెద్ద ఎత్తున కోపోద్రిక్తులై ఈ ఘటన హనుమాన్ భక్తుల్లో కలకలం రేపింది.ఈ సందర్భంగా హనుమాన్ భక్తులు విగ్రహ ధ్వంసం చేసిన వారిని వెంటనే శిక్షించాలని న్యూ శాయంపేట లోని హనుమాన్ భక్తులు దీని కారణమైన వారిని శిక్షించాలని వెంటనే దీనిపై ప్రభుత్వం ,పోలీసులు చర్య తీసుకోవాలని దీనికి సంబంధించిన వారిని వారిపై కేసు నమోదు చేయాలని న్యూ శాయంపేట బస్టాండ్ సర్కిల్లో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో ధర్నా నిర్వహించి వాహనాల కదలికను జరగకుండా చేశారు. దాదాపు గంటసేపు ఈ రాస్తారోకో జరిగింది, వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి రాస్తారోకో ధర్నా చేస్తున్న వారిని సుబేదారి పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత వాళ్ళ సొంత పూచి కత్తుపై వదిలేశారు. అరెస్ట్ అయినవారిలోవారిలో బిజెపికి సంబంధించిన కడవేరు శీను, శ్రీనివాస్ గౌడ్, ఆదిత్య,సాయి తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు భరోసా - మల్‌రెడ్డి రాంరెడ్డి



ఎల్బీనగర్, మే 19 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చింతలకుంట ప్రాంతానికి చెందిన కళ్ళకుంట్ల ఫణికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్ ) ద్వారా మంజూరైన రూ. 1,00,000/- చెక్కును తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి చైతన్యపురి కాంగ్రెస్ కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాహిత పాలనలో రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక పెద్ద భరోసాగా నిలుస్తోందన్నారు.ప్రజల కష్టసుఖాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సహాయం ఫణి వారి కుటుంబానికి ఊరటనిచ్చేలా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రైతుల పక్షాన నిలిచిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**-ఐకేపీ కేంద్రంలో సమస్యల పరిష్కారానికి సత్వర ఆదేశాలు!**



జనగామ(భారత శక్తి)మే19: నెల రోజులుగా పేరుకుపోయిన ధాన్యం..వర్షాల భయంతో ఆందోళనలో రైతులు..సత్వర చర్యల కోసం జనగామ ఎమ్మెల్యే పల్లా కలెక్టర్, అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చేర్యాల మండలం చుంచునకోట గ్రామ శివారులోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎదుర్కొంటున్న సమస్యలపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తక్షణమే స్పందించారు. కేంద్రంలో సరైన సదుపాయాలు లేకపోవడం, తార్పాలిన్లు అందుబాటులో లేకపోవడం వల్ల నిల్వ ఉంచిన ఒడ్లు చెదలు పడుతున్నాయని, నెల రోజులుగా ధాన్యం పోసినా తరలించడం లేదని రైతులు మంగళవారం ఎమ్మెల్యేను అడ్డుకుని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వర్షాలు వస్తే పంట మొత్తం తుడిచి పెట్టుకుపోతుందని కన్నీరు మున్నీరయ్యారు. రైతుల గోడును ఓపికగా విన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వెంటనే జిల్లా కలెక్టర్, డీసీఎస్ఓ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్య తీవ్రతను వివరించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగడానికి వీల్లేదు. వెంటనే ధాన్యాన్ని తర లించేలా చర్యలు తీసుకోండి అని అధికారులకు తెలిపారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి, అన్నదాతకు కొండంత అండగా నిలిచిన జననేత ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కి చుంచునకోట రైతాంగం కృతజ్ఞతలు తెలియజేసింది.

# అదనపు తరగతి గది నిర్మాణ శంకుస్థాపన



తెల్లాపూర్ మే 19 భారత శక్తి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ డివిజన్ ఉస్మాన్ నగర్ పరిధిలోగల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 60 లక్షల రూపాయల




అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన అదనపు తరగతి గది నిర్మాణ పనులకు మంగళవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు శ్రీ వివేక్ వెంకటస్వామి తో కలిసి శంకుస్థాపన చేసిన పటాన్‌చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి . గత పది సంవత్సరాలుగా ఉస్మాన్ నగర్ కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థులు పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం పట్ల అభినందనలు తెలిపారు. హాజరైన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు.

# ఆరోగ్య మిత్రలకు వెయిటేజీ మార్కులు, అనుభవ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి.

**- ఆరోగ్యశ్రీ ఉద్యోగుల శ్రమను గుర్తించాలి.**

**- ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి..**




హైదరాబాద్, మే 19 భారత శక్తి: ఇటీవల ఏఎన్ఎం (సహాయక నర్సు మిడ్‌వైఫ్) పరీక్షలు రాసిన ఆరోగ్య మిత్రలందరికీ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ యాజమాన్యం తక్షణమే స్పందించి, వెయిటేజీ మార్కులకు సంబంధించిన అనుభవ ధ్రువీకరణ పత్రాన్ని (ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్) జారీ చేయాలని ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య విజ్ఞప్తి చేశారు. గత 19 ఏళ్లుగా ప్రభుత్వ పరిధిలో పేద ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సేవలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. పరీక్షలు రాసిన ప్రతి ఒక్క ఆరోగ్య మిత్రకు వెయిటేజీ మార్కులతో పాటు అనుభవ ధ్రువీకరణ పత్రాన్ని అందించి ఆదుకోవాలని ఆయన ట్రస్ట్ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

**- డిపార్ట్‌మెంట్‌లో ఉన్నా నిరాకరణేనా?**

అనుభవానికి సంబంధించి ప్రభుత్వం కేటాయించిన విభాగాల జాబితాలో ఆరోగ్యశ్రీ విభాగం ఉన్నప్పటికీ, అర్హులైన ఉద్యోగులకు అనుభవ ధ్రువీకరణ పత్రం ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదని గిరి యాదయ్య ఆక్షేపించారు. నిబంధనల ప్రకారం లభించాల్సిన హక్కును నిరాకరించడం వల్ల ఎంతోమంది ఉద్యోగులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి, బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

# తారా కళాశాలలో మొదటి దశ అడ్మిషన్ లు ప్రారంభం

**- తారా కళాశాల ప్రొఫెసర్ ప్రిన్సిపాల్ ప్రవీణ**



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మే 19 :తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో దోస్తు ద్వారా మొదటి దశలో కేటాయించిన సీట్లకు అడ్మిషన్లు జరుగుచున్నయని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపారు.తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో దోస్తు ద్వారా మొదటి దశ లో సీటు వచ్చిన విద్యార్థులు తప్పనిసరిగా ఆన్లైన్లో మీ సమీపములోని మీ సేవ కేంద్రాల ద్వారా గాని, ఆన్లైన్ సెంటర్లలో గాని సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని ,అప్పుడే మీ సీటు రిజర్వ్ అవుతుందని ప్రిన్సిపల్ తెలిపినారు. ఆన్లైన్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవడానికి ఈనెల 23వ తేదీ వరకు అవకాశం ఉందని, కళాశాలలో సీటు వచ్చినటువంటి విద్యార్థులు తప్పనిసరిగా 23 లోపు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా దోస్త్ రెండవ దశ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేవారు కళాశాలలోని ఏఐడీపీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని, ఈ కోర్సులలో చేరే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపినారు.

కళాశాలలో బీకాంలో బీ.కాం. హెచ్.ఆర్; బీ.కాం. బి.ఎఫ్.ఎస్.ఐ; బి.బి. ఏ. రిటైలింగ్; బి ఫార్మసీ కోర్సులు ఏడీపీ కోర్సులని, వీటికి అప్లై చేసుకుంటే రెండు సంవత్సరాలు కళాశాలలో చదివి, మూడవ సంవత్సరము సంబంధిత కంపెనీలలో, ఇతర కంపెనీలు గాని ఉద్యోగం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపినారు. ఈ కోర్సులలో చేరిన విద్యార్థులు చివరి సంవత్సరం నెలకు 5000 నుండి 10000 రూపాయల వరకు స్టైపండు పొంది అవకాశం ఉందని తెలిపినారు. కావున రెండవ దశ అడ్మిషన్ లకు దరఖాస్తు చేసుకునేవారు పై ఏడిపి కోర్సులతోపాటు కళాశాలలోని ఇతర కోర్సులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపినారు. దరఖాస్తులు చెయ్యడంలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతే తారా కళాశాలలోని జిల్లా దోస్త్ సెంటర్ ని సంప్రదించాలని అన్నారు.

# జిన్నారం,జంగంపేట గ్రామాల భూ బాధితులకు న్యాయం చేయాలి

**మంత్రి డా.గడ్డం వివేక్ వెంకట స్వామికి మెమొరండం సమర్పించిన.. నీలం లత ముదిరాజ్**



జిన్నారం మున్సిపల్, మే 19 భారత శక్తి న్యూస్: సంగారెడ్డి జిల్లా, జిన్నారం మండలంలోని జిన్నారం, జంగంపేట్ గ్రామాల అసైన్డ్ భూ బాధితుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు జిన్నారం మున్సిపల్ మహిళా నాయకురాలు నీలం లత, రాష్ట్ర మంత్రి డా.గడ్డం వివేక్ వెంకట్ స్వామి, కి మెమొరాండం సమర్పించారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో జరిగిన వివిధ ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నీలం లత మంత్రి డా.గడ్డం వివేక్ వెంకటస్వామితో మాట్లాడుతూ

గత ప్రభుత్వ ఆయంలో జిన్నారం, జంగంపేట,రైతుల నుండి అసైన్డ్ భూములను తీసుకొని, ఇప్పటివరకు బాధిత రైతులకు 600 గజాల భూమి గానీ, తగిన నష్టపరిహారం గానీ అందలేదని తెలిపారు. తమ భూములు కోల్పోయిన అనేక మంది రైతులు ప్రభుత్వ పరమైనటువంటి సంక్షేమ పథకాలు కానీ, ప్రభుత్వపరమైన రైతుబంధు రైతు బీమా లాంటి సంక్షేమ పథకాలు కోల్పోయి, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి తోఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది రైతులు భూములను కోల్పోయి ఉపాధి అవకాశాలు కూడా కోల్పోయారని పేర్కొన్నారు. అసైన్డ్ భూ బాధితులకు కనీసం 1000 గజాల భూమి కేటాయించాలని లేదా వారి భూములను తిరిగి వారికి అప్పగించాలని నీలం లత మంత్రి ని కోరారు. అలాగే భూములను ప్రభుత్వానికి ఇవ్వని రైతులకు ప్రభుత్వం ద్వారా ఎటువంటి ఒత్తిడి లేకుండా,ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, వారు తమ భూములను స్వేచ్ఛగా సాగు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి డా. గడ్డంవివేక్ వెంకటస్వామి, స్పందిస్తూ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు,మున్సిపల్ ప్రతినిధులు,మండల స్థాయి అధికారులు, గ్రామ పెద్దలు ప్రజాప్రతినిధులు అసలు బాధిత రైతులుపాల్గొన్నారు.

# ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ప్రథమ వార్షికోత్సవం

**- పెండింగ్ హామీలు అమలుకు విజ్ఞప్తి -ముఖ్య అతిథిగా సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూనవనిత**



సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, మే 19 :సంగారెడ్డి పట్టణంలో జి ఆర్కే ఫంక్షన్ హాలులో విశ్రాంత ఆర్టిసి ఉద్యోగుల ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాఘవరెడ్డి హాజరై ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ, గతంలో ఉద్యోగులకు ఇచ్చిన పలు హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మౌలిక సదుపాయాలు కూడా కలుగ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యోగులకు బస్ పాస్‌లు, పీఫ్ రిటైర్మెంట్ అయిన వారికి సూపర్ లగ్జరీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం, పీఫ్ రిటైర్మెంట్ అయిన వారికి పెన్షన్ సౌకర్యం, ఆఫీస్ డ్యూటీలో ఉన్న ఉద్యోగులకు జేన్ రెస్ట్ రూమ్ సౌకర్యం కల్పించాలని కోరారు. తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ ని కోరారు. ఉచిత 10 లక్షల ఆరోగ్య బీమా పథకం ఉన్నందున, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయాలని, వీటిని తక్షణమే ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన కోరారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చకపోతే ఉద్యోగుల తరపున పోరాటం చేస్తామని తెలిపారు. ముఖ్యఅతిథిగా సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత మాట్లాడుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కోసం 200 గజాల భవన నిర్మాణం కోసం టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, ఇప్పించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న కృషి నీ అభినందించారు. అనంతరం డిపో మేనేజర్ ఉపేందర్ మాట్లాడుతూ మొదటిసారిగా విశ్రాంత ఉద్యోగులు సమావేశం కావడం చాలా సంతోషంగా ఉందని పింఛన్ కూడా సరిగా రాని విశ్రాంతి ఉద్యోగులు ఒక విధంగా బాధగా ఉన్న మీరు చేస్తున్న కృషికి అభినందనలు తెలిపిన సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్. మెదక్ రీజినల్ అధ్యక్షులు పీరయ్య, మెదక్ రీజినల్ చైర్మన్ పిఎస్ నారాయణ, బి రాజయ్య రాష్ట్ర అధ్యక్షులు, ఎస్ బుచ్చిబాబు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బి మురళీధర్ రాష్ట్ర కార్యదర్శి, ఎండి ఫరూక్ రాష్ట్ర కార్యదర్శి, కే మూర్తి రాష్ట్ర కార్యదర్శి ఆర్టిసి విశ్రాంత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పేదరికపు కోరల్లో సామాన్యుడు..!

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అశాంతి, ఆర్థిక అనిశ్చితిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యక్తం చేసిన ఆందోళన ముమ్మాటికీ ఆలోచించదగ్గది. ఐదు దేశాల పర్యటనలో భాగంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటన ముగించుకుని నెదర్లాండ్స్ చేరుకున్న ప్రధాని, అక్కడ భారతీయ సమాజాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగం ప్రస్తుత ప్రపంచ ముఖచిత్రాన్ని కళ్లకు కట్టింది. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు గనక వేగంగా మెరుగుపడకపోతే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అధిక జనాభా మళ్లీ పేదరికపు కోరల్లోకి జారిపోయే ప్రమాదం ఉందన్న ఆయన హెచ్చరిక అత్యంత యదార్థం. ఈ దశాబ్దం ప్రారంభం నుంచే ప్రపంచాన్ని విపత్తులు వెంటాడుతున్నాయి. మొదట కోవిడ్ మహమ్మారి మానవాళిని పట్టిపీడించి, ప్రపంచాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది. ఆ గాయం మానకముందే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం చెలరేగింది. ఇది చాలదన్నట్లు, తాజాగా అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య మొదలైన సైనిక ఘర్షణలు ప్రపంచాన్ని మరింత ఆందోళనలోకి నెట్టాయి. ముఖ్యంగా వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధి దిగ్బంధం కావడం వల్ల గల్ఫ్ దేశాల నుండి ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నేటికీ కొనసాగుతున్న ఈ సంక్షోభం కారణంగా చమురు, గ్యాస్ సరఫరాలు నిలిచిపోయి, ప్రపంచవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చమురు ధరల పెరుగుదల ప్రభావం అంతర్జాతీయ మార్కెట్లకే పరిమితం కాలేదు. ఇటీవలే భారతదేశం కూడా పెట్రో ధరలను పెంచక తప్పలేదు. రాబోయే రోజుల్లో ఇవి మరింత ప్రియమయ్యే సూచనలు కనిపిస్తు న్నాయి. ఇంధన ధరల పెరుగుదల కేవలం రవాణా రంగానికే పరిమితం కాదు; ఇది నిత్యావసర వస్తువుల ధరలను పెంచి, ద్రవ్యోల్బణాన్ని రగిలిస్తుంది. దీనివల్ల సమాజంలో అందరికంటే ఎక్కువగా నలిగిపోయేది ఆర్థికంగా వెనుకబడిన దిగువ తరగతి, పేద వర్గాలే.

**భారత్‌కు ఎదురవుతున్న సవాలు..**

గడిచిన కొన్నేళ్లుగా భారతదేశం కోట్ల మందిని పేదరికం నుండి విజయవంతంగా బయటకు తీసుకురాగలిగింది. ఇది దేశం సాధించిన గొప్ప మైలురాయి. అయితే, ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభాల వల్ల ఆ వర్గాలన్నీ మళ్లీ పేదరికంలోకి నెట్టబడే ప్రమాదం పొంచి ఉండటమే ఇప్పుడు దేశం ముందున్న అతిపెద్ద సవాలు. ఈ విపత్కర పరిస్థితి కేవలం భారత్‌కే కాదు, ప్రపంచంలోని అన్ని అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు పెను శాపంగా మారింది. యుద్ధాలు కేవలం ఇంధన సరఫరాను మాత్రమే కాదు, అంతర్జాతీయ సరఫరా గొలుసులను సైతం దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్త ద్రవ్యోల్బణం గుదిబండగా మారుతోంది. ఇంత జరుగుతున్నా, ప్రపంచాన్ని శాసించే అగ్రరాజ్యాలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ఉద్రిక్తతలను తగ్గించడానికి చొరవ చూపుతాయా అంటే సమాధానం శూన్యమనే చెప్పాలి.

అమెరికా అనుసరిస్తున్న ఏకపక్ష సుంకాల విధానాలు ఇప్పటికే పలు దేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీశాయి. భవిష్యత్తును లెక్కచేయ కుండా ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై జరిపిన దాడులు ప్రపంచ శాంతిని పూర్తిగా ప్రశ్నార్థకం చేశాయి. ప్రపంచంలో శాంతి, స్థిరత్వం ఎప్పుడు పునరుద్ధరించబడతాయో తెలియని ఈ అనిశ్చిత స్థితిలో, భారత ప్రభుత్వం అంతర్గతంగా గట్టి చర్యలు తీసుకోవడం అత్యవసరం. ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలకు నిజమైన సాధికారత కల్పించే దీర్ఘకాలిక ఆర్థిక విధానాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి. ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసమో, తాత్కాలిక ఉపశమనం కోసమో కాకుండా... పేదరికాన్ని సమూలంగా నిర్మూలించి, వారిని స్వయంసమృద్ధులుగా మార్చేలా ఉండాలి. అప్పుడే.



అంతర్జాతీయంగా ఎలాంటి సంక్షోభాలు ఎదురైనా తట్టుకుని నిలబడగలిగే అంతర్గత శక్తి భారతదేశానికి లభిస్తుంది,

ఆకుల సత్తిరాజు, సీనియర్ జర్నలిస్టు

# జనాభా లెక్కల సేకరణలో ప్రతి ఒక్కరు సహకరించాలి..

**మల్కాజిగిరి జీహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్..**






మల్కాజిగిరి, భారతశక్తి: ప్రభుత్వ ఆదేశాల మేరకు జనగణన 2027 కార్యక్రమం నిర్వహించబడుచున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా జనగణన సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంటికి సంబంధించి జనగణన వివరాలు సేకరించనున్నారని, దానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మల్కాజిగిరి జీహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ కోరారు. కాబట్టి ప్రజలందరూ జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించి, సరైన, నిజమైన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. సిబ్బంది గుర్తింపు కార్డులను కలిగి ఉండగా, ప్రజలు వివరాలు అందించే ముందు వాటిని పరిశీలించాలన్నారు. అలాగే గృహ యజమానులు, అపార్ట్‌మెంట్ సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాలు స్థానిక ప్రజాప్రతినిధులు జనగణన సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలన్నారు.

# సమాజ సేవలో యువకులు ముందుకు రావాలి..

**మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆలంపల్లి సురేష్**



మల్కాజిగిరి, భారతశక్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మామ సూదిని పద్మా రెడ్డి, తెలంగాణ గ్రామపంచాయతీ ట్రైబ్యునల్ చైర్మన్ సూదిని రాం రెడ్డి మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఆలంపల్లి సురేష్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం మల్కాజ్ గిరి లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో లో నిర్వహించారు. సంఘ సభ్యులు, ప్రముఖులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదిని రామ్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి అలంపల్లి సురేష్ మరింత కృషి చేసి సంఘాన్ని ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే సూదిని పద్మారెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో యువ నాయకత్వం ఎంతో అవసరమని, మల్కాజిగిరి ఆర్యవైశ్య సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం అలంపల్లి సురేష్ ని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

# ఆస్తి పన్ను తగ్గించాలి

**మీర్‌పేట్ కాలనీవాసుల ఆందోళన..**

**ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పణ**



మహేశ్వరం, మే 19 భారత శక్తి: మీర్‌పేట్ నగరపాలక సంస్థ (మున్సిపల్ కార్పొరేషన్) పరిధిలో విపరీతంగా పెంచిన ఆస్తి పన్నును తగ్గించాలని కోరుతూ స్థానిక కాలనీల నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం మహేశ్వరం శాసనసభ్యురాలు (ఎమ్మెల్యే) సబితా ఇంద్రారెడ్డిని ఆమె నివాస కార్యాలయంలో కలిసి కాలనీవాసులు ఒక వినతిపత్రాన్ని అందజేశారు.

**- జీహెచ్ఎంసీ తరహాలోనే పన్నులుండాలి..**

ఇటీవల హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ)లో విలీనమైన ప్రాంతాల నిబంధనల ప్రకారమే తమకూ పన్నుల విధానం ఉండాలని స్థానికులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం మీర్‌పేట్ పరిధిలో వసూలు చేస్తున్న ఆస్తి పన్నులు సామాన్యులకు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో అమలవుతున్న పన్నుల విధానాన్నే తమ ప్రాంతంలోనూ వర్తింపజేసి, పెరిగిన పన్నుల భారం నుండి ఉపశమనం కలిగించాలని ఎమ్మెల్యేను కోరారు.

**- కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తా: ఎమ్మెల్యే**

బాధితుల వినతిపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆస్తి పన్నుల పెంపు వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న పన్నుల విధానాన్ని మీర్‌పేట్ ప్రాంతంలోనూ అమలు చేసేలా అధికారులతో చర్చిస్తానని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీల ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# పాత పద్ధతిలోనే అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి.

**- తొలుత కమిటీ సభ్యులకు, జిల్లాకు 4 కార్డులు ఇస్తామంటే తిరస్కరించిన కమిటీ.**

**- ఎమ్ పానల్ లో ఉన్న పత్రికల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి జర్నలిస్టు కు కార్డులు ఇవ్వాలని కమిటీ తీర్మానం.**



భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 19 (భారతశక్తి): ప్రభుత్వ కొత్త జీవో 252 నిబంధనలు పాత్రికేయులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని భద్రాద్రి జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్ ముందు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. పెద్ద పత్రికల విషయంలో నిబంధన ప్రకారం ఈరోజు అక్రిడేషన్ కమిటీ సభ్యులతో పాటు నాలుగు కార్డులు అందిస్తామని డి పి ఆర్ ఓ ప్రస్తావన తీగ జిల్లా కమిటీ జిల్లా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తిరస్కరించారు. తమకు కార్డు ప్రస్తుతం అవసరం లేదని జిల్లాలోని మండలాల రిపోర్టర్లకు కార్డు నందించినప్పుడే తాము కూడా తీసుకుంటామని స్పష్టం చేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రభుత్వం నిబంధన ప్రకారం పెద్ద పత్రికలు తొలుత నాలుగు కార్డులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. తమ జిల్లా వ్యాప్తంగా మండలాల్లో చిన్నప్పుడే ఆ నాలుగు కార్డులు కూడా తీసుకోవడం జరుగుతుందని కమిటీ సభ్యులు కలెక్టర్ ముందు స్పష్టం చేశారు. ఎం పానల్లో ఉన్న ప్రతి పత్రికకు ఎలక్ట్రానిక్ ఛానల్లకు, కేబుల్ ఛానల్కు సైతం కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు పట్టుబట్టారు. దీని పట్ల స్పందించిన కలెక్టర్ జిల్లాలో ఏ రిపోర్టర్కును అన్యాయం జరగకుండా చూస్తామని మీకు సంబంధించిన డిమాండ్లు ఏమైనా ఉంటే దరఖాస్తు సమర్పించాలని సూచించారు. పెద్దపత్రికలకు జిల్లా కేంద్రంలో, కార్పొరేషన్, భద్రాచలం టెంపుల్ ఏరియా, నియోజకవర్గాల తోపాటు ఎలక్ట్రానిక్ మీడియా కు జిల్లాలో 9 కార్డులు, కేబుల్ చానల్లకు కూడా డిస్ట్రిక్ట్ కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి కలెక్టర్ కు అందించారు. తీర్మాన కాపీని స్వీకరించిన కలెక్టర్ ఐ ఎన్ పి ఆర్ కమిషనర్ తో మాట్లాడి జిల్లాలోని జర్నలిస్టులు అందరికీ న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ అజ్గర్ హుస్సేన్, కమిటీ సభ్యులు బి వి. రమణారెడ్డి, కల్లోజు శ్రీనివాస్ , వట్టి కొండ రవి, ఎం ఏ. వాహెద్, జి. వెంకటేశ్వర్లు, మొబగాపు ఆనంద్, మాటేటి మధు, ఎండి. యాకుబ్ పాషా, నాగ చంద్ర, ప్రశాంత్, ఆర్టీసీ అధికారి వైఎన్ రావు, పిల్లి రాజేష్, ఫణికుమార్, మోక్షిత్, సిబ్బంది పాల్గొన్నారు.

# సృజనాత్మకతకు కేరాఫ్‌గా యాలాల పీఎం శ్రీ పాఠశాల

**విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తున్న వేసవి శిబిరం**

**మట్టి కళలు, కూచిపూడి, ఇంద్రజాలంతో సందడిగా క్యాంప్**

**యాలాల విద్యాధికారి పాఠశాల ఉపాధ్యాయుల ప్రత్యేక కృషి అభినందనీయం**






వికారాబాద్ మే 19 భారత శక్తి వికారాబాద్ జిల్లా యాలాల మండల కేంద్రంలోని పీఎం శ్రీ పాఠశాల విద్యార్థుల సృజనాత్మకతకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక వేసవి శిబిరం విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ అద్భుతంగా కొనసాగుతోంది. ఈ నెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జిల్లాలోని 21 పీఎం శ్రీ పాఠశాలల్లో 15 రోజులపాటు ఈ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. యాలాల పాఠశాలలో సుమారు వంద మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కార్పొరేట్ స్థాయి సమ్మర్ క్యాంప్‌లను తలపించేలా ఇక్కడ విద్యార్థులకు విభిన్న అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు.

భారతీయ సాంప్రదాయ చేతివృత్తులను పరిచయం చేస్తూ పర్యావరణ హితమైన మట్టి పాత్రలు, చిన్న చిన్న మట్టి వస్తువుల తయారీని కుమ్మరి వృత్తిదారుల సహాయంతో ప్రత్యక్షంగా చూపించారు. పిల్లలు స్వయంగా మట్టితో వస్తువులు తయారు చేస్తూ ఆసక్తిగా పాల్గొన్నారు. ఇదే కాకుండా కూచిపూడి నాట్యం, ఇంద్రజాల విద్యలు, ఇండోర్ గేమ్స్, దేశభక్తి గేయాలు, చక్కటి చూచిరాత వంటి అంశాల్లో కూడా నిపుణులైన వాలంటీర్లు, ఉపాధ్యాయులు ప్రతిరోజూ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. విద్యతో పాటు సంస్కృతి, కళలు, వ్యక్తిత్వ వికాసంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్రకృతి ప్రేమను పెంపొందించే కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో శ్రీనిజ విద్యార్థులతో కలిసి మట్టి వస్తువులు తయారు చేస్తూ వారిని ప్రోత్సహించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో పిల్లలను ముందంజలో నిలిపేందుకు ఈ వేసవి శిబిరం ఎంతగానో ఉపయోగపడుతోందని ఇందులో మండల విద్యాధికారి మహిపాల్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాడు సిద్రామేశ్వర్, ఉపాధ్యాయ బృందం కృషి అభినందనీయం అని స్థానికులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటున్నారు.

# సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై 'మల్కాజ్‌గిరి' పోలీసుల ఉక్కుపాదం!

**- ఒక్కరోజే 1,340 కేసులు నమోదు.. రూ.13.39 లక్షల జరిమానా విధింపు**

**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: పోలీస్ కమిషనర్ బి. సుమతి హెచ్చరిక**



Malkajgiri Commissionerate
Special Drive Cases on Cell phone Driving on dt: (19.05.2026).

| S.No | Police station | Cell phone Driving (Contact) Cases | Cell phone Driving (Contact) Amount | Cell phone Driving (Non-Contact) Cases | Cell phone Driving (Non-Contact) Amount | Grand Total: Total Cases | Grand Total: Total Amount |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Malkajgiri Tr PS | 86 | 86000 | 11 | 11000 | 97 | 97000 |
| 2 | Gopalpuram Tr PS | 102 | 102000 | 40 | 40000 | 142 | 142000 |
| 3 | Jawaharnagar Tr PS | 48 | 48000 | 71 | 71000 | 119 | 119000 |
| 4 | Trimulgherry Tr PS | 163 | 163000 | 80 | 80000 | 243 | 243000 |
| 5 | Alwal Tr PS | 131 | 130000 | 49 | 49000 | 180 | 179000 |
| 6 | Begumpet Tr PS | 163 | 163000 | 98 | 98000 | 261 | 261000 |
| | Zone- I | 693 | 692000 | 349 | 349000 | 1042 | 1041000 |
| 1 | LB Nagar Tr PS | 72 | 72000 | 9 | 9000 | 81 | 81000 |
| 2 | Vanasthalipuram Tr PS | 60 | 60000 | 49 | 49000 | 109 | 109000 |
| 3 | Uppal Tr PS | 34 | 34000 | 17 | 17000 | 51 | 51000 |
| 4 | Kushaiguda Tr PS | 18 | 18000 | 5 | 5000 | 23 | 23000 |
| 5 | Ghatkesar Tr PS | 20 | 20000 | 14 | 14000 | 34 | 34000 |
| | Zone- II | 204 | 204000 | 94 | 94000 | 298 | 298000 |
| | Total | 897 | 896000 | 443 | 443000 | 1340 | 1339000 |

Section:
Cell Phone Driving (S 184)




మల్కాజ్‌గిరి, మే 19 : భారత శక్తి, వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడే బేఖాతరు డ్రైవర్లపై మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. రహదారి భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా కమిషనరేట్ వ్యాప్తంగా మంగళవారం ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్) చేపట్టారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ శ్రీమతి బి. సుమతి, ఖూా ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ జోన్-×, జోన్-×× పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ తనిఖీలు ముమ్మరంగా సాగాయి. డిసిపి (ట్రాఫిక్--×), డిసిపి (ట్రాఫిక్--××)ల ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ నిఘా చర్యల్లో ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా ప్రధాన కూడళ్లు, కారిడార్లు, సిగ్నల్ పాయింట్లు, రద్దీగా ఉండే ప్రాంతాలలో ప్రత్యేక బృందాలను మోహరించి నిబంధనలు ఉల్లంఘించిన వారిని పట్టుకున్నారు.

**మొదటిరోజే భారీగా జరిమానాలు:**

ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్ వాడుతూ వాహనాలు నడిపిన వారిపై లిమొత్తం 1,340 కేసులులి నమోదు చేశారు. నిందితులకు లిరూ. 13,39,000/- (పదమూడు లక్షల ముప్పై తొమ్మిది వేల రూపాయలు)లి జరిమానా విధించినట్లు అధికారులు వెల్లడించారు. డ్రైవింగ్ చేస్తూ మొబైల్‌లో మాట్లాడటం, మెసేజ్‌లు పంపడం (టెక్స్టింగ్), ఇంటర్నెట్ బ్రౌజింగ్, వీడియో రికార్డింగ్ చేయడం, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఆపరేట్ చేయడం లాంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకున్నారు.

**ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు..**

సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల డ్రైవర్ల ఏకాగ్రత దెబ్బతింటుందని, సడన్ బ్రేక్ వేయాల్సిన సమయంలో స్పందించే వేగం (రియాక్షన్ టైమ్) తగ్గిపోతుందని ట్రాఫిక్ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల డ్రైవర్ల ప్రాణాలకే కాకుండా, తోటి వాహనదారులు, పాదచారుల ప్రాణాలకు కూడా తీవ్ర ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు.

"ఒక ఫోన్ కాల్ కాసేపు వేచి ఉండగలదు.. కానీ ఒక ప్రమాదం జీవితాన్ని ఎప్పటికీ మార్చేస్తుంది!"లి

**- మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీస్ సందేశం**

**-తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి..**

వాహనదారులు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు ఉపయోగించవద్దని, అత్యవసరమైతే వాహనాన్ని పక్కకు సురక్షితమైన ప్రదేశంలో ఆపి మాట్లాడాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. కమిషనరేట్ వ్యాప్తంగా ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, పదే పదే నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయని పి.ఆర్.ఓ (ూ=ూ) ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# నీటిపారుదల రంగానికి కొత్త దిశ

**- 36 ప్రాజెక్టులకు స్పష్టమైన గడువులు - రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు**

**అమరావతి (భారత శక్తి)** : రాష్ట్రంలోని మొత్తం 36 ప్రాజెక్టులకు స్పష్టమైన గడువు పెట్టుకుని పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో పూర్తి చేయాలనే లక్ష్యాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించడం జరిగిందని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన ఇరిగేషన్ ప్రాజక్టులపై సమగ్ర సమీక్ష జరిగిందని, ఇందులో 25 పాత ప్రాజెక్టులతో పాటు 11 కొత్త ప్రాజెక్టులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంగా పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నీటిపారుటల శాఖకు నిర్ధేశించడం జరిగిందన్నారు. ప్రతి ప్రాజెక్టుకు శంకుస్థాపన, పురోగతి, పూర్తి గడువులు ఖచ్చితంగా నిర్దేశించబడటం జరిగిందన్నారు. 2026?2028 కాలానికి 36 ప్రాజెక్టుల సమగ్ర కార్యాచరణ ప్రణాళిక?..గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన 25 ప్రాజెక్టులతో పాటు, సీఎం గుర్తించిన మరో 11 ప్రాజెక్టులను కలిపి మొత్తం 36 ప్రాజెక్టులకు స్పష్టమైన ప్రాధాన్యతా క్రమం, దశలవారీ గడువులు, అమలు ప్రణాళిక రూపొందించబడిందన్నారు. 2026 జూలై నాటికి పోలవరం ఒ౨ఆ ద్వారా ఉత్తరాంధ్రకు నీటి సరఫరా, గుంటూరు ఛానల్ మోడరేషన్ పనుల శంకుస్థాపన, తుంగభద్ర కొత్త 33 గేట్ల ప్రారంభం వంటి కీలక పనులు అమలులోకి వస్తాయన్నారు. 2026 ఆగస్టు నాటికి వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్?1 పూర్తి, అనంతపురం జిల్లాలో పేరూరు బ్రాంచ్ కెనాల్ శంకుస్థాపన, పాలేరు రిజర్వాయర్ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. 2026 అక్టోబర్ నాటికి హంద్రీ?నీవా (ఊబొూ) ఫేజ్?2 పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. నవంబర్ 2026లో నేరేడి బ్యారేజ్ శంకుస్థాపన జరగనుందన్నారు. 2026 డిసెంబర్ నాటికి పెన్నా?సర్వేపల్లి రిజర్వాయర్ పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. 2027 జనవరి నాటికి మద్దువలస స్టేజ్?2 పూర్తి కావడంతో పాటు నీవా బ్రాంచ్ కెనాల్ మూలపల్లి వరకు ప్రారంభం కానుందన్నారు. 2027 ఏప్రిల్ నాటికి హీరమండలం ఎత్తిపోతల లిఫ్ట్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. 2027 జూన్ నాటికి నాగావళి?చంపావతి నదుల అనుసంధానం, బుడమేరు వరద రక్షణ పనులు, కొల్లేరు ప్రక్షాళన, ముక్త్యాల ఎత్తిపోతల పథకం మరియు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించబడిందన్నారు. 2027 జూలై నాటికి వంశధార స్టేజ్?2, చింతలపూడి ఎత్తిపోతల పథకం, మహేంద్రతనయ?గజపతినగరం బ్రాంచ్ కెనాల్స్, తోటపల్లి డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు. 2027 డిసెంబర్ నాటికి మూలపల్లి లిఫ్ట్ ద్వారా కళ్యాణి డ్యామ్ వరకు నీటి అనుసంధానం, మడకశిర బ్రాంచ్ కెనాల్, జంజావతి రిజర్వాయర్ ప్రాజెక్టు పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. 2028 డిసెంబర్ నాటికి తారకరామ సాగర్, వేదావతి ఎత్తిపోతల ప్రాజెక్టు, అనంతపురం జిల్లాలో భైరవానితిప్ప (ఙఖ), అప్పర్ పెన్నార్ ప్రాజెక్టులు, ఉబొూ విస్తరణ (కడప?రాజంపేట?కోడూరు), సోమశిల?స్వర్ణముఖి లింక్ కెనాల్, గోదావరి డెల్టా ఆధునీకరణ (ఒఎఆంఖీ సర్వే ఆధారంగా), ౫ఖీఓఅ విస్తరణ (40,000 నుండి 80,000 క్యూసెక్లకు), ఉబొూ కోడూరు వరకు విస్తరణ, అలాగే వరికపూడిశల ప్రాజెక్టు పూర్తి చేయాలని సమగ్ర లక్ష్య ప్రణాళిక రూపొందించబడిందన్నారు. ఈ విధంగా 2026 నుండి 2028 వరకు రాష్ట్ర నీటిపారుదల రంగాన్ని సమూలంగా మారుస్తూ, ప్రతి ప్రాజెక్టుకు స్పష్టమైన లక్ష్యం, గడువు, అమలు దిశను ప్రభుత్వం ఖరారు చేసిందని మంత్రి తెలిపారు.




## పొగతో వాహనదారులకు ఇబ్బందులు



**గుంటూరు..(భారత శక్తి)**నల్లపాడులో రోడ్డు కాపర్ ఫాక్స్ బార్ ఎదురు మెయిన్ రోడ్డు పక్కన ఉన్న చెత్తను కాల్చడంతోపొగలు ఎగిసి పడుతున్నాయి. ఈ పొగ వాహనదారులకు ఇబ్బంది గా మారుతోంది. ఒక పక్క గుంటూరు జిల్లా కలెక్టర్ సీ.యం సాయి కాంత్ వర్మ,మున్సిపాలిటీ సిబ్బంది ఎవరు కుడా చెత్త తగులపెట్టవద్దు అని చెప్తున్నాను. కాని కొంత మందికి అది పట్టనట్టు చెత్తను కాలుస్తూనే ఉన్నారు.. దినికి సంబందించిన వారిపై చర్యలు తీసుకుంటారా లేదాఅని వేచి చూడాలి.

## కవాడిగూడలో మహిళ దారుణ హత్య



**హైదరాబాద్ (భారత శక్తి)**నగరంలోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవాడిగూడలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. కవాడిగూడలోని రత్నదీప్ బిల్డింగ్ నాలుగో అంతస్తులో శ్వేత అనే మహిళను గుర్తుతెలియని వ్యక్తి కత్తితో పొడిచి హత్య చేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న వెంటనే గాంధీనగర్ పోలీసులు, క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నిందితుడి వివరాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకు గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.

## ఒస్మాన్నగర్ కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంత్రి వివేక్ శంకుస్థాపన



**సంగారెడ్డి,(భారత శక్తి)** కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం మండలం, ఒస్మాన్నగర్ గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.60 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేపడుతున్నారు. సంగారెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రికి స్థానిక నాయకుల ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భవిష్యత్ తరాల మెరుగైన భవిత కోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని మంత్రి అన్నారు.

## లులు హైపర్ మార్కెట్లో నాసిరకం నిల్వలు

**- పలు ఆహార పదార్థాలతో పురుగులు**


**హైదరాబాద్ (భారత శక్తి)**ఐకూకట్పల్లి లులు హైపర్మార్కెట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు జరిపారు. పలు ఆహార పదార్థాల్లో పురుగులు, నాసిరకం నిల్వలు గుర్తించారు. కిచెన్లో అపరిశుభ్రత, పాడైపోయిన కూరగాయలు, పురుగుల సంచారం వెలుగులోకి వచక్చాయి. గడువు సమీపించిన ఆహార పదార్థాలపై తప్పుదారి పట్టించే లేబుళ్లు వున్నట్లు అధికారులు గుర్తించారు. శనగపిండి, ఆటా, పప్పుల్లో పురుగులను గుర్తించారు. గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్తో ప్యాక్డ్ ఫుడ్ విక్రయం నడుస్తోంది. మాంస వ్యర్థాలతో మూసుకుపోయిన డ్రెయిన్లు వున్నాయి. సుమారు 150 కిలోల ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. కల్తీ, అధిక కృత్రిమ రంగుల అనుమానంతో ఆహార నమూనాలు సేకరించారు.

## నన్ను చంపాలని చూస్తున్నారు

**- పాస్టర్ అభినయ్ దర్శన్**

**విజయవాడ (భారత శక్తి)**పాస్టర్ ప్రవీణ్ పగడాల లాగే నన్ను చంపాలని చూస్తున్నారు. పోలీసులు విచారణ మీద నాకు నమ్మకం లేదని పాస్టర్ అభినయ్ దర్శన్ అన్నారు. మంగళవారం తనపై జరిగిన దాడి తరువాత మీడియాతో అయన మాట్లాడారు. ప్రవీణ్ పగడాల నాలుగు బ్రాండ్లు తాగి యాక్సిడెంట్ చేసినట్లు దొంగ సాక్ష్యాలు సృష్టించారు. నాపై దాడి చేసిన వారిని వదిలేసి, నా అనుచరులను అరెస్టు చేశారు. నేనే నాపై దాడి చేసుకున్నట్లు తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తున్నారు. పాస్టర్లందరూ దొంగలే అనే తరహాలో చిత్రీకరిస్తున్నారు. నాపై దాడి వ్యవహారంలో ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుకి సంబంధం ఉందని అనుకోను. కొంతమందిపై నాకు అనుమానం ఉంది.. వారి పేర్లు త్వరలోనే బయట పెడతానని అన్నారు.

## వాటర్ వర్క్స్ జీఎం ఇంటిపై ఏసీబీ దాడులు



**సికింద్రాబాద్(భారత శక్తి)** హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ వర్క్స్ జనరన్ మేనేజన్ లక్ష్మీ కుమార్ ఇంటిపై ఏసీబీ దాడులు నిర్వహించింది. దాదాపు రూ. 1.05 కోట్ల రూపాయల నగదు, కేజీ బంగారం లభ్యం అయినట్లు సమాచారం. మల్లాపూర్, వెంకటరమణ కాలనీలో ఉన్నఅయన ఇంట్లో సోదాలు నిర్వహించి, రూ. 1.05 కోట్ల నగదు, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్లో 3 ఎకరాల భూమి, హైదరాబాద్లో 9 ఫ్లాట్లు, రూ. 100 కోట్లు వరకు ఆస్తులున్నాయని గుర్తించారు.

## నడిరోడ్డుపై మూడు వాహనాలు దగ్ధం

**రాజంపేట(భారత శక్తి)** రైల్వే కోడూరు మండలం బాలుపల్లి చెక్ పోస్ట్ వద్ద ప్రమాదం జరిగింది. ఆగి వున్న లారీని వెనుక నుంచి ఇన్నోవా కారు ఢీకొంది. ఆ ఇన్నోవా కారును మరో కారు ఢీకొంది. ఘటనలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. వారిని తిరుపతి ఆస్పత్రికి తరలించారు. మూడు వాహనాలు మాత్రం మంట్లో దగ్ధం అయ్యాయి. అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

### సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా

## రైతులు అందోళనలు

**సిద్దిపేట (భారత శక్తి)**సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు రోడెక్కారు. నెల రోజులైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలేదని రోడ్డెక్కి నిరసనకు దిగారు. రాయపోల్ మండల పరిధిలోని వీరానగర్ వద్ద, దుబ్బాక మండలం తిమ్మాపూర్ వద్ద, సిద్దిపేట మండలం పుల్లూరు వద్ద రోడ్డుపై బైఠాయించారు. వర్షం పడితే తీరని నష్టం కలుగుతుందని, వెంటనే పంట కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్.

### భూ భారతి పేరిట అసైన్డ్ భూములు

## కొల్లగొడుతున్న కాంగ్రెస్ నాయకులు

**హైదరాబాద్ (భారత శక్తి)**కాంగ్రెస్ నేతలు భూభారతి పేరిట అసైన్డ్ భూమునలను కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ నేత క్రిశాంక్ ఆరోపించారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అసైన్డ్ భూముల్లో ఎంపి వేం నరేందర్ రెడ్డి మైనింగ్ చేస్తున్నాడు. 2010లో, 2015లో వేం నరేందర్ రెడ్డి ఎలక్షన్ అఫిడవిట్లో అసైన్డ్ భూములు గురించి ఎక్కడా లేదు.. కాని 2026లోని ఎలక్షన్ అఫిడవిట్లో వాటి వివరాలు ఉన్నాయి. వేం నరేందర్ రెడ్డి భార్య విజయ లక్ష్మి పేరు మీద ఉన్న శ్రీ సాయి కృష్ణ గ్రానైట్స్ కంపెనీ కింద ఈ భూములు ఉన్నాయి. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అసైన్డ్ భూముల సర్వే నంబర్, శ్రీ సాయి కృష్ణ గ్రానైట్స్ కంపెనీ ఉన్న భూములు ఒకటే సర్వే నంబర్ కింద ఉన్నాయి. అవి అసైన్డ్ భూములని ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ సంతకాలు కూడా ఉన్నాయి. ఇందులో కచ్చితంగా పాత మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ప్రాత్ర కూడా ఉందని అయన అన్నారు.అందుకే వేం నరేందర్ రెడ్డి రాజ్య సభకి పోతు.. నువ్వు కూడా నా వెంట రా అని కలెక్టర్కి ఢిల్లీలోని తెలంగాణ భవన్లో స్పెషల్ సెక్రటరీ పదవి ఇప్పించాడని అన్నారు.

### హనుమాన్ విగ్రహం ధ్వంసం చేసిన

## గుర్తు తెలియని వ్యక్తులు

**హనుమకొండ (భారత శక్తి)**న్యూ శాయంపేటలో ఉద్రిక్తత నెలకొంది. హనుమాన్ విగ్రహాన్ని గుర్తు తెలియను వ్యక్తులు ధ్వంసం చేసిన విషయం తెలుసుకుని విగ్రహ ధ్వంస స్థలానికి హిందూ సంఘాలు, భక్తులు భారీగా చేరుకున్నారు. న్యూ శాయంపేట ప్రధాన రహదారిపై ధర్నా కు దిగడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. విగ్రహం ధ్వంసం చేసిన వారిపైన కఠినచర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేసారు. హనుమాన్ భక్తులు, బజరంగదళ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్ఆరు. ఈ నేపథ్యంలో పోలీసులు హనుమాన్ భక్తులకు మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది.

## టీడీపీ ప్రచారాన్ని ఖండించిన వైసీపీ ఎమ్మెల్యే

**పాడేరు (భారత శక్తి)**పాస్టర్ అభినయ్ దర్శన్ పై దాడి ఘటనను ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు తీవ్రంగా ఖండించారు. ఈ అంశంపై తనపై టీడీపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని అయన ఖండించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాస్టర్ అభనయ్ దర్శన్పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడి చేసిన వారిని ప్రజల ముందు నిలబెట్టి.. కఠినంగా శిక్షించాలి. ఈ దాడి తన అనుచరులు చేశారని కూటమి నాయకులు ప్రచారం చేయడం దురదృష్టకరమని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక వైసీపీపై ప్రచారాలు చేస్తున్నారని అయన అన్నారు.

## పలు దొంగతనం కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసిన విజయవాడ సి.సి.యస్. పోలీసులు

**- నిందితుడి వద్ద నుంచి సుమారు 12.75 లక్షల విలువైన 85 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాదీనం**



**(భారత శక్తి)** ఇన్స్పెక్టర్ ఎం.కిషోర్ బాబు , సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పగలు సమయాలలో జరిగే దొంగతనాలను నివారించడంలో ప్రత్యేక దృష్టి సారిస్తూ దొంగతనం జరిగిన కేసుల్లోని సంఘటనా స్థలానికి చేరుకొని, సాంకేతిక ఆధారాలను సేకరించి, అనుమానితుల కదలికలపై పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగినది.ఈ నేపథ్యంలో ది.19.05.2026 తేదిన సాయంత్రం 04.00 గంటలకు సి.సి.యస్ ఇన్స్పెక్టర్ ఎం.కిషోర్ బాబు, మాచవరం క్రైమ్ ౫ఎ శంకర రావు కు రాబడిన పక్కా సమాచారం మేరకు వారి వారి సిబ్బందితో కలిసి మాచవరం పోలీస్ స్టేషన్ పరిదిలోని క్రీస్తురాజపురం ఏరియాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకుని విచారించి అతని వద్ద నుండి సుమారు 12.75 లక్షల విలువైన 85 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాదీనం చేసుకుని అరెస్ట్ చేయడం జరిగింది.

### హోటళ్లు,లాడ్జీల యాజమాన్యాలు

## అలర్ట్‌గా ఉండాలి

**- సిపి గౌస్ ఆలం**



**కరీంనగర్ (భారత శక్తి)**కరీంనగర్ నగరంలో ఇటీవల పీఎంజే జ్యువెలరీలో జరిగిన భారీ దోపిడీ ఉదంతాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోటళ్లు,లాడ్జీల యజమానులు, నిర్వాహకులతో కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలునందు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ. ఆయుధాలతో కూడిన ఓ అంతర్రాష్ట్ర దొంగల ముఠా నకిలీ ఆధార్ కార్డులు, తప్పుడు ఫోన్ నంబర్లు, తప్పుడు చిరునామాలు ఇచ్చి నగరంలోని పలు హోటళ్లలో దాదాపు రెండు నెలల పాటు బస చేసి, నిఘా రెక్కి నిర్వహించినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతే ధ్యేయంగా పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా కఠినమైన మార్గదర్శకాలను జారీ చేస్తున్నామని తెలిపారు.హోటళ్లు, లాడ్జీలకు ముఖ్య సూచనలు:ఖచ్చితమైన గుర్తింపు నిరూపణ హోటల్ లేదా లాడ్జీలలో రూములు కేటాయించే ముందు ప్రభుత్వ గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలి. కేవలం ఆధార్ కార్డులను గుడ్డిగా నమ్మకుండా,అందులోని ఫోటో,వయస్సు, చిరునామా అసలైనవా కాదా అని సరిచూసుకోవాలి. అవసరమైతే అదనపు గుర్తింపు కార్డులను అడగాలన్నారు.యాక్టివ్ మొబైల్ నంబర్ వెరిఫికేషన్: కస్టమర్లు ఇచ్చే మొబైల్ నంబర్ పనిచేస్తుందో లేదో క్రాస్-చెక్ చేసుకోవాలి. అది సదరు వ్యక్తి పేరు మీద ఉందో లేదో నిర్ధారించుకోవాలి. విదేశీయులు వస్తే నిబంధనల ప్రకారం తక్షణమే సమాచారం అందించాలి.సీసీటీవీ నిఘా రికార్డుల నిర్వహణ. ప్రతి హోటల్లో హై-రెజల్యూషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. కనీసం 90 రోజుల ఫుటేజీని భద్రపరచాలి.గెస్ట్ రిజిస్టర్, ఐడీ ప్రూఫ్స్, వాహనాల వివరాలు, చెక్-ఇన్ చెక్-అవుట్ సమయాలను డిజిటల్ రూపంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.అనుమానాస్పద కదలికలపై నిఘా,లగేజీ లేకుండా రూమ్ తీసుకునేవారు, ఆయుధాలు లేదా అనుమానాస్పద బ్యాగులతో వచ్చేవారు, సీసీ కెమెరాల ముందుకు రాకుండా తప్పించుకునే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలి. భారీ నగదు లావాదేవీలు చేసే వారి వివరాలను వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరవేయాలి.

### ధాన్యం తరలింపు అన్ లోడింగ్‌లో

## మరింత వేగం పెంచాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల (భారత శక్తి)** ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం తరలింపు, అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులు, హమాలీలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై మంగళవారం ఉదయం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా ఇతర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని నిర్దేశించినమిల్లులు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలను ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు సమాకూర్చాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ కోసం, మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు.ఎండ తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులు, హమాలీలు అలాగే అన్ లోడింగ్ చేసే మిల్లులు, గోదాముల్లో హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని,తాగు నీరు,ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టాలని సూచించారు. ఇంకా జిల్లాలో ఉన్న గోదాములను ధాన్యం అన్ లోడింగ్ చేసేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు.రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ జాప్యం చేయవద్దని డీఆర్డీఓ,డీసీఓ, ఏవో మెప్మా, ఇతర అధికారులను ఆదేశించారు. ఆయా మండలాలకు చెందిన సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు తప్పనిసరిగా తనిఖీలు చేస్తూ సూచనలు చేయాలని సూచించారు.

# 28 నుంచి భారీగా పెరగనున్న ధరలు

## - 3 రకాలుగా సాగు భూముల విలువ సవరణ

**హైదరాబాద్,(భారత శక్తి)**తెలంగాణవ్యాప్తంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, అపార్ట్‌మెంట్ల ప్రభుత్వ మార్కెట్ విలువను సుమారు 50 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ నెల 28 నుంచి కొత్త ధరలను అమలు చేయాలని భావిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఏటా రూ.1500 కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది. ముఖ్యంగా ఓఆర్ఆర్ లోపల, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఐటీ కారిడార్లు, కమర్షియల్ జోన్లలో ఈ పెంపు ఉండనుంది.తెలంగాణవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగానికి కీలకమైన భూముల రిజిస్ట్రేషన్ విలువల సవరణకు ప్రభుత్వం ముమ్మర సన్నాహాలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలు, జాతీయ రహదారులు, పట్టణాలకు సమీపంలో ఉన్న సాగు, సాగేతర స్థిరాస్తుల విలువలను సగటున 50 శాతం వరకు పెంచాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. బహిరంగ మార్కెట్ ధరలకు, సర్కారు నిర్ణయించిన విలువలకు మధ్య కొండంత వ్యత్యాసం ఉండటమే దీనికి ప్రధాన కారణం. ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను చేపడుతుండగా.. ప్రజలపై ఒకేసారి భారీ భారం పడకుండా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెల 28 నుంచే కొత్త రేట్లను అమల్లోకి తెచ్చే అవకాశం ఉంది. ఈ సవరణ ప్రకారం.. రాష్ట్రంలో ప్రస్తుతం ఎకరా వ్యవసాయ భూమి కనిష్ఠ ప్రభుత్వ విలువ రూ.1.75 లక్షలు ఉండగా.. దానిని రూ.2.75 లక్షలకు పెంచనున్నారు. ఇక ఓఆర్ఆర్ పరిధి లోపల డిమాండ్ ఎక్కువగా ఉన్నందున ఎకరా కనిష్ఠ విలువను రూ.8.75 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. వట్టినాగులపల్లి వంటి హాట్ స్పాట్లలో బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.100 కోట్లకు పైగా పలుకుతుండగా.. ప్రస్తుతం అక్కడ కేవలం రూ.2 నుంచి రూ.2.5 కోట్లుగా ఉన్న ప్రభుత్వ విలువను రూ.4 కోట్లకు సవరించనున్నారు. హైదరాబాద్ మహానగర పరిధిలోని దాదాపు 350 ప్రాంతాలలో స్థానిక మార్కెట్ డిమాండ్‌ను బట్టి విడివిడిగా ధరలను ఖరారు చేయనున్నారు. జూబ్లీహిల్స్ లాంటి ఏరియాల్లో గజం విలువ రూ.80 వేల నుంచి రూ.90 వేలకు పెరిగే అవకాశం ఉంది.అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల ఫ్లాట్ల చదరపు అడుగు ధరల్లో కూడా 75 శాతం వరకు మార్పులు రానున్నాయి. ప్రస్తుతం చదరపు అడుగు రూ.3500 నుండి రూ.4000 వరకు ఉన్న విలువల స్థానంలో రూ.6000 వరకు నిర్ధారించనున్నారు. అదేవిధంగా వాణిజ్య ప్రాంతాలలో బహిరంగ మార్కెట్ ధరలు రూ.8000 నుండి రూ.12000 వరకు ఉండటంతో ప్రభుత్వ ల్యాండ్ వాల్యూను రూ.6600గా ఫిక్స్ చేయాలని అధికారులు భావిస్తున్నారు. వంద అడుగుల రోడ్లు, ప్రధాన లింక్ రోడ్లు ఉన్న ఏరియాల్లో స్థానిక వృద్ధిని బట్టి రేట్లు పెరగనున్నాయి.ప్రస్తుతం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ఏడాదికి రూ.15 వేల కోట్ల ఆదాయం లభిస్తుండగా.. ఈ తాజా సవరణల ద్వారా ప్రభుత్వ ఖజానాకు అదనంగా మరో రూ.1500 కోట్ల రాబడి చేకూరనుంది. గతంలో 2021, 2022 సంవత్సరాల్లో చివరిసారిగా ఈ విలువల సవరణ జరిగింది. ఆ తర్వాత ఐటీ రంగ విస్తరణ, మౌలిక వసతుల మెరుగుదల వల్ల హైదరాబాద్ చుట్టుపక్కల విల్లాలు హైరైజ్ బిల్డింగుల నిర్మాణాలు పెరిగి భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

కాగా ఈ కొత్త ధరల అమలు ప్రక్రియను ప్రారంభించిన ఆరు నెలల తర్వాత మార్కెట్ సరళిని బట్టి అధికారులు మరోసారి సమీక్ష నిర్వహించనున్నారు. ఎకరం భూమి కనీసం పదిహేను లక్షలు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అవుటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు పరిధి ప్రామాణికంగా ధరలు పెంపు ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన ఉంటుందని ఆయన చెప్పారు.అరవింద్ సుబ్రహ్మణ్యం నివేదిక ఆధారంగా గత ప్రభుత్వం రెండుసార్లు భూముల ధరలు పెంచిందన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2022 నుంచి భూములు ధరలు పెంచలేదని గుర్తు చేశారు. భూముల ధరలు పెరుగుతాయని దానితో పాటు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ పరంగా ఆదాయం కూడా లభిస్తుందని చెప్పారు.

# వంట నూనెలపై భారం తప్పదా...



**న్యూఢిల్లీ,(భారత శక్తి)** ప్రజలకు ధరల పోటు తప్పేలా లేదు. వంట నూనెల ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం కేంద్రం తీసుకోబోయే నిర్ణయమే.స్థానిక రైతులకు మద్దతివ్వడం, రూపాయిపై ఒత్తిడిని తగ్గించడం కోసం వంట నూనెలపై దిగుమతి సుంకాలను పెంచే ప్రతిపాదనను భారత ప్రభుత్వం పరిశీలిస్తోంది. వంట నూనెలపై అధిక దిగుమతి పన్నులు.. రైతులు తమ పంటలకు మెరుగైన ధరలు పొందేందుకు సాయపడతాయా, అలాగే భారీ సరుకుల దిగుమతులతో ముడిపడి ఉన్న విదేశీ మారక ద్రవ్య ప్రవాహాలను అరికట్టగలవా అనే విషయాన్ని అధికారులు సీరియస్ గా పరిశీలిస్తున్నారు.ఈ ఏడాది ఆసియాలో రూపాయి అత్యంత బలహీనమైన కరెన్సీగా కొనసాగుతోంది. వంట నూనెలు, ఎరువులు, బంగారం, ముడి చమురు వంటి దిగుమతి చేసుకునే వస్తువులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్న తరుణంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో వంట నూనెతో సహా దిగుమతి చేసుకునే వస్తువులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ప్రధాని రేంద్ర మోదీ దేశ ప్రజలను కోరారు. అంతేకాదు అనవసరమైన దిగుమతులను అరికట్టేందుకు గత వారం బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 15 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే.భారతదేశం తన వంట నూనె అవసరాలలో దాదాపు 60% దిగుమతి చేసుకుంటుంది. తద్వారా ప్రపంచంలోనే వంట నూనెల అతిపెద్ద కొనుగోలుదారుగా ఉంది. దిగుమతి సుంకాలలో ఏ పెరుగుదల అయినా ప్రధానంగా ఇండోనేషియా, మలేషియా, అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, యుక్రెయిన్ నుండి దిగుమతి అయ్యే పామాయిల్, సోయాబీన్, సన్ ఫ్లవర్ నూనెల రవాణాను ప్రభావితం చేయొచ్చు.ప్రపంచవ్యాప్తంగా ఆహార ధరలు వేగంగా పెరుగుతున్న తరుణంలో ఈ ప్రతిపాదన కూడా వచ్చింది. ఇరాన్ సంఘర్షణ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగించి వంట నూనెలు, ధాన్యాలు, మాంసం ఉత్పత్తుల ధరలను పెంచింది.ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే వంట నూనె అయిన పామాయిల్.. సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి సుమారు 12% పెరిగింది. పెరుగుతున్న ఇంధన వ్యయాలను భర్తీ చేసుకునే ప్రయత్నంలో భాగంగా ఇండోనేషియా, మలేషియాలో బయో ఫ్యూయల్ ఉత్పత్తి పెరగడం కూడా ఈ పెరుగుదలకు పాక్షికంగా కారణమైంది. అయితే, దిగుమతి సుంకాలను పెంచడానికి భారత్ తీసుకోబోయే చర్య కొనుగోళ్లను నెమ్మదింపజేసి, ఇటీవలి ధరల పెరుగుదలను అదుపు చేయగలదు.కాగా, దిగుమతి సుంకాల పెంపుపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. దేశీయ ధరలను తగ్గించి, ప్రాసెసర్లకు ఉపశమనం కల్పించే ప్రయత్నంలో భాగంగా గత సంవత్సరం ముడి పామ్, సోయాబీన్, సన్ ఫ్లవర్ నూనెలపై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని 20% నుండి 10%కి తగ్గించింది కేంద్రం. సుంకం తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని పరిశ్రమను కోరింది ప్రభుత్వం.ఇదిలా ఉండగా, పెరుగుతున్న ముడి చమురు ధరల ఒత్తిడి కారణంగా భారత రూపాయి మరింత బలహీనపడి, సోమవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.35 వద్ద రికార్డ్ కనిష్ట స్థాయికి పడిపోయింది.

# యూ టర్న్‌ల విజయ్...

**చెన్నై,(భారత శక్తి)** రాజకీయ నాయకులు నాలుక మడత పెట్టడం కొత్తేమీ కాదు. మడమ తిప్పడం కూడా వింత కాదు. పైగా దేశవ్యాప్తంగా క్రెడిట్ చోరీ రాజకీయాలు దర్జాగా సాగుతున్నాయి. గొప్పగా ఉంటే నాది అని.. చెత్తగా ఉంటే అవతలివాడిదని చెప్పుకోవడం ఇప్పటి కాలంలో అలవాటుగా మారింది. ఇలాంటి వ్యవహారాలకు తలలు పండిన రాజకీయ నాయకులు పాల్పడుతుంటారు. ఇది తప్పా? ఒప్పా? అనే విషయాలను పక్కన పెడితే.. ఇటువంటి వ్యవహారాలు రాజకీయ నాయకులకు అలవాటుగా మారిపోతున్నాయి.తలలు పండిన రాజకీయాలు మాత్రమే కాదు.. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారు కూడా ఇలాంటి వ్యవహారాలకు పాల్పడటం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తమిళనాడులో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం చేసి పది రోజులు కూడా కావడం లేదు. పైగా ఆయన అధికారాన్ని దక్కించుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేశారు. పుష్ప సినిమా మాదిరిగా సోఫాలు కూడా పంపించారు.. ఎన్డీఏ కూటమిలో ఉన్న ఏఐడీఎంకే మద్దతు తీసుకోబోనని చెప్పిన ఆయన.. కొద్ది రోజులకే మాట మార్చారు. అసెంబ్లీలో బలపరీక్ష నెగ్గడానికి ఆయన అన్నాడీఎంకే సపోర్ట్ తీసుకోవాలి.. అంతేకాదు ఇంకా అనేక రకాలుగా ఆయన నాలుక మడత పెడుతూనే ఉన్నారు. కేవలం ఈ పది రోజుల్లోనే ఆయన ఈ పని చేయడం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.తన వ్యక్తిగత జ్యోతిష్యుడిని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉన్నతమైన అధికారిగా విజయ్ నియమించుకున్నారు. దీనిపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. హేతువాద సంఘాలు తోడయ్యాయి. దీంతో విజయ్ వెనక్కి తగ్గక తప్పలేదు. పైగా జ్యోతిష్యుడి నియామకం పట్ల వెంటనే స్పందించారు విజయ్. 24 గంటల్లో అతడు నియామకాన్ని రద్దు చేశారు.సనాతన ధర్మాన్ని డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి తీవ్రంగా విమర్శించారు. ఆ సమయంలో విజయ్ సైలెంట్ గా ఉన్నారు. ఇప్పుడు విజయ మంత్రివర్గంలో కీలక మంత్రి అధర్వ.. బహిరంగంగానే ఉదయనిది వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఇది ఆ పార్టీలో ఉన్న అంతర్గత వ్యవహారాలను బయటపెట్టింది.ఎన్డీఏ కూటమికి అనుకూలంగా ఉండే ఏ పార్టీ మద్దతు తీసుకోబోమని విజయ్ ప్రకటించారు. ఫ్లోర్ టెస్ట్ సమయంలో సిద్ధాంతాన్ని పక్కన పెట్టి ఏఐడీఎంకే కు చెందిన 25 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేల సపోర్ట్ తీసుకున్నారు.ఎన్నికల ప్రచారం సమయంలో ప్రతి మహిళకు 2500 ఆర్థిక సహాయం చేస్తామని విజయ ప్రకటించారు. అయితే ఆ పథకాన్ని ఇంతవరకు ప్రారంభించలేదు. పైగా ఇప్పుడు అమల్లో ఉన్న వెయ్యి రూపాయల పథకాన్ని కూడా నిలిపివేస్తామని.. దానిని పునర్ వ్యవస్థీకరిస్తామంటూ చెబుతున్నారు.స్థూలంగా చూస్తే తమిళనాడు సీఎం పరిపాలనకు.. అరవింద్ కేజ్రీవాల్ వ్యవహరించిన తీరుకు పెద్దగా తేడా కనిపించడం లేదు. సోషల్ మీడియాలో విజయ్ గురించి కొంతమంది గొప్పగా చెప్పవచ్చు. పి ఆర్ టీం రకరకాల వీడియోలను విడుదల చేయవచ్చు. కానీ అంతిమంగా ఫీల్డ్ రియాలిటీ మాత్రమే నిలబడుతుంది. ఎందుకంటే రీల్ కంటే రియల్ చాలా విలువైనది.

# కేంద్ర కేబినెట్ విస్తరణ...?

**న్యూఢిల్లీ,(భారత శక్తి)** దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిపోయాయి. ఆయా రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కూడా ఏర్పడ్డాయి. ఇప్పుడు కేంద్రం వంతు వచ్చింది. మిషన్ 2029కి ఇప్పటి నుంచే మోడీ సన్నాహాలు మొదలు పెట్టినట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వంలోనూ.. పార్టీలోనూ కీలక మార్పులు చేయాలని భావిస్తున్నట్లుగా సమాచారం. 2029లో తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా భారీ మార్పులు జరగవచ్చని సంకేతాలు వెలువడుతున్నాయి.ఈనెల 26తో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కాబోతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర కేబినెట్‌ను విస్తరించాలని భావిస్తున్నారు. మోడీ తన మొదటి, రెండవ పర్యాయాల్లో మంత్రివర్గాన్ని క్రమం తప్పకుండా విస్తరించారు. ప్రస్తుత మంత్రివర్గంలో 72 మంది సభ్యులు ఉండగా.. గరిష్టంగా 81 మంది మంత్రులను నియమించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ చేయాలని భావిస్తున్నారు.ఇక ఇటీవల బీహార్, ఉత్తరప్రదేశ్‌లోని ఎన్డీఏ ప్రభుత్వాలు కూడా తమ మంత్రివర్గాలను విస్తరించాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ తన బృందాన్ని కూడా ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రివర్గంలో మార్పులు జరుగుతాయనే ఊహాగానాలకు ఆజ్యం పోసింది.గత రెండు పర్యాయాలను పరిశీలిస్తే.. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల తర్వాత నవంబర్ 2014లో మోడీ తన మంత్రివర్గాన్ని తొలిసారిగా విస్తరించారు. సుమారు ఏడాదిన్నర తర్వాత జూలై 2016లో రెండవ విస్తరణ జరిగింది. సెప్టెంబర్ 2017లో జరిగిన మొదటి పర్యాయపు చివరి విస్తరణలో పలువురు మంత్రులకు పదోన్నతి లభించింది. ఇక రెండవ పర్యాయంలో ప్రభుత్వం ఏర్పడిన దాదాపు రెండేళ్ల తర్వాత జూలై 2021లో మంత్రివర్గాన్ని తొలిసారిగా విస్తరించారు. మే 2023లో పోర్ట్‌ఫోలియోల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఇక మోడీ జూన్ 9, 2024న మూడవసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పుడు రెండేళ్లు పూర్తికాబోతున్నాయి. ఫలితంగా మళ్లీ మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు తీవ్రమయ్యాయి. ప్రస్తుతం మంత్రివర్గంలో 72 మంది సభ్యులు ఉండగా.. గరిష్టంగా 81 మంది మంత్రులను నియమించవచ్చు. కొంతమంది కొత్తవారికి అవకాశం ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. వారి పనితీరు ఆధారంగా కొంతమంది ప్రస్తుత మంత్రులను తొలగించాలనే చర్చ కూడా జరుగుతోంది. వచ్చే ఏడాది ఏడు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికల దృష్ట్యా ప్రాంతీయ, కుల సమతుల్యత సాధించబడుతుందని భావిస్తున్నారు. ఒకవేళ విస్తరణ జరిగితే బీహార్ నుంచి ప్రాధాన్యత దక్కవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.ఇక బీజేపీ వర్గాల సమాచారం మేరకు.. పలువురు కొత్త ముఖాలను జాతీయ ప్రధాన కార్యదర్శులుగా నియమించే అవకాశం కూడా ఉంది.

# బండి భగీరద్ కేసులో క్రెడిట్ వార్

**హైదరాబాద్, (భారత శక్తి)**బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను తుపానును సృష్టిస్తోంది. ఈ కేసు కేవలం చట్టపరమైన పరిధిని దాటిపోయి రాజకీయంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్ ను ఒకే గాటన కట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మరో వైపు అధికార కాంగ్రెస్ , బీజేపీ మధ్య ఒక హై-వోల్టేజ్ మైండ్ గేమ్ కు వేదికైంది. తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు బండి భగీరథ్ కేసు చుట్టూ తిరుగుతున్నాయి. బీజేపీ దశ మారుస్తారని భావిస్తున్న కీలక నేత కుమారుడు కావడం.. భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం, ఆయన లొంగిపోవడం వంటి పరిణామాలు రాష్ట్రంలో రాజకీయ వేడిని పెంచాయి. ఈ కేసును కాంగ్రెస్ సర్కార్ ఒక బలమైన రాజకీయ ఆయుధంగా మలచుకుంటుండగా, బీజేపీ దీనిని హనీ ట్రాప్‌గా అభివర్ణిస్తూ ఎదురుదాడికి దిగుతోంది. అదే సమయంలో బీఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేస్తున్నాయని ఆరోపిస్తోంది. బండి సంజయ్ బర్తరఫ్‌కు కేటీఆర్ డిమాండ్ చేస్తున్నారు. ఆయన మంత్రిగా ఉంటే.. కేసును ప్రభావితం చేస్తారని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. కేసు నమోదైన నాటి నుంచే దర్యాప్తులో ఎందుకు జాప్యం జరుగుతోందని డీజీపీని ప్రశ్నించడం ద్వారా, తన ప్రభుత్వం చట్టం అమలులో ఎవరికీ మినహాయింపు ఇవ్వదని గట్టి సందేశం పంపారు. కేంద్ర మంత్రి కుమారుడైనా సరే వదిలేది లేదని చెప్పడం ద్వారా, ప్రజల్లో తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా మహిళల భద్రత, పోక్సో కేసుల తీవ్రతను ప్రస్తావిస్తూ బీజేపీని ఆత్మరక్షణలో పడేసేలా కాంగ్రెస్ తన సోషల్ మీడియా విభాగాన్ని రంగంలోకి దింపింది.మరోవైపు బీజేపీ ఈ కేసును నేరుగా బండి సంజయ్ రాజకీయ ప్రతిష్ఠపై జరిగిన దాడిగా చిత్రీకరిస్తోంది. ప్రధాని మోదీ సభ , హిందూ ఏక్తా యాత్రల సమయంలోనే ఈ కేసును వెలుగులోకి తేవడం వెనుక లోతైన కుట్ర ఉందని బండి సంజయ్ ఆరోపిస్తున్నారు. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేకే నా కుమారుడిని టార్గెట్ చేశారు అనేది బీజేపీ ప్రధాన వాదన. అంతేకాకుండా, బాధితురాలు మైనర్ కాదని, ఆమెకు రెండు వేర్వేరు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలు ఉన్నాయనే వార్తలను బీజేపీ సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ వచ్చింది. అయితే బీజేపీకి ఏదీ కలిసి రాలేదు. బాధితురాలు మైనర్‌గా తేలడంతో జైలుకు వెళ్లక తప్పలేదు. ఈ గొడవ వల్ల క్షేత్రస్థాయిలో బీజేపీ కార్యకర్తలు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఇది కేవలం భగీరథ్ వ్యక్తిగత విషయం కాదని, పార్టీ గౌరవానికి సంబంధించిన అంశంగా వారు భావిస్తున్నారు. కాంగ్రెస్ మాత్రం తన న్యాయ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దీనిని ఒక ఉదాహరణగా చూపిస్తోంది. ఈ రెండు పార్టీలను ప్రజల్లో దోషులుగా నిరూపించాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ కేసు దర్యాప్తు వేగం పుంజుకునే కొద్దీ తెలంగాణ రాజకీయం మరిన్ని మలుపులు తిరగడం ఖాయం.

### కొత్త కేసులతో ఇబ్బందులు

బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దర్యాప్తు ముమ్మరం చేసిన కొద్దీ ఈ కేసులో రోజుకో కొత్త ట్విస్ట్ వెలుగులోకి వస్తోంది. తాజాగా ఈ కేసులో పోలీసులు నిందితుడు బండి భగీరథ్‌పై మరింత కఠినమైన బీఎన్ఎస్ సెక్షన్‌ను జోడించారు. ఒకే బాధితురాలిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు అభియోగాలు ఉండటంతో పోలీసులు ఈ కొత్త సెక్షన్‌ను నమోదు చేసినట్లు తెలుస్తోంది.ఈ కేసుకు సంబంధించి బండి భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత (ఃఔా) లోని 64(2)(ఎ) సెక్షన్‌ను అదనంగా చేర్చారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన ఈ సెక్షన్‌ను జోడించడంతో నిందితుడికి చట్టపరంగా ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. ఈ కొత్త కేసు ప్రకారం తప్పు చేసినట్లు రుజువైతే భగీరథ్‌కు 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుందని తెలుస్తోంది. బాధితురాలి నుంచి సేకరించిన మరికొన్ని వివరాలు, సాంకేతిక ఆధారాల ప్రకారమే పోలీసులు ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.మరోవైపు, ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్న బండి సాయి భగీరథ్‌ను కలిసేందుకు ఆయన కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. జైలు నిబంధనల ప్రకారం నేడు వారు చర్లపల్లి జైలుకు వెళ్లి ములాఖత్ ద్వారా భగీరథ్‌ను కలవనున్నారు.

కఠినమైన సెక్షన్లు తోడవడంతో తదుపరి లీగల్ ప్రాసెస్, బెయిల్ పిటిషన్లపై ఈ ములాఖత్‌లో కుటుంబ సభ్యులు, న్యాయవాదులు చర్చించే అవకాశం ఉందిబండి భగీరథ్ పోక్సో కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా నిందితుడికి మద్దతుగా విపరీతంగా ప్రచారం నిర్వహిస్తూ, అతడు నిర్దోషి అని చిత్రీకరించే ప్రయత్నం చేసిన పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కేసులు నమోదయ్యాయి.

ఈ వ్యవహారంలో మొత్తం 27 మంది ఇన్‌ఫ్లూయెన్సర్లపై ఫిర్యాదులు రాగా, ప్రాథమిక విచారణ అనంతరం అందులో 14 మందిపోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మిగిలిన వారిపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే తదుపరి చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు.

# రియల్ ఎస్టేట్‌లో పుష్పరాజ్..

**హైదరాబాద్, (భారత శక్తి)**ఆయన ఒకప్పుడు కలెక్టర్ గా పని చేశారు. తన తెలివితేటలతో భారీగా భూములు సంపాదించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతంలో విపరీతంగా భూములు కొన్నారు. ఆ భూములు ఇప్పుడు వేలకోట్ల ఆస్తులు అయ్యాయి. కలెక్టర్ గా ఉన్నప్పుడు ఇప్పటి ముఖ్యమంత్రికి ఆయన పాదాభివందనం కూడా చేశారు. కలెక్టర్ ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఓ రాజకీయ పార్టీలో చేరారు. ఇప్పుడు ఏకంగా ఎమ్మెల్సీగా పనిచేస్తున్నారు.ఇప్పుడు ఆయన చేతిలో ఎన్నో కీలకమైన ప్రాజెక్టులు ఉన్నాయి. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ దగ్గర ఉన్న ఓ కాస్ట్లీ ప్రాంతంలో ఎకరం భూమిని ఆయన ఏకంగా 100 కోట్లు పెట్టి కొన్నారు. ఇటువంటి కోట్లు ఆయనకు లెక్క కావు. లెక్కలోకి కూడా రావు. ఇప్పుడు ఏకంగా ఆయన దాదాపు పదికి మించిన ప్రాజెక్టులను చేతుల్లో పెట్టుకున్నారు. తెల్లాపూర్ ప్రాంతంలో 13 ఎకరాల విస్తీర్ణంలో అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో 1500 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. ఇదే తెల్లాపూర్లో మరో చోట 24 ఎకరాల్లో బహుళ అంతస్తులు నిర్మించారు. ఇందులో ఏకంగా మూడు వేల ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. తెల్లాపూర్ ప్రాంతంలో 21 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో కూడా 3500 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. తెల్లాపూర్ ప్రాంతంలో ఏడు ఎకరాల విస్తీర్ణంలో అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో 500 ప్లాట్లు అందుబాటులో వచ్చాయి.హైదరాబాద్ నగరంలో అత్యంత ఖరీదైన నియో పోలీస్ ఏరియాలో ఏడు ఎకరాలలో బహుళ అంతస్తులు నిర్మించారు. ఇదే ఏరియాలో 8 ఎకరాల విస్తీర్ణంలో 600 ప్లాట్లు నిర్మించారు. నార్సింగి, మంచిరేవుల, కోకాపేట, అత్తాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలలో దాదాపు ఐదువేల ప్లాట్ల విస్తీర్ణంతో బహుళ అంతస్తులను నిర్మించారు. ఒక రకంగా తెలంగాణ రియల్ ఎస్టేట్లో ఒకప్పుడు ఆపర్ణ, మై హోమ్, జనప్రియ వంటి కంపెనీలు నెంబర్ వన్ స్థానంలో ఉండేవి. కానీ ఆ కంపెనీలను ఈ మాజీ కలెక్టర్ కంపెనీ దాటేసింది. హైదరాబాదులోనే దాదాపు పదివేల ప్లాట్ లకు మించిన సామర్థ్యంతో బహుళ అంతస్తులు నిర్మిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఇప్పటికే భారీగా భూములను కొనేసింది. ఈ ప్రకారం చూసుకుంటే ఆ మాజీ కలెక్టర్ రియల్ ఎస్టేట్ బిజినెస్ లో పుష్ప రాజ్ లాగా అవతరించే అవకాశం ఉందని బిజినెస్ ఎక్స్పర్ట్స్ చెప్తున్నారు

.ఆయన ఒక పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచినప్పటికీ.. ఇప్పుడు అధికార పార్టీతో దగ్గరగా ఉంటున్నట్లు తెలుస్తోంది. పైగా అధికార పార్టీలో ఒక కీలక నాయకుడితో ఇటీవల బంధుత్వం కూడా పెంచుకున్నారని సమాచారం. అందువల్లే ఈ స్థాయిలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో దూకుడు కొనసాగిస్తున్నారని.. వేల కోట్లను సులభంగా సంపాదిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఏది ఏమైనప్పటికీ ఏ ఎండకు ఆ గొడుగు పట్టడంలో ఈ మాజీ కలెక్టర్ సిద్ధహస్తుడని మార్కెట్ వర్గాలు చెవులు కోరుకుంటున్నాయి. చూడాలి మరి ఈ మాజీ కలెక్టర్ ఇంకా ఏ స్థాయిలో దూసుకుపోతారో.. ఇంకా ఏ రేంజ్ లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ను తన చేతుల్లో పెట్టుకుంటారో..

# మంత్రివర్గ ప్రక్షాళనకు రెడీ

**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు కావస్తుంది. ఇప్పటికీ మంత్రివర్గంలో పూర్తిగా భర్తీ చేయలేదు. ఇంకా మంత్రివర్గంలో రెండు స్థానాలు ఖాళీలున్నాయి. ఎప్పటికప్పుడు మంత్రివర్గంలో ఖాళీలను భర్తీ చేస్తామని ఊరిస్తూనే ఉన్నారు. కానీ ఇంతవరకూ భర్తీ చేయకపోవడంతో ఆశావహుల్లో నిరాశ కలుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా పార్టీ పెద్దలతో మంత్రివర్గ విస్తరణపై చర్చించడానికి అంటూ ప్రచారం జరుగుతుండటం, రేవంత్ రిక్త హస్తాలతో తిరిగి రావడం సాధారణంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. అవి పూర్తయిన తర్వాతనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని పార్టీలో ప్రచారం జరుగుతుంది.తెలంగాణలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ తో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలు ముగిసిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఉన్న మంత్రివర్గంలో పూర్తి స్థాయి ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రెండున్నరేళ్లు కొందరికి మంత్రిగా అవకాశం కల్పించాం కాబట్టి, వారిని తప్పించి, వారి స్థానంలో కొత్త వారిని నియమించుకోవాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. ఇది పూర్తి స్థాయి ఎన్నికల టీంగా రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నట్లు చెబతున్నారు. అయితే అందుకు హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ అందాల్సి ఉంటుంది.ప్రస్తుత మంత్రివర్గంలో సామాజికవర్గం పరంగా కొందరిని తప్పించాల్సిన పరిస్థితులున్నాయి. అలాగే పనితీరు ఆధారంగా మరికొందరిని బయటకు పంపాల్సిన అవసరం ఉంది. అలాగే 2028 ఎన్నికల్లో పార్టీకిమంచి ఊపు తెచ్చే వారిని ఎంపిక చేసుకుని ముందుకు వెళ్లాలన్న భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు.

ప్రధానమైన వారిని కొందరిని అలాగే ఉంచి జిల్లాల వారీగా కొందరిని మార్చి, కొత్త వారికి అవకాశాలను కల్పిస్తే అందరికీ అవకాశం దొరికినట్లవుతుందని, అప్పుడు అసంతృప్తి, అసహనాలు ఉండవన్న అంచనాలో రేవంత్ రెడ్డి ఉన్నారు. ఈ మేరకే ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా హైకమాండ్ ఎదుట ఈ ప్రతిపాదన పెట్టినా అందుకు హైకమాండ్ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అందుకు సరైన సమయం కోసం వేచి చూస్తున్నారని తెలిసింది.

# పాపులేషన్ పాలసీపై విమర్శలు

## గళాన్ని వినిపిస్తున్న మహిళా సంఘాలు

**విజయవాడ (భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన సరికొత్త జనాభా విధానం ఇప్పుడు దేశవ్యాప్తంగా సామాజిక, రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారింది. భవిష్యత్తులో యువ శ్రామిక శక్తి కొరత ఏర్పడకూడదనే ఉద్దేశంతో ఎక్కువ మంది పిల్లలను కనే దంపతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు 3వ బిడ్డకు రూ.30 వేలు, 4వ బిడ్డకు రూ.40 వేలు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. అయితే, ఈ ప్రతిపాదనపై మహిళా సంఘాలు మరియు ఫెమినిస్టులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మహిళల శరీరం, ఆరోగ్యం వారి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశాలని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మహిళలను పిల్లలను కనే యంత్రాలు గా పరిగణించడం ఏమాత్రం సమంజసం కాదని వారు మండిపడుతున్నారు. ప్రముఖ పీడియాట్రీషియన్ డాక్టర్ శివరంజని సంతోష్ ఈ పాలసీపై సోషల్ మీడియా వేదికగా సంధించిన ప్రశ్నలు వైరల్ అవుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే రూ.30,000 లేదా రూ.40,000 సాయం కొద్ది రోజుల్లోనే ఖర్చయిపోతుందని, ఆ తర్వాత ఆ బిడ్డల పోషణ, చదువు, ఆరోగ్య బాధ్యతలను పేద కుటుంబాలు ఎలా మోస్తాయని ఆమె ప్రశ్నించారు. కేవలం తాత్కాలిక నగదు ఆశ చూపి పేదలను ఎక్కువ మంది పిల్లలకు జన్మనిచ్చేలా ప్రోత్సహించడం వారిని మరిన్ని ఆర్థిక కష్టాల్లోకి నెట్టడమేనని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మౌలిక వసతులు లేని చోట జనాభా పెంపు శిశు, మాతృ మరణాల రేటును పెంచే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మాజీ హెల్త్ సెక్రటరీ పీవీ రమేష్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం జనాభా సంఖ్యను పెంచడం కంటే, ప్రస్తుతం ఉన్న జనాభాకు నాణ్యమైన విద్య, ఉచిత వైద్యం, పౌష్టికాహారం అందించడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు ఇంకా పూర్తిస్థాయిలో బలోపేతం కాకముందే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల తల్లుల ఆరోగ్య భద్రత ప్రమాదంలో పడుతుందని ఆయన విశ్లేషించారు. నాణ్యమైన మానవ వనరుల అభివృద్ధికి సంఖ్య కంటే సౌకర్యాలు ముఖ్యమని ఆయన కోణంలో స్పష్టం చేశారు. ఈ అంశంపై పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ, సినీ నటి పూనమ్ కౌర్ వంటి వారు కూడా తమ గళాన్ని వినిపించారు. సామాజిక మాధ్యమాల్లో చంద్రబాబు వ్యాఖ్యలను కొందరు దూరదృష్టి గా అభివర్ణిస్తుంటే, మరికొందరు దీనిని మహిళా వ్యతిరేక ధోరణి గా ట్రోల్ చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలు ఈ పాలసీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సీఎం ఈ ప్రతిపాదన చేసినప్పటికీ, అది మహిళల ప్రాథమిక హక్కులను ప్రభావితం చేసేలా ఉండకూడదని వారు వాదిస్తున్నారు. సీపీఎం నాయకురాలు బృందా కారత్ కూడా చంద్రబాబు పాపులేషన్ పాలసీని ఖండించారు చంద్రబాబు ఎన్డీయేలో చేరిన తర్వాత సొంత తెలివితేటలను, ఆలోచనా విధానాన్ని తాకట్టు పెట్టేంత దూరంగా వెళ్ళిపోయారా అని ప్రశ్నించారు. రూ. 30,000 ఆశ చూపి, ఒక మహిళకు తన సొంత గర్భంపై ఉన్న ప్రాథమిక హక్కును మీరు లాక్కోవాలని చూస్తున్నారు... ఇప్పుడు ఏం జరుగుతుందంటే, ఈ రూ. 30,000 - రూ. 40,000 ఆశకు లోబడి, ఆ మహిళ కుటుంబ సభ్యులు ఆమెపై విపరీతమైన ఒత్తిడి తెస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు, చంద్రబాబు మద్దతుదారులు మాత్రం ఈ పాలసీని సమర్థిస్తున్నారు. ప్రభుత్వం ఎవరినీ బలవంతం చేయడం లేదని, కేవలం స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారికి ప్రోత్సాహం అందిస్తోందని వారు చెప్తున్నారు. రాబోయే దశాబ్దాల్లో ఏపీలో వృద్ధాప్య సంక్షోభం తలెత్తకుండా ఉండాలంటే ఇప్పుడే మేల్కోనాలని, జనాభా సంతులనం కోసమే ఈ పాలసీని వర్కవుట్ చేస్తున్నారని వారు స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనా, ముఖ్యమంత్రి లేవనెత్తిన ఈ అంశం ఇప్పుడు జాతీయ మీడియాలో సైతం హాట్ టాపిక్‌గా మారి, భిన్నమైన వాదనలకు దారితీస్తోంది.

మన దేశంలో జనాభా ఇప్పటికే సుమారు 140 కోట్ల పైగా ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు పెంపు అవసరమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జనాభా కారణంగా ఇప్పటికే మన దేశంలో వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. ప్రజలకు పాలకులు మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నారు. మంచి విద్య అందడం లేదు. ఆసుపత్రుల కొరత ఉంది. ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు లభించడం లేదు. సంపద కూడా కొందరి వద్దనే ఉంటుంది. ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి.చదరపు కిలోమీటరుకు కనిపించే జనసాంద్రత భారతదేశంలో ఎక్కువగా ఉంటుంది, ఇది మౌలిక సదుపాయాలపై భారం పెంచుతుంది. రవాణా, ఆరోగ్య, విద్య, నీటి సరఫరా వంటి సేవల అందుబాటును ప్రస్తుత జనాభా కూడా కష్టపడి తీర్చుకుంటోంది. అంతకంటే ఎక్కువ జనాభా పెరగడం పరిస్థితిని మరింత యంత్రంగా మార్చే అవకాశం ఉంది. అమెరికాలో చదరపు కిలోమీటర్ కు 33 మంది, చైనాలో చదరపు కిలోమీటర్ కు 150 మంది ఉన్నారు. మనదేశంలో కూడా ఫెర్టిలిటీ రేటు తగ్గుతుంది. కానీ జనాభా పెంపు ఇప్పట్లో అవసరం లేదు.ఆంధ్రప్రదేశ్‌లో జనాభా 5 కోట్లకు పైగా ఉంది. ఇది దక్షిణ కొరియాతో సమానం. దక్షిణ కొరియా ప్రపంచంలో చాలా మెరుగైన అభివృద్ధి చెందిన దేశం. ఆంధ్రప్రదేశ్లో చాలావరకు మౌలిక సదుపాయాల లేవు. తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ దక్షిణాది రాష్ట్రాల్లో చివరి స్థానంలో ఉంది. జీడిపి పెంపు ప్రజలకు మెరుగైన జీవనం కల్పించడంపై దృష్టి పెట్టాల్సిన తరుణంలో జనాభా పెంపుకు పిలుపునివ్వడం విమర్శలకు తావిస్తోంది.చంద్రబాబు జనాభా పెంపు గురించి ప్రజలను ప్రోత్సహించడం కన్నా ముందు సదుపాయాలపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. అజీర్ణంతో బాధపడుతున్న వ్యక్తి ఆకలితో ఉన్నవాడిని ఒకప్పుడు తినమని సూచించినట్లుగా ఉందన్న విమర్శలు వస్తున్నాయి. అధిక జనాభా సూచన రాజకీయంగా రాకుండా వాస్తవ సమస్యల్ని మరింత పెంచే ప్రమాదం ఉంది.

# లోకల్ పోరుకు వ్యూహాలు

**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం దగ్గరపడుతుంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దీంతో అన్ని రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టు నిలుపుకునేందుకు తమ పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సెప్టెంబరులో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. డిసెంబరు నాటికి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, కొత్త ఏడాది నాటికి నూతన పాలకవర్గాలు కొలువుదీరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.ఇప్పటికే తెలుగుదేశం పార్టీ జిల్లాల వారీగా సమన్వయ కర్తలు నియమించింది. జిల్లాలకు వెళ్లి నియోజకవర్గ ఎమ్మెల్యేలతో సమావేశమై పార్టీ అభ్యర్థులకు సంబంధించిన మార్గదర్శకాలను వివరించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. కొన్ని జిల్లాలకు కొందరు ముఖ్యనేతలకు బాధ్యతలను అప్పగించారు. ఇక కూటమిలోని మరొక మిత్రపక్షమైన జనసేన పార్టీ కూడా జిల్లాల వారీగా పరిశీలికులను నియమించింది. వారు జిల్లాలకు వెళ్లి పార్టీ నేతలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలపై నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. నివేదికను పవన్ కల్యాణ్ కు అందించనున్నారు. బీజేపీ మాత్రం ఇంకా దీనిపై ఇంకా కసరత్తులు మొదలు పెట్టలేదు.మరొకవైపు ప్రతిపక్ష వైసీపీ కూడా ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతుంది. లండన్ పర్యటన నుంచి వచ్చిన తర్వాత వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నేతలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. రిజర్వేషన్లు, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి మాత్రమే టిక్కెట్లు ఇవ్వాలని, అలాగే సామాజిక సమీకరణాలను కూడా ఖచ్చితంగా పాటించాలని వైఎస్ జగన్ నేతలను ఆదేశించినట్లు తెలిసింది. తొలుత మున్సిపల్ ఎన్నికలు జరుగుతుండటంతో బూత్ లెవెల్ కమిటీలను పూర్తి చేసి వారిని యాక్టివ్ చేయాలని, ఇప్పటి నుంచే స్థానిక సమస్యలపై పార్టీ శ్రేణులు ఉద్యమించాలని వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో లోకల్ హాట్ మొదలయిందనే చెప్పాలిఎమ్మెల్యేలకు స్థానిక సంస్థల ఎన్నికలు ఎమ్మెల్యేలకు సవాల్ గా మారనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతుంది. అయితే ఈ రెండేళ్లలో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య నియోజకవర్గాల్లో సఖ్యత లేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ఇబ్బందులు తలెత్తే అవకాశముందని భావించి మూడు పార్టీల అగ్రనాయకత్వం అప్రమత్తమయింది. పై స్థాయిలో మూడు పార్టీల్లోని అగ్ర నాయకత్వం సఖ్యతగా ఉన్నప్పటికీ నియోజకవర్గ స్థాయి నేతల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పదవులు, కాంట్రాక్టులు, ఇసుక, మద్యం వంటి విషయాల్లో తేడాలు రావడంతో కూటమి నియోజకవర్గాల్లో కలసి లేదన్నది వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ఎమ్మెల్యేల పనితీరుకు కొలమానం కావడంతో వారిలోనూ ఆందోళన నెలకొంది.ఏ పార్టీ ఎమ్మెల్యే అక్కడ ప్రాతినిధ్యం వహిస్తుంటే మిగిలిన పార్టీల నేతలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఇప్పటికే అనేక చోట్ల నుంచి ఫిర్యాదులు అధినాయకత్వానికి అందుతున్నాయి. ఇందుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఏదీ మినహాయింపు కాదు. తమ గెలుపునకు దోహదపడిన తమ పార్టీకి సంబంధించిన నాయకులకే పదవులు, కాంట్రాక్టులు ఇస్తుండటంతో మిగిలిన పార్టీల నేతలు, క్యాడర్ లో అసంతృప్తి నెలకొంది. అంతెందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనే జనసేన, టీడీపీ కార్యకర్తల మధ్య సఖ్యత లేదు. అందుకే అక్కడ టీడీపీ ఇన్ ఛార్జి బాధ్యతల నుంచి వర్మను పార్టీ నాయకత్వం తప్పించాల్సి వచ్చింది.ఇలా ఉత్తరాంధ్ర నుంచి తీసుకుంటే కోస్తాంధ్ర, రాయలసీమలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నేతల మధ్య ఎంత సమన్వయం కుదిర్చినప్పటికీ ఫలితం ఎలా ఉంటుందోనన్న ఆందోళన మూడు పార్టీల నేతల్లోనూ వ్యక్తమవుతుంది. అందుకే అన్ని పార్టీలు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకుని నేతల మధ్య గ్యాప్ లేకుండా చూసుకోవాలని నిర్ణయించాయి. విభేదాల ఫలితం ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై పడకూడదని, ఎమ్మెల్యేలతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ ఇన్ ఛార్జులతో సమావేశం ఏర్పాటు చేసుకుని నేతల మధ్య, క్యాడర్ లో నెలకొన్న విభేదాలు తొలగించే ప్రయత్నాలు చేయాలని నిర్ణయించింది. మొత్తం మీద జనసేన, టీడీపీ, బీజేపీ నాయకత్వంలో నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలు కొంత అలజడికి కారణమయ్యాయి.

# కడపలో రెండు నియోజకవర్గాలపై దృష్టి

**కడప, (భారత శక్తి)** ఏపీ రాజకీయాల్లో వైయస్ షర్మిల దూకుడు పెంచాలని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఎంపిక చేసిన కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని భావిస్తున్నారు. ప్రధానంగా గట్టి అభ్యర్థులను బరిలో దించడం ద్వారా ఓట్లతోపాటు సీట్లు పెంచుకోవాలని చూస్తున్నారు. మరోవైపు తాను సైతం ఈసారి అసెంబ్లీకి పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో కడప ఎంపీగా పోటీ చేశారు షర్మిల. త్రిముఖ పోటీలో భాగంగా.. ఆమె ఏకంగా లక్ష యాభై వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. ఒకానొక దశలో కడప ఎంపీగా అవినాష్ రెడ్డి ఓడిపోతారని కూడా అంచనాలు వచ్చాయి. అయితే రాజకీయ ప్రత్యర్థిగా భావించే జగన్మోహన్ రెడ్డి పార్టీని గట్టిగానే దెబ్బతీయగలిగారు షర్మిల. కడప జిల్లాలో కూటమికి ఏడు అసెంబ్లీ స్థానాలు లభించాయి అంటే.. షర్మిల ప్రభావం అధికంగా ఉంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై. వైసిపి ఓడిపోయేందుకు షర్మిల దోహదపడ్డారు.అయితే ఈసారి పార్లమెంట్ స్థానానికి కాకుండా అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నారు షర్మిల. దానికి కారణం లేకపోలేదు. అసెంబ్లీలో తన వాయిస్ వినిపించడం ద్వారా తన పొలిటికల్ కెరీర్ కు ఒక నిర్మాణం జరుపుకోవాలని చూస్తున్నారు. ఒకవేళ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్షానికి పరిమితం అయినా.. ఆయన అసెంబ్లీకి రారు. అధికారంలోకి వస్తే అదే జగన్మోహన్ రెడ్డి పై గట్టిగానే తన వాయిస్ వినిపించవచ్చు. ఈ రెండు కారణాలతోనే షర్మిల ఇప్పుడు అసెంబ్లీ వైపు మొగ్గు చూపుతున్నారు. తనకు సేఫ్ గా ఉండే నియోజకవర్గాలను ఎంచుకునే పనిలో ఉన్నారు. రాయలసీమలో అయితే కలిసి వస్తుందన్న అంచనా. ఆపై కడప జిల్లాలో అయితే సునాయాసంగా విజయం సాధించవచ్చు అనేది ఆమె అభిప్రాయం. అందుకే కడప జిల్లాలో ఆమె అన్వేషణ ప్రారంభించినట్లు తెలుస్తోంది.కడప జిల్లాలో ప్రధానంగా రెండు నియోజకవర్గాలపై ఆమె దృష్టి పెట్టారు. ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గం పై ఫోకస్ పెట్టారు. దానికి కారణం లేకపోలేదు. ఆ నియోజకవర్గం తన తల్లి విజయమ్మ పుట్టినిల్లు. తన మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి అక్కడ ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ నియోజకవర్గ అయితే సేఫ్ జోన్ గా ఉంటుందని భావిస్తున్నట్లు సమాచారం. కడప నియోజకవర్గం పై కూడా ఆమె దృష్టి పెట్టారట. జిల్లా కేంద్రం కావడంతో అక్కడ నుంచి రాజకీయాలు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయానికి వస్తున్నారట. పైగా కడప అసెంబ్లీ నియోజకవర్గంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబ అభిమానులు ఎక్కువ. మరి షర్మిల ఎలాంటి అడుగులు వేస్తారో చూడాలి.

# కమలంపై పసుపు గుర్రు

**విశాఖపట్టణం(భారత శక్తి)** ఏపీలో కూటమి ప్రభుత్వానికి సారథ్యం వహిస్తోంది తెలుగుదేశం. కేంద్ర ప్రభుత్వంలో సైతం కీలక భాగస్వామి. అందుకే రాష్ట్ర ప్రయోజనాల తో పాటు రాజకీయ ప్రయోజనాల విషయంలో రాష్ట్రానికి పెద్ద పీట వేస్తోంది కేంద్రం. అయితే అదే స్థాయిలో ఏపీ నుంచి బిజెపి ప్రాతినిధ్యం కోరడం తెలుగుదేశం పార్టీకి లోటు. తాజాగా రాజ్యసభ పదవులకు సంబంధించిన ఎంపిక విషయంలో బిజెపి పట్టుబడుతుండడంతో టిడిపి సీనియర్లు మదన పడుతున్నారు. మరోసారి ఏపీ నుంచి రాజ్యసభ పదవి కోరుతోంది బిజెపి. కానీ ఆ పదవులపై ఆశలు పెట్టుకున్న తెలుగుదేశం సీనియర్లు పెదవి విరుస్తున్నారు. ఎన్ని రోజులపాటు పార్టీ కోసం కష్టపడితే.. తమకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతుందని.. తమకు వచ్చే అవకాశాలను బిజెపి తన్నుకుపోతోందని ఆవేదనతో ఉన్నారు.ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. టిడిపి సీనియర్లు చాలామంది పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇందులో సీట్లు త్యాగం చేసిన వారు ఉన్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న వారు ఉన్నారు. అయితే ఈ రెండేళ్ల కాలంలో రెండుసార్లు రాజ్యసభ, అదే స్థాయిలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ జరిగింది. ఆ సమయంలో బిజెపి ఎంట్రీ ఇస్తోంది. పదవులను తీసుకుంటోంది. రెండుసార్లు రాజ్యసభ పదవి అలానే తీసుకుంది. ఎమ్మెల్సీ పదవులను సైతం కూటమి ఖాతాలో పొందింది. ఇప్పుడు మరోసారి రాజ్యసభ పదవి కోరుతుండడంపై టిడిపి సీనియర్లలో ఆగ్రహం వ్యక్తం అవుతోంది.ఒకసారి బిజెపితో చెడి చాలా రకాలు ఇబ్బందులు పడ్డారు చంద్రబాబు. అందుకే కేంద్ర పెద్దలతో సఖ్యత గా గడుపుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. ఆ పదవులన్నీ టిడిపి కూటమికి దక్కనున్నాయి. అయితే ఇప్పుడు ఆ నాలుగింటిలో ఒక పదవిని కోరుతోంది బిజెపి. జనసేనకు ఒకటి సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆ పార్టీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం లేదు. అందుకే కచ్చితంగా ఇవ్వాల్సి ఉంటుంది. అయితే బిజెపితో పాటు జనసేనకు రెండు పోతే టిడిపికి మిగిలేది కేవలం రెండు మాత్రమే. ఆ రెండింటిలో పదవీ విరమణ చేస్తున్న సానా సతీష్ కు కొనసాగింపు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక మిగిలింది ఒకటే. దానికోసం చాలామంది ఆశావహులు ఎదురుచూస్తున్నారు. బిజెపి పోటీలో లేకపోతే.. టిడిపి కి మూడు, జనసేనకు ఒకటి తేలిపోయేది. అలా కాకుండా బిజెపి సైతం ఒక పదవి కోరుతుండడం పై టీడీపీ సీనియర్లు ఆగ్రహంగా ఉన్నారు. కానీ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా సర్దుబాటు చేసుకోవాల్సిందని చంద్రబాబు భావిస్తున్నారు. కానీ ఇన్ని రోజులు పార్టీ కోసం పనిచేసిన తమ పరిస్థితి ఏంటి అని టిడిపి సీనియర్లు మదనపడుతున్నారు.

# ఒక్క ఛాన్స్ అంటున్న తమ్ముళ్లు...

**గుంటూరు,(భారత శక్తి)** ఒక్క 'ఛాన్స్'- ఈ మాట ఏపీ ప్రజలకు కొత్తకాదు. నాయకులకు కూడా కొత్తకాదు. అయితే.. ఇప్పుడు ఈ మాట క్షేత్రస్థాయినాయకుల నోటి నుంచి వినిపిస్తోంది. పదవులు దక్కని వారు కూటమి పార్టీల్లో చాలా మంది ఉన్నారు. వారంతా ఒక్క ఛాన్స్ కోసం వేచి చూస్తున్నారు. మరో 1000కిపైగా పోస్టులను భర్తీ చేయాల్సి ఉందని చెబుతున్నారు. అదే సమయంలో మంత్రి వర్గంపై ఆశలు పెట్టుకున్న టీడీపీ సీనియర్లు కూడా వేచి చూస్తున్నారు. ఇక, వైసీపీ విషయానికి వస్తే.. పార్టీ పరంగా పుంజుకుంటుందో లేదో వారు అంచనాలు వేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి కూడా పార్టీ పుంజుకునే పరిస్థితి లేకపోతే.. ఎవరిక వారు సొంత దారులు వెతుక్కు నేందుకు తమ ఛాన్స్ తాము చూసుకునేందుకు రెడీ అవుతున్నారు. ఇలాంటి వారిలో ఎక్కువ మంది జనసేనపైనే ఆశలు పెట్టుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు జనసేన ఒంటరి పోరుకు రెడీ అవుతుందన్న క్లూ ఇచ్చినా.. పదుల సంఖ్యలో పెద్ద నేతలు వైసీపీకిరాం రాం చెప్పడం ఖాయమని తెలుస్తోంది. తమ కు అనుకూలంగా ఉండే పార్టీలనే ఎంచుకుంటున్నారు. కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ శిబిరాలు ఖాళీ అయ్యాయి. నాయకులు ఉన్నా..జెండా మోసే కార్యకర్తలు లేరు. వీరంతా కూడా.. తమకు కలిసి వచ్చిన పార్టీ కోసం వేచి ఉన్నారు. మహిళా నాయకులది కూడా దాదాపు ఇదే దారిగా కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన ఉంటే సరే.. లేకపోతే.. తమకు అవకాశం ఇచ్చే పార్టీవైపు చూస్తున్న వారు లెక్కలు వేస్తున్నవారు కూడా పెరుగుతున్నా రు.. పదవులు దక్కే అవకాశం తక్కువగానే ఉందని అంచనా వేస్తున్నవారు..

రాజకీయాలకు దూరంగా ఉండాలని భావిస్తున్నారు. అదేసమయంలో అవకాశం కోసం చూస్తున్న వారసులు రాజకీయాలను వేడెక్కిస్తున్నారు. ఇలా.. రకరకాలుగా రాష్ట్రంలో రాజకీయాలు మార్పు దిశగా అడుగులు వేస్తున్నాయి. ఎవరి నోట విన్నా.. ఒక్క ఛాన్స్ కోసం చూస్తున్నామన్న మాటే వినిపిస్తుండడ గమనార్హం. మరి ఆ ఛాన్స్ ఏ పార్టీ ఇస్తే. ఆ పార్టీకే ఇప్పుడు జై కొట్టేందుకు నాయకులు సిద్ధపడడం గమనార్హం.

# పొగలో ప్రజల వంటలు

**- ప్రచారాల్లో మాత్రమే అభివృద్ధి: గ్యాస్ కొరతపై కట్టెల పొయ్యితో నిరసన తెలిపిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**పెద్దపల్లి (భారత శక్తి)**గ్యాస్ కొరతతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రతిబింబిస్తూ, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కట్టెల పొయ్యిపై స్వయంగా వంట చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ గారు మాట్లాడుతూ, "దేశం అంతర్జాతీయ వేదికలపై గొప్పగా కనిపించడం ఒక వైపు అయితే, గ్రామాల్లో ప్రజలు గ్యాస్ సిలిండర్ లేక మళ్లీ కట్టెలకు వెళ్లాల్సిన పరిస్థితి మరో వైపు ఉంది. ఇది కేంద్ర ప్రభుత్వ విధానాల వైఫల్యానికి నిదర్శనం" అన్నారు.గ్యాస్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడడంతో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు మళ్లీ పొగలో వంట చేయాల్సి రావడం దురదృష్టకరమన్నారు.ప్రచారాలకంటే ప్రజల ప్రాథమిక అవసరాలపై దృష్టి పెట్టాలని, గ్యాస్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారి తరఫున పోరాటం కొనసాగిస్తామని ఎంపీ స్పష్టం చేశారు.

# టీడీపీలో షాడోల రాజ్యం

**విజయనగరం (భారత శక్తి)**విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం అంటే గుర్తుకు వచ్చేది పూసపాటి వారి కుటుంబమే. మూడు తరాలుగా వారు ఎమ్మెల్యేలుగా ఈ ప్రాంతాన్ని పాలిస్తున్నారు. పీవీజీ రాజుతో మొదలైన వారి ప్రజా ప్రాతినిధ్యం ఆయన మనవరాలు అదితి గజపతిరాజు దాకా కొనసాగుతోంది. మధ్యలో అశోక్ గజపతి రాజు ఏడు సార్లు గెలిచి అనేక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. ఇపుడు ఆయన గోవా గవర్నర్ గా రాజ్యాంగ బద్ధ బాధ్యలతో బిజీగా ఉన్నారు. ఆయన కుమార్తెగా వారసురాలిగా 2019లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన అదితి గజపతి రాజు ఆ ఎన్నికల్లో ఓటమి పాలు అయినా 2024 లో గెలిచి తన సత్తా చాటుకున్నారు. ఇక గెలిచిన తరువాత ఎమ్మెల్యే పెద్దగా జనంలోకి రారు అన్న విమర్శలు అయితే వినిపిస్తున్నాయి. నిత్యం ప్రజలతో మమేకం కావాలని పార్టీ ఆదేశాలు ఒక వైపు ఉంటే ఎమ్మెల్యే మాత్రం తనదైన శైలిలో రాజకీయం చేస్తున్నారు అని అంటున్నారు. ఆమెకు పార్టీలో ఇద్దరు కీలక నేతలు షాడోలుగా మారారని అంటున్నారు. జనంలో ఏ మాత్రం పలుకుబడి లేని ఈ ఇద్దరు నాయకులలో ఒకరు వైసీపీ నుంచి వచ్చి టీడీపీలో చేరిన వారు అయితే మరొకరు సెటిల్మెంట్స్ చేస్తూ ఏకంగా ఎమ్మెల్యే దగ్గర తన పలుకుబడి పెంచుకుని అతి ముఖ్య సలహాదరుగా మారిపోయారని అంటున్నారు. ఇపుడు సీన్ ఎలా ఉంది అంటే ఈ ఇద్దరి సలహా సంప్రదింపులు లేకుండా ఎమ్మెల్యే కనీసం ఏదీ వినే పరిస్థితి లేదని సొంత పార్టీలోనే గుసగుసలు పోతున్నారు. ఇదే ఇపుడు ప్రచారంలో కూడా ఉంది. పర్యవసానంగా అంతా వారే అన్నట్లుగా పరిస్థితి మారింది. వారు ఏమి చెబితే అదే జరుగుతోందని ఒక విధంగా షాడో ఎమ్మెల్యేలుగా వారు మారిపోయారని అంటున్నారు. ఇక ప్రతీ విషయం వారు కనుసన్నలలోనే సాగుతోందని వారికి తెలియకుండా ఎమ్మెల్యే కూడా ఏమీ చేయడం లేదని అంటున్నారు. దీతో ఉద్యోగుల బదిలీల నుంచి కాంట్రాక్టుల కేటాయింపులు అధికారిక వ్యవహారాలు అన్నీ కూడా ఈ ఇద్దరే చక్కదిద్దుతున్నారని అంటున్నారు. వీరి వల్ల మేలు జరగకపోగా పార్టీకి చెడ్డ పేరు వస్తోందని ప్రభుత్వానికి ఇబ్బందిగా ఉందని అంటున్నారు.

ఇక అశోక్ గజపతి రాజు అయితే అను నిత్యం కార్యకర్తలతో మమేకం అయ్యేవారు. ఆయనకు క్షేత్ర స్థాయిలో జరిగే ప్రతీ విషయం మీద అవగాహన ఉండేదని అంటున్నారు. అందుకే ఆయన సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా గెలిచి జనం గుండెలలో నిలిచారు అని అంటున్నారు. దానికి భిన్నంగా వారసురాలి పాలన సాగుతోంది అని అంటున్నారు. ఎంతసేపూ షాడోల మీద ఆధారపడడం వల్ల సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. తాజాగా చూస్తే విజయనగరం కార్పోరేషన్ లో ఏకంగా 28 మంది అధికారులను ఒక్కసారిగా బదిలీ చేయడం సంచలనం అయింది. దీని వెనక షాడోల ప్రమేయం ఉందని అంటున్నారు.

ఈ తరహా పరిణామాలు పార్టీలో మొదటి నుంచి ఉంటూ వస్తున్న సీనియర్ నేతలకు ఏ మాత్రం జీర్ణించుకోలేనివి గా ఉన్నాయని చెబుతున్నారు. మరి ఎమ్మెల్యే తీరు మార్చుకుని షాడోల పాలనకు చెక్ పెట్టకపోతే రానున్న రోజులలో పర్యవసనాలు కూడా వేరేగా ఉండొచ్చు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో. ఈ ప్రచారంలో ఏ మేరకు నిజం ఉందో.

# ఎదురెదురుగా ఢీకొన్న బైకులు.. ఒకరు మృతి

**గన్నవరం(భారత శక్తి)** గన్నవరం- కంకిపాడు రోడ్డులో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మృతుడు కేసరపల్లి గ్రామానికి చెందిన వేముల శేషగిరి(33)గా గుర్తించారు. మరొకరికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కంకిపాడు పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఢిల్లీలో టీడీపీ ఆఫీస్

**న్యూఢిల్లీ,(భారత శక్తి)** దేశ రాజధాని ఢిల్లీలో తెలుగోడి ఆత్మ గౌరవానికి తూట్లు పడుతున్నాయని నాడు తెలుగు ప్రజల ఆరాధ్య దైవం దివంగత నందమూరి తారక రామారావు ఆవేదనకు లోనయ్యారు. అలాంటి పరిస్థితులను రూపుమాపి.. ఢిల్లీ నడి వీధుల్లో తెలుగోడి పవర్ ఏమిటో చూపాలన్న కసితో సాగిన ఎన్టీఆర్? తెలుగు దేశం పార్టీ (టీడీపీ)పేరిట పార్టీని స్థాపించి సత్తా చాటారు.ఎన్టీఆర్ చేతుల్లో పురుడు పోసుకున్న టీడీపీ జెండా ఇప్పుడు ఢిల్లీ నడి వీధుల్లో రెపరెపలాడనుంది. అది కూడా ఢిల్లీలోని ఏదో మూల అనుకుంటే తప్పులో కాలేసినట్టే. ఎందుకంటే? ఢిల్లీ నగరం నడిమధ్యలో సిటీ ప్రైమ్ లొకేషన్ లో టీడీపీ తన కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు వేగంగా అడుగులు పడుతున్నాయి.టీడీపీ ఆవిర్భవించి అప్పుడే నాలుగు దశాబ్దాలు గడిచిపోతున్నా? దేశ రాజకీయాల్లో చాలా సార్లు కీలక పార్టీగా పనిచేసినా.. ఇప్పటిదాకా దేశ రాజధాని నగరం ఢిల్లీలో పార్టీకి కార్యాలయం అంటూ లేదు. టీడీపీ వ్యవస్థాపకుడైన ఎన్టీఆర్ కు భారత రత్న ఇవ్వాలన్న డిమాండ్ ను నిత్యం వినిపిస్తూ వస్తున్న టీడీపీ నేతలు? పార్టీకి ఢిల్లీలో కేంద్ర కార్యాలయం గురించి అంతగా పట్టించుకోలేదనే చెప్పాలి. అయితే తన నలభై ఏళ్ల ప్రస్థానంలో దేశ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతంగా సాగుతున్న టీడీపీకి ఇప్పుడు ఢిల్లీలో కార్యాలయం కావాలని పార్టీ అధిష్ఠానం భావించింది.అనుకున్న వెంటనే ఆ విషయాన్ని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు వద్ద ప్రతిపాదించింది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుకు ఊపిరిగా నిలుస్తున్న టీడీపీ అడగడమే ఆలస్యం అన్నట్లుగా కేంద్రం.. ఈ ప్రతిపాదనపై వేగంగా స్పందించింది. టీడీపీ ప్రతిపాదనను త్వరితగతిన పరిశీలించాలంటూ ఢిల్లీ సర్కారుకు ఆదేశాలు జారీ చేసింది.వెరసి టీడీపీ ప్రపోజల్ ను తెరచిన ఢిల్లీ సర్కారు? శరవేగంగా దానిపై ఓ నిర్ణయం తీసుకుంది. తాను చేసిన ప్రతిపాదనకు ఢిల్లీ సర్కారు నుంచి వచ్చిన స్పందనకు టీడీపీ ఓకే అనడమే ఆలస్యం క్షణాల్లో టీడీపీ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి అవసరమైన స్థలం ఇట్టే దక్కిపోతుంది. ఆపై కళ్లు మూసి తెరిచేలోగానే ఢిల్లీ నడి వీధుల్లో తెలుగోడి ఆత్మ గౌరవాన్ని రెపరెపలాడించేలా టీడీపీ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది.దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషిస్తున్న టీడీపీ.. ఢిల్లీ తన కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావిస్తోందని ఆ పార్టీ అధిష్ఠానం కేంద్రానికి ఓ ప్రతిపాదన పంపింది. పార్టీ కార్యాలయం కోసం 2 వేల చదరపు మీటర్ల స్థలం కావాలని కోరింది. కేంద్రం ఆదేశాలతో ఈ ప్రతిపాదనను పరిశీలించిన ఢిల్లీ సర్కారు? దీన్ దయాళ్ మార్గ్ లో బీజేపీ కేంద్ర కార్యాలయం పక్కనే ఖాళీగా ఉన్న 1,200 చదరపు మీటర్ల స్థలాన్ని గుర్తించింది.ఎలాంటి వివాదాలు లేని ఈ స్థలాన్ని టీడీపీకి తక్షణమే బదలాయించవచ్చని ఢిల్లీ చీఫ్ ఆర్కిటెక్ట్ కేంద్రానికి సిఫారసు చేశారు. ఈ విషయాన్ని టీడీపీకి చేరవేసిన కేంద్రం? తక్షణమే ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరింది. వెరసి తెలుగోడి ఆత్మ గౌరవానికి తూట్లు పడిన అదే ఢిల్లీ నడి వీధుల్లో అదే తెలుగోడి ఆత్మ గౌరవం సగర్వంగా నిలవనుంది.

## ‘బ్యాడ్ బాయ్ కార్తీక్’

# మూవీ రివ్యూ!



తెలుగు తెరపై హ్యాండ్ సమ్ కటౌట్ గా కనిపించే హీరోలలో నాగశౌర్య ఒకరు. ఆరంభంలోనే వరుస విజయాలను అందుకుంటూ వచ్చిన నాగశౌర్య, ఆ తరువాత లవర్ బాయ్ ఇమేజ్ నుంచి బయటకి రావడం కోసం, యాక్షన్ పాళ్లు ఎక్కువగా ఉన్న కథలను ఎంచుకుంటూ వచ్చాడు. అలా ఆయన చేసిన సినిమానే ‘బ్యాడ్ బాయ్ కార్తీక్’. ఏప్రిల్ 17వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ నెల 15వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. కార్తీక్ (నాగశౌర్య) తన అక్కయ్య కస్తూరి (శ్రీదేవి విజయ్ కుమార్) ... బావ వాసు (అజయ్)తో కలిసి ‘వైజాగ్’ లో నివసిస్తూ ఉంటాడు. శ్రీదేవి అడ్వకేట్ గా పనిచేస్తూ ఉంటుంది. అదే వైజాగ్ లో సాయి విక్రమ్ (సాయి కుమార్) పోలీస్ ఆఫీసర్ గా ఉంటాడు. ఆయన కూతురు ‘మహా’ (విధి యాదవ్)ను కార్తీక్ ఇష్టపడుతూ ఉంటాడు. బీటెక్ పూర్తిచేసిన కార్తీక్, ఊళ్లో అల్లర చిల్లరగా తిరుగుతూ ఉండటంతో, అతణ్ణి పై చదువుల కోసం ఫారిన్ పంపించాలనే ఆలోచనలో కస్తూరి ఉంటుంది. ‘కదిరి’లో వరదారెడ్డి (సముద్రఖని) గోవిందప్ప (మైమ్ గోపీ) మధ్య ఫ్యాక్షన్ గొడవలు నడుస్తూ ఉంటాయి. వరదారెడ్డి చెల్లెలు గోవిందప్ప అన్నయ్య మునెప్పను ప్రేమిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న వరదారెడ్డి, తన వాళ్లతో మునెప్పను చంపిస్తాడు. అప్పటి నుంచి వరదారెడ్డిపై ప్రతీకారంతో గోవిందప్ప రగిలిపోతుంటాడు. సరైన సమయం కోసం అతను వెయిట్ చేస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలోనే తన అక్కయ్య కస్తూరిని హత్య చేయించడానికి గోవిందప్ప ప్రయత్నిస్తున్న విషయం కార్తీక్ కి తెలుస్తుంది. అందుకు గల కారణం ఏమిటనేది తెలుసుకోవడం కోసం, కార్తీక్ వైజాగ్ నుంచి కదిరి వెళతాడు. అక్కడ ఏం జరుగుతుంది? కస్తూరి పై గోవిందప్పకి గల కోపానికి కారణం ఏమిటి? వరదారెడ్డితో ముడిపడిన ఆ అక్కాతమ్ముళ్ల గతం ఎలాంటిది? అనేది కథ. ఈ కథ వైజాగ్ – కదిరి మధ్య జరుగుతుంది. ఇది అక్కాతమ్ముళ్ల ఎమోషన్స్ కి సంబంధించిన కథ. ఈ రెండు పాత్రలతో పాటు అంతే ప్రధానమైనవిగా వరదారెడ్డి – గోవిందప్ప పాత్రలు కనిపిస్తాయి. ఈ నాలుగు పాత్రలను ప్రధానంగా చేసుకునే ఈ కథ ముందుకు వెళుతూ ఉంటుంది. ఇక ఆ తరువాత స్థానంలో సాయికుమార్ .. అతని కూతురు మహా (హీరోయిన్) పాత్రలు ముఖ్యమైనవిగా దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు. ఒక వైపున వైజాగ్ లో తమ్ముడు గురించి అక్క ఆందోళన చెందుతూ ఉంటుంది. మరో వైపున కదిరిలో విలన్స్ మధ్య గొడవగా ఉంటుంది. ఈ రెండు ట్రాకుల మధ్య సంబంధం ఉందనే విషయాన్ని దర్శకుడు హింట్ ఇస్తూ వెళుతుంటాడు. ఆ ఫ్లాష్ బ్యాక్ ఏమిటనేది తెలుసుకోవాలనే కుతూహలంతో ప్రేక్షకులు ఉంటారు. దర్శకుడు ఈ విషయాన్ని రివీల్ చేసిన తీరు కూడా బాగుంది .. ఆ ట్విస్ట్ చాలా కీలకమైనదని కూడా అనిపిస్తుంది. ఇంటర్వెల్ బ్యాంగ్ .. ఆ తరువాత కథపై ఆసక్తిని పెంచేదిలా ఉంటుంది. సెకండాఫ్ లో కార్తీక్ కోసం వరదారెడ్డి అనుచరులు గాలించడం .. అక్కాతమ్ముళ్ల ఫ్లాష్ బ్యాక్ రివీల్ అయ్యేవరకూ బాగానే అనిపిస్తుంది. ఇక ఎప్పుడైతే వెన్నెల కిశోర్ ఎంట్రీ ఇస్తాడో అప్పటి నుంచి కథ కాస్త కామెడీ వైపు టర్న్ తీసుకుని చప్పబడిపోయినట్టుగా అనిపిస్తుంది. నాగశౌర్య పాత్రను, సముద్రఖని .. మైమ్ గోపీ పాత్రలను డిజైన్ చేసిన తీరు బాగుంది. వాళ్ల నటన కూడా బాగుంది. కార్తీక్ .. అతని లవర్ కి సంబంధించిన రొమాన్స్ కి అవకాశం లేకుండా చేశారు. అందువలన ఆ వైపు నుంచి ఆడియన్స్ కి మిగిలేది నిరాశే. ఇక సాయికుమార్ పాత్రను డిజైన్ చేయడంలో కూడా క్లారిటీ లేదనిపిస్తుంది. అలాగే ఎలాంటి విషయం లేకుండా అజయ్ పాత్రను వదిలేశారు. రసూల్ ఎల్లోర్ ఫొటోగ్రఫీ బాగుంది. హారీస్ జైరాజ్ సంగీతం ఫరవాలేదు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ ఓకే. కథలోని అక్కాతమ్ముళ్ల ఫ్లాష్ బ్యాక్ కి సంబంధించిన ట్విస్ట్ బాగుంది. కానీ ఎమోషన్స్ వైపు నుంచి .. యాక్షన్ వైపు నుంచి నడిచే డ్రామా రొటీన్ గా అనిపిస్తుంది. రొమాన్స్ కి ఛాన్స్ ఇవ్వకపోవడం మరో లోపంగా అనిపిస్తుంది.

## ప్రతిసారి మగాడిదే

# తప్పుని చెప్పలేం

### – జయం రవికి అండగా మీరా చోప్రా



తమిళ చిత్ర పరిశ్రమలో (కోలీవుడ్) నటుడు జయం రవి విడాకుల వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారడమే కాకుండా, పరిశ్రమలోని ప్రముఖులు ఆయనకు అనుకూలంగా, వ్యతిరేకంగా చీలిపోయే పరిస్థితిని తెచ్చింది. విడాకులు మంజూరయ్యే వరకు తాను సినిమాల్లో నటించనని, తన చిత్రాలను విడుదల చేయనివ్వనని జయం రవి ప్రకటించడం, పెళ్లయిన నాటి నుంచి తాను నరకం అనుభవించానని మీడియా ముందు కన్నీరు పెట్టుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీనికి తోడు, జయం రవితో లింక్ చేస్తూ ప్రచారంలోకి వచ్చిన గాయని కెనీషా.. నాటకీయంగా ఆయనతో తన అనుబంధానికి ఫుల్ స్టాప్ పెట్టేశానని ప్రకటించింది. మరోవైపు జయం రవి భార్య ఆర్తి ‘నిద్రపోతున్న సింహాన్ని లేపవద్దు’ అంటూ హెచ్చరించడం, ఆమెకు సీనియర్ నటి ఖుష్బూ మద్దతుగా నిలవడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో ఒకప్పటి కథానాయిక మీరా చోప్రా జయం రవికి బాసటగా నిలుస్తూ సోషల్ మీడియా వేదికగా రంగంలోకి దిగడం ఆసక్తికరంగా మారింది. జయం రవితో సౌత్ సినిమాల్లో నటించే సమయం నుంచి తనకు మంచి పరిచయం ఉందని మీరా చోప్రా గుర్తుచేసుకున్నారు. జయం రవి విడాకుల వార్తలపై స్పందిస్తూ.. “ప్రతిసారి తప్పు మగవాడిదే అని చెప్పలేం. మహిళల పక్షాన ఉన్న చట్టాలను కొందరు దుర్వినియోగం చేస్తున్న సందర్భాలను కూడా నేను చూశాను. కాబట్టి పురుషుడి వైపు ఉన్న వాదనను కూడా వినాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నాకు తెలిసినంత వరకు జయం రవి చాలా మంచి వ్యక్తి. ఆయన విషయంలో నిజం గెలుస్తుందని, న్యాయం దక్కుతుందని ఆశిస్తున్నాను” అని ఎక్స్ వేదికగా జయం రవికి పూర్తి మద్దతు ప్రకటించారు. మీరా చోప్రా సినీ నేపథ్యం: దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఎస్.జె. సూర్య దర్శకత్వంలో వచ్చిన ‘అన్బే ఆరుయిరే’ చిత్రంతో మీరా చోప్రా కోలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత తెలుగులో ‘బంగారం’, ‘వాన’ వంటి పలు చిత్రాల్లో నటించి మెప్పించారు. గతంలో ఒక సినిమా దర్శక, నిర్మాతలపై ఆమె చేసిన పోరాటం అప్పట్లో మీడియాలో పెద్ద సంచలనంగా మారింది. ఆ తర్వాత దక్షిణాది చిత్రాలకు దూరమై బాలీవుడ్ (హిందీ) వైపు దృష్టి సారించిన ఆమె, ఇటీవల విడుదలైన సైలెంట్ మూవీ ‘గాంధీ టాక్స్’కు నిర్మాణ భాగస్వామిగా కూడా వ్యవహరించారు.

## గర్ల్‌ఫ్రెండ్ అంటే బానిస కాదు



ప్రముఖ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దర్శకత్వంలో సుధీర్‌రాజు, డి.వైష్ణవి నేహా నిర్మిస్తున్న చిత్రం ‘లలిత’. ‘గర్ల్‌ఫ్రెండ్ అంటే బానిస కాదు’ అనేది ఉపశీర్షిక. అభిలాష్ పీలా, అఖిల్ వివాస్, నందిని ప్రధానపాత్రధారులు. వ్యక్తిత్వం కోసం నిలబడే ఓ మహిళ కథగా ఈ చిత్రం రూపొందిందని, సామాజిక నేపథ్యంతో సందేశాత్మకంగా ఈ సినిమా సాగుతుందని మేకర్స్ వెల్లడించారు. రఘుబాబు, పృథ్వీరాజ్, తాగుబోతు రమేశ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: టి.సురేంద్రరెడ్డి, సంగీతం: మణి, నాగరాజు, నిర్మాణం: కాస్మిక్ పవర్ క్రియేట్స్ ఎల్‌ఎల్‌పీ.

## దశాబ్దంలో ఒకసారి వచ్చే సినిమా

‘మాటలతో కాదు..ఆటతో బరిలో గెలిచే మగతనం ఎవరికి ఉందో రమ్మను..’ అంటూ ప్రత్యర్థులకు సవాలు విసురుతున్నాడు ఆటకూలీ పెద్ది. మరి ఆయన పోరు ఎవరి మీదో చూచాయగా తెలుసుకోవాలంటే ట్రైలర్ మీద ఓ లుక్కేయాల్సిందే. మెగాభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న రామ్‌చరణ్ పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’ థియేట్రికల్ ట్రైలర్‌ను సోమవారం ముంబయిలో విడుదల చేశారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ట్రైన్ సీక్వెన్స్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఎమోషనల్‌గా సాగింది. పెద్ది తాలూకు ప్రపంచాన్ని పరిచయం చేయడం, అతన్ని క్రికెటర్‌గా, కుస్తీ యోధుడిగా, పరుగుల వీరుడిగా..ఇలా భిన్న ఆటల్లో ప్రావీణ్యం ఉన్నవాడిగా చూపించడం ఆసక్తిని పెంచింది. ‘మీరు అందరూ నేను ఆడానని అనుకుంటున్నారు.. కానీ నేను పోరాడాను’ అంటూ పెద్ది చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. రామ్‌చరణ్ మాట్లాడుతూ ‘ఇది చాలా నిజాయితీగా చేసిన సినిమా. ఓ యువకుడు గుర్తింపు కోసం చేసే ప్రయాణమిది. నా కెరీర్‌లో అత్యంత స్ఫూర్తివంతమైన సినిమా. ఇలాంటి సినిమాలు దశాబ్దంలో ఒకసారి మాత్రమే వస్తాయి. మగధీర, రంగస్థలం, ఆర్.ఆర్.ఆర్ లాంటి సినిమాలు తరచుగా రావు. ‘పెద్ది’ కూడా అలాంటి సినిమానే. నా లైబ్రరీలో ఎప్పటికీ దాచుకునే సినిమా’ అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మించారు. జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ, బొమన్ ఇరానీ తదితరులు కీలక పాత్రధారులు. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.



## కాక్‌టెయిల్ -2

### ఓ విభిన్నమైన ప్రేమకథ

రష్మిక మందన్న ప్రస్తుతం ముంబైలో బిజీబిజీగా ఉన్నారు. షాహిద్ కపూర్, కృతిసనన్‌లతో కలిసి ఆమె నటించిన ‘కాక్‌టెయిల్ 2’ చిత్రం జూన్ 19న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా గడుపుతున్నది రష్మిక మందన్న. తాజాగా ముంబైలో ఈ చిత్రబృందం ఓ మ్యూజికల్ ఈవెంట్‌ని నిర్వహించింది. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ “కాక్‌టెయిల్ 2’ ఊహలకు అందనంత గొప్పగా ఉంటుంది. ఇది చాలా భిన్నమైన సినిమా. ఈ డిఫరెంట్ ప్రేమకథను అందరూ ఎంజాయ్ చేస్తారు. కృతిసనన్ మామూలుగానే చాలా హాట్. ఈ సినిమాలో మరింత అందంగా కనిపిస్తుంది. షాహిద్‌తో మా ఇద్దరి కెమిస్ట్రీ ఓ రేంజ్‌లో ఉంటుంది. ట్రైలర్స్, టీజర్స్‌లో మీరు చూసింది చాలా తక్కువ. అసలు అప్‌డేట్స్ ముందున్నాయి. వాటికోసం మీతోపాటు నేనూ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా’ అంటూ చెప్పుకొచ్చింది రష్మిక. ఇక ‘కాక్‌టెయిల్ 2’ సినిమా విషయానికొస్తే.. ఇదొక త్రిముఖ ప్రేమకథ అని తెలుస్తున్నది. హోమీ అదజానియా దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందించారు.



Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy